


GST NO: 36ACPPF9587L2ZM TELTEL/2013/53323

# సమయజ్యోతి

ప్రతీ అక్షరం - ప్రజలకోసం

తెలుగు దిన పత్రిక

CELEBRATING 12TH YEAR ANNIVERSARY

సంపుటి : 12 సంచిక : 108 పేజీలు : 12 ఆదిలాబాద్ వెల రూ : 01 బుధవారం 02 జూలై 2025 ఎడిటర్ : ఫైసల్ ఖాన్




దివంగత షఫీఉల్లా ఖాన్
మాజీ మేనేజింగ్ ఎడిటర్



# పాశమైలారం ఘటనపై సీఎం సీరియస్

ప్రమాదానికి సంబంధించిన వివరాలు తెలుసుకోండి
ఇకముదు ఇలా జరక్కుండా చర్యలు తీసుకోండి
గతంట ఇలా జరిగిందా అన్నది ఆరా తీయండి
ప్రమాదస్థలిని పరిశీలించి.... అధికారులతో సిఎం సమీక్ష

2 లో



# 45 మంది సజీవ దహనం

## క్షతగాత్రుల్లో కొందరి పరిస్థితి విషమం
## కొనసాగుతున్న సహాయక చర్యలు

**పటాన్‌చెరు,జూలై 1(సమయజ్యోతి):**

సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచి ఫార్మాస్యూటికల్ కంపెనీలో జరిగిన భారీ పేలుడు ఘటనలో మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతున్నది. రియాక్టర్ పేలుడుతో ఇప్పటివరకు 45 మంది మరణించారు. వివిధ దవాఖానల్లో మరో 31 మంది చికిత్స పొందుతున్నారు. వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నది. దీంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. అయితే మరణించినవారిలో ఎక్కువ మంది తమిళనాడు, బీహార్, జార్ఖండ్ రాష్ట్రాలకు చెందినవారే ఉన్నారు. ఇప్పటివరకు ఏడు మృతదేహాలను గుర్తించగా, మరో 20 గుర్తుపట్టలేని స్థితిలో ఉన్నాయి. సోమవారం జగన్మోహన్, రామ్‌సింగ్ రాజ్‌బర్, శశిభూషణ్ కుమార్ మృతిచెందినట్లు గుర్తించగా, తాజాగా మరో ఆరుగురి పేర్లను అధికారులు ప్రకటించారు. లగ్నజిత్ దౌరి, బీ.హేమ సుందర్, రుక్సానా కతూన్, జీ.నికిల్ రెడ్డి, నాగేశ్వర్ రావు, పొలిషెట్టి ప్రసన్నగా గుర్తించారు. డీఎన్‌ఏ పరీక్షల అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించే అవకాశం ఉన్నది. అయితే మృతుల సంఖ్య 55కు పెరిగే అవకాశం ఉంది. బాయిలర్ పేలడంతో మూడంతస్తుల అడ్మినిస్ట్రేన్ భవనం కుప్పకూలిన విషయం తెలిసిందే. ఆ శిథిలాల కింద 20 మంది కార్మికులు చిక్కుకున్నారు. వారి కోసం ఎస్‌డీఆర్‌ఎఫ్, ఎన్‌డీఆర్‌ఎఫ్, రెవెన్యూ, హైడ్రా, ÷ర్ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. ధ్వంసమైన ఎ÷-లాంట్‌ను పక్కకు తొలగించారు. కాగా, ప్రమాదంపై సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మంగళవారం ఉదయం అధికారిక ప్రకటన చేశారు. మొత్తం 47 మంది గల్లంతయ్యారని, ఇప్పటి వరకు 26 మృతదేహాలు మాత్రమే లభ్యమయ్యాయని తెలిపారు. 20 మృతదేహాలు గుర్తుపట్టలేని స్థితిలో ఉన్నాయని చెప్పారు. 27 మంది కార్మికుల ఆచూకీ తెలియాలేదన్నారు. తీవ్ర గాయాలతో 35 మందికి దవాఖానల్లో చికిత్స అందుతున్నదని, అందులో 11 మంది పరిస్థితి విషమంగా ఉందని చెప్పారు. 57 మంది సురక్షితంగా ఇంటికి వెళ్లారని తెలిపారు.

# కెసిఆర్ హయాంలోనే బనకచర్లకు శ్రీకారం

## గోదావరి జలాలను సీమకు తరలించే యత్నం
## పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన ఉత్తమ్

**హైదరాబాద్,జులై 1(సమయజ్యోతి):**



ఏపీ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన పోలవరం - బనకచర్ల లింక్ ప్రాజెక్ట్‌పై ప్రతిపక్షాలు బాధ్యతా రాహిత్యంగా మాట్లాడుతున్నాయని తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. పోలవరం-బనకచర్లపై కేంద్రానికి మన అభ్యంతరాలను తెలిపామని తెలంగాణ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. బనకచర్ల ప్రాజెక్టు గోదావరి వాటర్ ట్రైబ్యునల్ తీర్పునకు వ్యతిరేకమని వాదించామన్నారు. ఏపీ ప్రభుత్వం చేసిన బనకచర్ల ప్రాజెక్టు ప్రతిపాదనను కేంద్రం వెనక్కి పంపిన నేపథ్యంలో మంత్రి ఉత్తమ్ ప్రజాభవన్‌లో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. 'పోలవరం, ధవళేశ్వరానికి కలిపి ఏపీ 484 టీఎంసీలకు మించి వాడుకోరాదు. పోలవరం నుంచి నీటి ఎత్తిపోతల కోసం 2 టన్నెల్ నిర్మాణాలు ప్రతిపాదించారు. రోజుకు 20వేల క్యూసెక్కులు తరలించేలా 2 టన్నెల్స్ ప్రతిపాదన పెట్టారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే బనకచర్ల ప్రాజెక్టుకు అంకురార్పణ జరిగింది. కృష్ణా గోదావరి జలాల్లో గత పదేళ్లలో రాష్ట్రానికి అన్యాయం జరిగింది. గోదావరి జలాలను సీమకు తరలిస్తుంటే కేసీఆర్ నోరెత్తలేదని మంత్రి ఉత్తమ్ అన్నారు. మంగళవారం ప్రజా భవన్‌లో బనకచర్లపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లతోపాటు ఉన్నతాధికారులు హాజరయ్యారు. అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. కృష్ణా నదిలో ఏపీకి ఎక్కువ నీళ్లు ఇచ్చేందుకు గత ప్రభుత్వం ఒప్పుకొని తెలంగాణ రాష్ట్రానికి బీఆర్ఎస్ తీరని ద్రోహం చేసిందని మండిపడ్డారు. గోదావరి జలాలను రాయలసీమకు తరలించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రయత్నాలు మొదలయ్యాయిని ఆయన గుర్తు చేశారు. అంతేకాకుండా తమ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారంటూ బీఆర్ఎస్ పార్టీ నేతలపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు.

## పాశమైలారం ఘటన
# దురదృష్టకరం

### ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలి
### సహాయక చర్యలు పరిశీలించి బాధితులకు
### పరామర్శ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పర్యటన

**సంగారెడ్డి,జులై 1(సమయజ్యోతి):**

పాశమైలారం పారిశ్రామికవాడలోని సిగాచి పరిశ్రమలో పేలుడు ఘటన చాలా దురదృష్టకరమైన సంఘటన అని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ ఘటనలో ఇప్పటి వరకు 48 మంది మృతదేహాలు సంఘటన స్థలంలో లభ్యమయ్యాయని చెప్పారు. ఇంకా 11 మంది ఆచూకీ లభ్యం కావాల్సి ఉందన్నారు. సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయి తెలిపారు. మంగళవారం సంగారెడ్డి జిల్లాలోని పాశమైలారంలో ఘటన స్థలాన్ని బీజేపీ తెలంగాణ రాష్ట్ర కొత్త అధ్యక్షుడు ఎన్ రామచందర్ రావుతో కలిసి ఆయన సందర్శించారు. అనంతరం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ సంస్థ ఫార్మా కంపెనీలకు రా మెటీరియల్ అందిస్తుందన్నారు. గతంలో సైతం ఒక పరిశ్రమలో షార్ట్ సర్క్యూట్ కారణంగా 11 మంది చనిపోయారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. మిగతా 2లో





# ఇందిరమ్మ రాజ్యంతో మళ్లీ పాతరోజులు

## యూరియా కోసం రైతుల పడిగాపులు - కెటిఆర్

**హైదరాబాద్,జులై 1(సమయజ్యోతి):**

ఇందిరమ్మ రాజ్యం వచ్చింది.. ఆనాటి రోజులు తిరిగి తెచ్చిందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఎక్స్ వేదికగా విమర్శించారు.యూరియా కోసం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) మండలంలో రైతులు, మహిళలు బారులు తీరారని పేర్కొన్నారు. ఈ మేరకు యూరియా కోసం వందలాది మంది రైతులు ఇబ్బంది పడుతున్న వీడియోను కెటిఆర్ ఎక్స్‌లో పోస్టు చేశారు. మ ఇళ్లు కూల్చొద్దని, హైకోర్టు స్టే ఆర్డర్ ఉందని నిరుపేదలు నెత్తి నోరు మొత్తుకున్నా ఈ కాంగ్రెస్ ప్రభుత్వం కనికరం చూపకపోవడం అత్యంత దుర్మార్గం అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి కొడంగల్లో రెడ్డికుంటని పూడ్చి మహల్ కట్టవచ్చు, ఆయన అన్న తిరుపతి రెడ్డికి దుర్గం చెరువు ఎఫ్‌టిఎల్‌లో ఇల్లు ఉండవచ్చు, రెవిన్యూ మంత్రి హిమాయత్ సాగర్‌లో ప్యాలసులు కట్టవచ్చు, చీఫ్ విప్ మహేందర్ రెడ్డి చెరువు నడుమ గెస్ట్ హౌస్ కట్టవచ్చు, కేవీపీ లాంటి పెద్దలు చెరువు బఫర్‌లో గెస్ట్ హౌసులు కట్టుకోవచ్చు?పెద్ద బిల్డర్లు సిఎంకు లంచం ఇచ్చి మూసి నదిలోనే అపార్ట్‌మెంట్స్ కట్టుకోవచ్చు.



# భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రెవెన్యూ సదస్సులు

## దరఖాస్తులను పరిశీలించి పరిష్కరిస్తాం
## రెవెన్యూ అధికారులతో సమీక్షలో మంత్రి పొంగులేటి

**హైదరాబాద్,జులై 1(సమయజ్యోతి):**

తెలంగాణలో భూసమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహించిన రెవెన్యూ సదస్సులో వచ్చిన ప్రతి దరఖాస్తుపై సమగ్ర పరిశీలన ఉంటుందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. అన్నింటినీ పరిశీలించి పరిష్కరిస్తామని అన్నారు. మంగళవారం రెవెన్యూ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చినట్లు తెలిపారు. భూ సమస్యలను పరిష్కరించే లక్ష్యంతో ఏప్రిల్ 17 నుంచి జూన్ 20 వరకు దశల వారీగా రెవెన్యూ సదస్సులను నిర్వహించినట్లు వివరించారు. రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన దరఖాస్తులు, వాటిని భూభారతి పోర్టల్‌లో నమోదు పక్రియ తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన ప్రతి దరఖాస్తును సమగ్రంగా పరిశీలించి అర్హమైన వాటిని పరిష్కరించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రతి దరఖాస్తుపై సరైన విచారణ జరపాలని, సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేయాలని మంత్రి సూచించారు. అవసరమైన డాక్యుమెంట్లు, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి ఆధారాలన్నింటినీ ఒకే డాక్యుమెంట్‌గా భూభారతి పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. తిరస్కరణకు గురైన దరఖాస్తులను ఎందుకు తిరస్కరించాల్సి వచ్చిందో వివరాలను రాతపూర్వకంగా దరఖాస్తుదారులకు పంపాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 594 మండలాల్లో 10,226 రెవెన్యూ సదస్సులు నిర్వహించి తద్వారా వచ్చిన 8,27,230 దరఖాస్తుల్లో ఇప్పటి వరకు 7,98,528 దరఖాస్తుల డేటాను భూభారతి పోర్టల్‌లో నమోదు చేసినట్లు మంత్రి వివరించారు. మిగిలిన వాటిని కూడా ఒకటి రెండు రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. సర్వే నంబర్లలో లోపాలు పీపీబీ, ఆర్వోఆర్, నాలా, ఆర్ఎస్ఆర్ సవరణ, అప్పీల్స్, కోర్టు కేసులు, పోడు భూములు తదితర 30 రకాల భూ సమస్యలకు చెందిన 8.27 లక్షల దరఖాస్తులు వచ్చినట్లు మంత్రి పొంగులేటి పేర్కొన్నారు.

మొదటి పేజీ తరువాయి

# పాశమైలారం ఘటనపై సిఎం సీరియస్

**సంగారెడ్డి,జూలై 1(సమయజ్యోతి):**

పాశమైలారం ప్రమాదంపై సిఎం రేవంత్ రెడ్డి ఆరా తీసారు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు సేకరించాలని, గతంలో ఇలాగా ఎప్పుడైనా జరిగిందా అన్నది తెలుసుకోవా లన్నారు. ప్రమాద స్థలిని సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారంఉదయం అధికారులు, మంత్రులతో కలసి పరిశీలించారు. అనంతరం పరిశ్రమలశాఖ అధికారులు, మంత్రులతో సమీక్షించారు. ప్రమాదం జరిగిన పరిశ్రమలో పరిశ్రమలశాఖ అధికారులు, బాయిలర్స్ డైరెక్టర్స్ తనిఖీలు చేశారా? బాయిలర్లను తనిఖీ చేసి ఏమైనా సమస్యలు గుర్తించారా? బాయిలర్ల పనితీరుపై యాజమాన్యానికి ఏమైనా సూచనలు చేశారా? అని ప్రశ్నించారు. పరిశ్రమల్లో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా నివారించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలనే దానిపై అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. ఈ పరిశ్రమలో గతంలో ఏమైనా ప్రమాదాలు జరిగాయా అని ప్రశ్నించారు. ఊహాజనిత సమాధానాలు చెప్పవద్దని స్పష్టం చేశారు. ప్రమాద ఘటనపై సమగ్ర దర్యాప్తు చేసి పూర్తి స్థాయి నివేదిక సమర్పించాలని సీఎం ఆదేశించారు. ప్రమాద ఘటనపై నివేదిక కోసం నిపుణులను నియమించాలని సూచించారు. నిపుణులతో చర్చించిన తర్వాతే సమగ్ర నివేదిక ఇవ్వాలన్నారు. కార్మికులకు బీమా సదుపాయం ఉందా అని అడిగి తెలుసుకున్నారు. పరిశ్రమకు అనుమతులు, భద్రతా ప్రమాణాలపై ఆరా తీశారు. సిగాచీ పరిశ్రమకు సంబంధించిన మొత్తం సమాచారం సేకరించాలని ఆదేశించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్ని పరిశ్రమల్లో తనిఖీలు చేపట్టాని స్పష్టం చేశారు. ఇలాంటి ప్రమాద సమయంలో మానవత్వంతో వ్యవహరించాలని అధికారులకు సూచించారు. పరిహారం విషయంలో తీసుకున్న నిర్ణయం చెప్పాలని కంపెనీ ప్రతినిధిని అడిగారు. ప్రమాదంపై కంపెనీ యాజమాన్యం బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు. పరిశ్రమలో పనిచేసే వారి నైపుణ్యాల గురించి సీఎం ఆరా తీశారు. ప్రమాదం జరిగి 24 గంటలు దాటినా యాజమాన్యం ఘటనా స్థలికి రాకపోవడం బాధాకరమని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ఘటనను ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందన్నారు. ప్రమాద ఘటనను కార్మిక, వైద్యశాఖ మంత్రులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. సీఎం వెంట మంత్రులు శ్రీధర్‌బాబు, దామోదర రాజనర్సింహ, వివేక్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు. నిన్న ఉదయం పాశమైలారంలోని సిగాచీ పరిశ్రమలో పేలుడు సంభవించిన ఘటనలో ఇప్పటి వరకు 36 మంది మృతి చెందారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు.

మొదటి పేజీ తరువాయి

# పాశమైలారం ఘటన దురదృష్టకరం

ఈ తరహా ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు ఉన్నతాధికారులతో ఒక బృందాన్ని ఏర్పాటు చేయాల్సి ఉందని ప్రభుత్వానికి ఆయన సూచించారు. పరిశ్రమల్లో తనిఖీలు, లంచాల కోసం జరుగుతున్నాయా..? లేక నామ్ కే వాస్తే ప్రకారం జరుగుతున్నాయా..? అంటూ ఆయన సందేహం వ్యక్తం చేశారు. ప్రమాద ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. పొట్ట కూటి కోసం వచ్చి.. ఇలా ప్రాణాలు కోల్పోవడం చాలా బాధాకరమని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంతో 46 మంది చనిపోవటం చాలా దురదృష్టకరమని పేర్కొన్నారు. సిగాచి సంస్థలకు ఈ ఘటనలో మృతి చెందిన వారి జాబితా వచ్చిన తర్వాత ఆ యా రాష్ట్రాల వారికి తమ పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఆచూకీ తెలియకుండా పోయిన వారి కోసం త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. అలాగే పరిశ్రమల ప్రాంతంలో కచ్చితంగా అంబులెన్స్ ఉండే విధానం చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. ఆ క్రమంలో కేంద్ర ప్రభుత్వం తరఫున అన్ని విధాల సహకరిస్తామని స్పష్టం చేశారు. శిధిలాల కింద మృతదేహాల కోసం పోలీస్ జాగిలాలను వినియోగించాలని ఈ సందర్భంగా ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు. చనిపోయిన కుటుంబ సభ్యులు సొంత రాష్ట్రాలకు వెళ్లిపోతానంటే వారికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. ఇది రాజకీయాలు చేసే సమయం కాదంటూ విలేకర్లు అడిగిన ఒక ప్రశ్నకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కాస్తా ఘాటుగా సమాధానమిచ్చారు.

# ఖైదీల వివరాలు పంచుకున్న భారత్, పాక్

**న్యూఢిల్లీ,జులై 1(సమయజ్యోతి):**

భారత్, పాకిస్థాన్‌లు తమ కస్టడీలో ఉన్న పౌర ఖైదీలు, మత్స్యకారుల వివరాల జాబితాలను మంగళవారం పరస్పరం మార్పిడి చేసుకున్నాయి. వీటి ప్రకారం ప్రస్తుతం పాక్ చెరలో భారతీయులు, భారతీయులుగా పరిగణిస్తున్న 246 మంది పేర్లను వెల్లడించింది. వారిలో 53 మంది పౌర ఖైదీలు, 193 మంది మత్స్యకారులు ఉన్నారు. ఇస్లామాబాద్ లోని భారత హైకమిషన్‌కు పాక్ ప్రభుత్వం ఈ వివరాలు అందించిందని విదేశాంగ శాఖ వెల్లడించింది. వారిని త్వరగా విడుదల చేసి స్వదేశానికి పంపించాలని భారత ప్రభుత్వం ఈ సందర్భంగా పాక్‌ను కోరింది. అదే సమయంలో భారత్ కూడా తమ జైళ్లలో ఉన్న పాక్ ఖైదీల వివరాలున్న జాబితాను ఢిల్లీ లోని పాక్ హైకమిషన్‌కు అందించింది. మన అదుపులో పాక్ జాతీయులు, పాక్‌జాతీయులుగా పరిగణిస్తోన్న వారు 463 మంది ఉన్నారు. అందులో 382 మంది పౌర ఖైదీలు కాగా, 81 మంది జాలర్లు. 2008లో చేసుకున్న ఒప్పందం ప్రకారం? ఇరు దేశాలు ఏటా రెండుసార్లు జనవరి 1, జులై 1 దౌత్యమార్గాల ద్వారా ఈ వివరాలను పరస్పరం పంచుకుంటాయి. ఈ ఒప్పందం ద్వారా భారత్ పాక్ మధ్య ఖైదీల గుర్తింపు, విడుదల పక్రియ వేగవంతం అయింది.

# హర్యానాలో పలు ప్రాంతాలు జలమయం

## షుగర్ ఫ్యాక్టరీలో కొట్టుకు పోయిన కోట్ల విలువ చక్కెర

**చండీఘడ్,జులై 1(సమయజ్యోతి):**

రాత్రికి రాత్రే భారీగా కురిసిన వానలతో హర్యానాలో పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. యమునానగర్ లోని సరస్వతి సుగర్ మిల్ ప్రాంగణం లోకి నీరు చేరింది. దాంతో ఆసియాలో అతిపెద్ద షుగర్ మిల్‌గా పేరు గాంచిన దానిలో కోట్ల రూపాయల విలువ చేసే పంచదార కరిగిపోయింది. యమునానగర్ ప్రాంతం లోని గిడ్డంగిలో 2.20 లక్షల క్వింటాళ్ల పంచదారను నిల్వ చేశారు. దాని మొత్తం విలువ రూ.97 కోట్లు. అయితే వర్షాల కారణంగా పక్కనున్న కాలువ పొంగి నీరు మిల్లులోకి చేరిందని సరస్వతి షుగర్ మిల్ జనరల్ మేనేజర్ రాజీవ్ మిశ్రా వెల్లడించారు. రాత్రి భారీ వర్షంతో మిల్లు ప్రాంగణం లోకి నీరు వస్తోందని అర్ధరాత్రి సమయంలోతమ సిబ్బంది అప్రమత్తం చేశారని, మిల్లు పక్కనున్న కాలువ ఆక్రమణకు గురికావడంతో దానిలో నీరు ఒక్కసారిగా పొంగిందని చెప్పారు. ఆ నీరు మిల్లు లోకి చేరడంతో క్వింటాళ్ల కొద్దీ పంచదార తడిసిపోయిందన్నారు. దాని విలువ రూ50 నుంచి 60 కోట్ల వరకు ఉంటుందని , ఒకసారి గిడ్డంగి మొత్తాన్ని పరిశీలించి పూర్తి నష్టాన్ని వెల్లడిస్తామని తెలిపారు. మిల్లులోకి ఇలా వరద నీరు రావడం ఇదే తొలిసారని, రూ. కోట్లలో నష్టం వచ్చినా, స్థానిక మార్కెట్లలో పంచదార లభ్యతపై ప్రభావం ఉండదని మిశ్రా వెల్లడించారు. మిల్లు లోని నీటిని తొలగించడానికి అధికారులు క్రేన్‌ను వినియోగిస్తున్నారు.

# లంచం తీసుకుంటూ పట్టుబడ్డ జిహెచ్‌ఎంసి ఉద్యోగి


**హైదరాబాద్,జులై 1(సమయజ్యోతి):**

లంచం తీసుకుంటుండగా జిహెచ్‌ఎంసి మూసాపేట్, సీనియర్ అసిస్టెంట్‌ను ఎసిబి అధికారులు మంగళవారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఎసిబి అధికారుల కథనం ప్రకారం జిహెచ్‌ఎంసి, మూసాపేట్ సర్కిల్ 23లో, ఎం.సునీత సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తోంది. బాధితుడి తల్లి పేరుపై ఉన్న ఆస్తిని తన పేరుపై మార్చి మ్యూటేషన్ చేయాలని ప్రాపర్టీ ట్యాక్స్ విభాగంలో పనిచేస్తున్న సునీతను సంప్రదించాడు.ఈ పనిచేసేందుకు సునీత రూ.80,000 లంచం డిమాండ్ చేసింది.పలుమార్లు కలిసి బతిమిలాడగా, చివరకు రూ.30,000లకు చేస్తానని, అంతకంటే తక్కువకు చేయనని చెప్పింది. దీంతో విసిగిపోయిన బాధితుడు ఎసిబి అధికారులను ఆశ్రయించాడు. వారి సూచనల మేరకు సునీతకు రూ.30,000 ఇస్తుండగా ఎసిబి అధికారులు దాడి చేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అరెస్టు చేసి నాంపల్లిలోని ఎసిబి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించింది. నిందితురాలిని ఎసిబి అధికారులు చంచల్‌గూడ జైలుకు తరలించారు.

# రైతులను నట్టేట ముంచుతున్న నకిలీవిత్తనాలు

సమయజ్యోతి ప్రత్యేకం

వానా కాలం సీజన్ వచ్చిందంటే చాలు రైతుల కు నకిలీల బెడద తప్పడం లేదు. ఆరు గాలం శ్రమించి సాగు చేస్తే తీరా చేతికొస్తుందనుకున్న పంట రాకపోవడంతో రైతులు ఆత్మహత్య లు చేసుకుంటున్నారు. దీంతో రైతు కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. మొదట్లోనే నకిలీ విత్తనాల ఆటకట్టిస్తే పంట చేతికొచ్చి, నష్టాల్లేకుండా ఉం టుందని రైతులు పేర్కొంటున్నారు.వానాకాలం సీజన్ కంటే ముందే నకిలీ విత్తన ముఠా చేయని ప్రయత్నమంటూ ఉండదు. లూజ్ విత్తనాలను ఆకర్షణీయమైన కవర్లలో ప్యాకింగ్ చేసి రైతులకు తక్కువ ధరలకే అంటగడుతూ నిలువునా మోసం చేయడం దళారులకు అలవాటుగా మారింది. అధికార యంత్రాంగం ఎన్ని చర్యలు తీసుకుంటున్నా, ఏదో ఒక చోట పట్టుబడుతూనే ఉన్నాయి. ప్రతీ వానాకాలం సీజన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా నాసిరకం విత్తనాల బెడద రైతాంగానికి పెను సవాల్‌గా మారిం ది. అసలు ఏదో.. నకిలీది ఏదో.. గుర్తించలేని విధంగా విత్తనాలు మార్కెట్‌లో ఉంటుండటంతో రైతాంగం తీవ్రంగా నష్టపోతుంది. ప్రధానంగా వరి, పత్తి విత్తనాలు నాసిరకం కావడంతో రైతులకు నష్టాలు తప్పడంలేదు. తీరా పత్తి పంటలో దిగుబడి రాక రైతులు ఆర్థికంగా దెబ్బతింటుండ గా వరిలో సైతం తెగుళ్లు, తాలు, నాణ్యతలేకపోవడంతో రైతులు పంట చేతికొచ్చే సమయంలో లబోదిబోమంటున్నారు. వరి, పత్తి విత్తనాల విషయంలో దళారులదే పెత్తనమైంది. గ్రామీణ ప్రాంతాల్లో దళారులు రైతులను మచ్చిక చేసుకుని తక్కువ ధర, అధిక దిగుబడులు, తక్కువ సమయంలో పంట చేతికి వస్తుందని నమ్మించి నాసిరకం విత్తనాలు అంటకడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలు ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నా దళారుల దందాను నిలువరించలేక పోతున్నారు. గత ఏడాది మే లో అన్ని జిల్లాల్లో వ్యవసాయ శాఖ విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. పలు జిల్లాల్లో పలుచోట్లకేసులను కూడా నమోదు చేసిన సందర్భాలున్నాయి. ఒకానొక దశలో పీడీ యాక్టును కూడా అమలు చేశారు. అయినప్పటికీ విత్తనాల నాణ్యతపై పలు అనుమానాలు వ్యక్తమవుతూ వస్తున్నాయి. పెట్టుబడులు చేతిలో లేని రైతులు తక్కువ ధరకు వచ్చే విత్తనాలను తీసుకుని వేసిన సందర్భాలూ ఉన్నాయి. దీంతోనే రైతులు నష్టపోతున్నారు. తాజాగా ఆయా జిల్లా ల ఉన్నతాధికారులు టాస్క్‌ఫోర్స్‌లను ఏర్పాటు చేస్తూ ఆదేశాలు జారీచేశారు. వ్యవసాయ శాఖతోపాటు పోలీ సు సశాఖ, రెవెన్యూశాఖ సమన్వయంతో పలు టీంలు ఏర్పడి తనిఖీలు విస్తృతంగా చేయాలని నిర్ణయించాయి. అయితే ప్రతీ సంవత్సరంతనిఖీలు చేస్తున్నా, ఎక్కడో ఒక చోట నకిలీ విత్తనాల బెడద తప్పడం లేదు. అన్ని జిల్లాల్లో గతంలో లూజు పత్తి విత్తనాలు పెద్ద ఎత్తున స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ నెల నాలుగో వారం నుంచి వ్యవసాయ సీజన్ ప్రారంభం కానుంది. ఇప్పటికే దుక్కులను దున్నకుని సిద్ధం చేసుకున్నారు. ఈ నెలాఖరులోనే నైరుతి రుతుపవనాలు కేరళను తాకడంతోపాటు తెలంగాణలో సైతం ముందుగానే వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అన్ని జిల్లాల్లో వర్షాలు కురిస్తే ముందుగానే విత్తనాలు వేస్తారు. ఈ నెల చివర్లో రోహిణి కార్తె ప్రారంభంకానుంది.రాష్ట్ర వ్యాప్తంగా వరితోపాటు పత్తి అంతా కలిపి కోట్లాది ఎక్టార్ లలో పంటలు సాగు కానున్నాయికొందరు డీలర్లది ఆడిందే ఆట.. పాడిందే పాటగా మారిందన్న ఆరోపణలు వస్తున్నాయి. కొందరు డీలర్లు తమకు ప్రజాప్రతినిధుల అండ ఉందని రాజకీయ పార్టీలతో సంబంధాలున్నాయని బాహాటంగా పేర్కొంటూ దందాలకు పాల్పడుతున్నట్లు రైతులనుంచి విమర్శలు వస్తున్నాయి. సీజన్‌లో తమ దుకాణాలను టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు చేయకుండా ఉండేలా తమకు ప్రజాప్రతినిధుల అండ ఉందని చెబుతుండటం గమనార్హం. ప్రస్తుతం టాస్క్‌ఫోర్స్‌లో పోలీస్, వ్యవసాయ, రెవెన్యూశాఖ అధికారులు ఉన్నారు. ప్రతీ సీజన్‌కు ముందు టాస్క్‌ఫోర్స్ అధికారులను తప్పుదోవ పట్టించే విధంగా పత్తి విత్తనాలు విక్రయించే రంగంలో ముదిరిపోయిన కొందరు డీలర్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈసారైనా టాస్క్‌ఫోర్స్ అధికారులు పత్తి విత్తనాలు విక్రయించే డీలర్లపై నిఘా పెట్టి తనిఖీలు చేస్తారా? అనేది వేచి చూడాల్సి ఉంది.ఆంధ్ర నుంచి నిషేధిత బీటీ-3 విత్తనాలు వస్తున్నాయి అమెరికా దేశంలోని మోనో శాంటోను కంపెనీకి చెంది బీటీ-3 రకం విత్తనాలపై దేశవ్యాప్తంగా నిషేదం ఉంది. బీటీ-3 విత్తనాలకు కేంద్ర ప్రభుత్వం నుంచి




ఎలాంటి అనుమతి లేదు. బీటీ-1, బీటీ-2 రకాలకు మాత్రమే అనుమతి ఉంది. దాదాపు 20 ప్రధాన కంపెనీలకు చెందిన అనుమతిగల విత్తనాలను అందుబాటులో ఉంచారు. ఇకపోతే నిషేధిత విత్తనాలవల్ల కాలుష్యంతో ముప్పు వాటిల్లే అవకాశంతోపాటు అనేక రకాలుగా నష్టాలున్నాయి.వివిధ జిల్లాల్లో అత్యధికంగా పత్తి జిన్నింగ్ మిల్లులు ఉండటంతో విత్తనోత్పత్తి సులువుగా జరుగుతుంది.అన్ని రకాల విత్తనాలు నష్టం కలిగించనప్పటికీ దళారుల జోక్యంతో బీటీ-2 రకం విత్తనాల పేరిట బీటీ-3 రకం విత్తనాలను అంటగడుతున్నట్లు వ్యవసాయశాఖ అధికారుల దృష్టికి సైతం వచ్చినట్లు సమాచారం. దీంతోపాటు ఆంధ్రప్రదేశ్‌లోని మాచర్ల నుంచి సైతం అన్ని జిల్లాలకు నాసిరకం విత్తనాలతోపాటు బీటీ-3 రకం విత్తనాలు కూడా చేరుతున్నట్లు తెలుస్తోంది. నల్లగొండ జిల్లాలోని నాగార్జునసాగర్ సరిహద్దులోనే మాచర్ల ఉండటంతో సులువుగా వివిధ మార్గాల్లో నకిలీ పత్తి విత్తనాలు చేరుతున్నాయి. మహా రాష్ట్ర నుండి కూడా వస్తున్నాయి వాస్తవానికి అయితే చాలామంది డీలర్లు, వ్యాపారులు రైతులు పత్తి, వరి విత్తనాలు కొనుగోలు చేసిన వెంటనే వారికి బిల్లు ఇవ్వాల్సి ఉంటుంది. కానీ చాలాచోట్ల రశీదు ఇవ్వకుండా రైతులను మభ్య పెట్టి పంపించి వేస్తున్నా సంఘటనలున్నాయి. పంట దిగుబడులు తక్కువగా వచ్చినప్పుడు రైతులు నిలదీస్తారన్న భయంతో ఏ వ్యాపారి కూడా బిల్లులు ఇవ్వడం లేదు. ఒక ఆంధ్రప్రదేశ్ నుంచే కాకుండా మహారాష్ట్ర, కర్నాటక, ఛత్తీసగడ్, గుజరాత్‌ల నుంచి కూడా వివిధ ప్రాంతాల నుంచి రాష్ట్రంలోకి రోడ్డుమార్గం ద్వారా పట్టుబడుతామన్నా ఆలోచనతో కొంత మంది దళారులు రైళ్లలో తరలించడం, లేదంటే ట్రాన్స్‌ఫోర్ట్ వాహనంలో జిల్లాలకు చేరవేస్తున్నారు. ఒరిజినల్ కంపెనీలకు చెందిన ప్యాకెట్ల మాదిరిగానే నకిలీ ప్యాకెట్లు తయారుచేసి అందులో నాసిరకమైన పత్తి విత్తనాలను నింపి రైతులకు అంటగట్టే ప్రమాదం ఉంది. ఈనేపథ్యంలో గత సంవత్సరం వ్యవసాయ శాఖ అధికారులు వరితోపాటు పత్తి విత్తనాలకు సంబం?ధించిన నమునాలను సేకరించి ల్యాబ్‌కు పంపించారు. కొంతమంది మధ్య దళారులు పత్తి వేసే రైతులను తీసుకవెళ్లి నాసిరకం విత్తనాలు అంటగట్టడంతోపాటు వారు డిస్కౌంట్ ఇస్తున్న మాదిరిగా వ్యవహరించి భోజనాల ఖర్చులు ఇవ్వడం, రానుపోను వాహన చార్జీలు ఇచ్చి మభ్యపెట్టి మోసం చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం ప్రతీ రైతు కూడా విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలి. ఇతర ప్రాంతాల నుంచి బీటీ-2 విత్తనాల పేరిట బీటీ-3 విత్తనాలను అంటగట్టే ప్రమాదం ఉంది. బీటీ-3ని కేంద్రం నిషేదించింది. రైతులు పూర్తిస్థాయిలో అనుమతులున్నా డీలర్లు, వ్యాపారుల వద్దే విత్తనాలను కొనుగోలు చేసి రశీదులు తీసుకోవాలి. నాణ్యమైన విత్తనాలకు మాత్రమే అనుమతి ఇవ్వాలి లైసెన్స్ ఉన్న డీలర్లనుంచి మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి. మధ్య దళారుల వద్ద ఎట్టి పరిస్థితులోను విత్తనాలను కొనుగోలు చేయవద్దు.

**కామిడి సతీష్ రెడ్డి భూపాల్ పల్లి జిల్లా**

**9848445134**

# ఉపాధ్యాయులు -విద్యార్థుల తల్లిదండ్రులు సమిష్టి భాగస్వామ్యమే విద్యాభరోసా

## - ప్రధానోపాధ్యాయుడు దండు శేఖర్

**సమయజ్యోతి న్యూస్ కృష్ణ...**

**నారాయణ పేట జిల్లా**

మండలంలోని ముదుమాల్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం మేగా పేరెంట్,టీచర్స్ మీటింగ్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు దండు శేఖర్ ఆధ్వర్యంలో నిర్వహిచారు.ఈ సందర్భంగా పాఠశాలలో బడిబాటలో చేరిన విద్యార్థుల సంఖ్య, గత సంవత్సరం పాఠశాలలో జరిగిన అభివృద్ధి, ఉపాధ్యాయుల విద్యార్థుల హాజరు మరియు చదువుల పండుగ యొక్క ఫలాలు, గ్రామస్తుల, పూర్వ విద్యార్థుల, స్వచ్ఛంద సేవా సంస్థల సహాయ సహకారాలు మరియు ఈ సంవత్సరం నిర్వహించిన బేస్ లైన్ టెస్ట్ రిజల్ట్స్ అన్ని గ్రామస్థులతో, విద్యార్థుల తల్లిదండ్రులతో కూలంకషంగా చర్చించారు.ఈ విద్యా సంవత్సరం ఒక ప్రత్యేక అంజేడాతో ఉపాధ్యాయుల,విద్యార్థుల, తల్లిదండ్రుల పూర్తిగా భాగస్వాములను చేస్తు తీసుకువచ్చిన విద్యాభరోసా కార్యక్రమం గురించి విపులంగా చర్చించడం జరిగింది.



ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులంతా పూర్తిగా మద్దతు తెలుపుతూ ముక్తకంఠంతో సహరిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బీటియం సేవా ఫౌండేషన్ అధినేత బి తిమ్మయ్య కు డాక్టరేట్ వచ్చిన శుభ సందర్భం పురస్కరించుకొని వారిని గ్రామ ప్రజలు,అథితులు, పాఠశాల ఉపాద్యాయ బృందం ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు దండు శేఖర్, ఉపాధ్యాయులు భారతి, రవికుమార్, ఆస్మానిషాత్,జ్యోతి,పద్మావతమ్మ, పీఈటీ యండి సోఫీ,వాలంటీర్లు శివలీల,శిరీష,బిటియం ఫౌండేషన్ అధినేత డాక్టర్ బి తిమ్మయ్య,రంగనాథ ఫర్టిలైజర్స్ ఓవర్ వాకిటి భీమశంకర్, మాజీ సర్పంచ్ అశోక్ గౌడ్, బిజెపి యువ నాయకులు దండు రాఘవేంద్ర, కాంగ్రెస్ యువ నాయకుడు కాద్రు తమ్మప్ప, వై కృష్ణయ్య,మజీద్,గుడి అంజనేయులు,సాదు శివప్ప, ఏల్పేటి శ్రీనివాస్,కాద్రు అంజనేయులు,వెంకటేష్ గౌడ్ మరియు గ్రామ ప్రజలు, పెద్దలు,విద్యార్థుల తల్లిదండ్రులు, మధ్యాహ్న భోజన సిబ్బంది పాల్గొన్నారు..

# లాసెట్ ఫస్ట్ ర్యాంకర్ రుతికకు టీచర్స్ వెల్ఫేర్ సొసైటీ సన్మానం

**సమయజ్యోతి న్యూస్ జూలై 01 బజార్ హత్నూర్ బోథ్**

బోథ్ మండల కేంద్రము కు చెందిన ఎల్కుచి రుతిక ఇటీవల వెలువడిన లాసెట్ ఫలితాలలో ఎల్కుచి రాజశేఖర్, దీప దంపతుల కుమార్తె రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాదించడం గర్వకారణం అన్నారు. బోథ్ చరిత్రలో రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించిడం ఇదే మొదటిసారన్నారు. ఎలాంటి శిక్షణ లేకుండా మొదటిసారిగా ప్రథమ ర్యాంకు సాధించి అందరికీ ఆదర్శంగా నిలిచిందన్నారు.రుతికను స్పూర్తిగా తీసుకొని విద్యార్థులు ముందుకు సాగాలన్నారు.ఈ కార్యక్రమంలో టీచర్స్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు పెంట సదానందం,కత్తూరి హన్మండ్లు, సాగర్,ఆర్.టి.వి.ప్రసాద్,ఎం. మురళి,ఎల్. గంగాధర్, రావుల గణపతి,రఘుపతి ,సురేష్ వైద్య, రావుల శంకర్, అప్పాలు శ్రీనివాస్ రెడ్డి, రావుల మహెందర్,ఎస్.రవి,శివయ్య బైరి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



# అదనపు కలెక్టర్.. పాఠశాలల సందర్శన

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ**

అదనపు కలెక్టర్ అంకిత్, బాల్కొండ మండలం కస్తూరిబా పాఠశాల, నాగపూర్ ప్రాథమిక, ప్రాథమిక ఉన్నత పాఠశాలలు, అంగన్వాడి పాఠశాలను క్షేత్రస్థాయిలో సందర్శించారు. ఆయన పాఠశాలల పరిసరాలను, మధ్యాహ్న భోజనం, యూనిఫామ్స్, టెక్స్ట్ బుక్స్, నోట్ బుక్స్, విద్య బోధన, అభ్యాసన తీరును పరిశీలించారు. కస్తూరిబా పాఠశాలలో యూనిఫామ్ ని ప్రతిరోజు అందించాలని, మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం వడ్డించాలని సూచించారు. సంబంధిత ప్రధానోపాధ్యాయులు మానిటరింగ్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయ భాస్కర్ రెడ్డి, తహసీల్దారు శ్రీధర్, ఎంఈఓ బట్టు రాజేశ్వర్, ఎంపీఓ గంగామోహన్, కేజీబీవీ ప్రత్యేక అధికారి భవాని, హెచ్ఎం రాజేశ్వర్ పాల్గొన్నారు.



# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ**

బాల్కొండ లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. కిసాన్ నగర్ లోని లైన్స్ భవనం వద్ద మొక్కలు నాటారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఇద్దరు వైద్యులను, ఇద్దరు సీనియర్ సిటిజన్ ఫోరం సభ్యులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. లైన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ చాకులింగం, సీనియర్ సభ్యులు జ్ఞాన సాగర్ రెడ్డి, దినేష్ పటేల్, నల్లూర్ జీవన్, వంశీ రెడ్డి, సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు మనోహర్, సభ్యులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లైన్స్ క్లబ్ సీనియర్ సభ్యుడు జీవన్ మాట్లాడుతూ తాము గ్రామాల్లో పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.



# ప్రజలకు సామాజిక అవగాహన కల్పించాలి ప్రెస్ క్లబ్ కార్యవర్గానికి కలెక్టర్ సూచన

**సమయజ్యోతి న్యూస్ నిర్మల్ బ్యూరో, జూలై 01.**

నిర్మల్ ప్రెస్ క్లబ్ సామాజిక అవగాహన కార్యక్రమాలను చేపట్టాలని మరియు సమాచార వ్యవస్థ ద్వారా ప్రజలను, పాలక ప్రభుత్వాన్ని మరియు అధికారులను అనుసంధానించాలని జిల్లా కలెక్టర్ నిర్మల్ అభిలాష అభినవ్ మరియు ఎస్పీ జానకి షర్మిల సూచించారు.నిర్మల్ ప్రెస్ క్లబ్ కొత్త వర్కింగ్ కమిటీ ఏర్పాటు సందర్భంగా, కొత్త కమిటీ సభ్యులందరూ కలెక్టర్ మరియు ఎస్పీని విడివిడిగా కలిశారు.

నిర్మల్ జిల్లా పోలీసు కార్యాలయంలోని ఎస్పీ చాంబర్లో ఎస్పీ జానకి షర్మిల మరియు ఏఎస్పీలు రాజేష్ మీనా మరియు ఉపేంద్ర రెడ్డిలను శాలువాలతో సత్కరించి, కొత్త కమిటీ సభ్యులను పరిచయం చేసుకున్నారు.ఈ సందర్భంగా, జిల్లా కలెక్టర్ మరియు ఎస్పీ ప్రెస్ క్లబ్ నిర్మల్ కొత్త కమిటీ సభ్యులను అభినందించి, వారిని సత్కరించారు.నిర్మల్ కలెక్టరేట్లోని ఐడిఓసిలోని తన చాంబర్లో కొత్తగా ఎన్నికైన ప్రెస్ క్లబ్ బాడీతో జిల్లా కలెక్టర్ నిర్మల్ మాట్లాడుతూ, సమాజంలో జర్నలిస్టుల బాధ్యత చాలా ఎక్కువగా ఉందని అన్నారు. ప్రస్తుతం సామాజిక రుగ్మతగా మారిన మత్తు పదార్థాల వాడకాన్ని అరికట్టడంలో జర్నలిస్టులు సహకరించాలని ఆమె కోరారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని కూడా ఆమె సూచించారు. కొత్త కార్యనిర్వాహక సభ్యులు జిల్లా ప్రజా సంబంధాల అధికారి విష్ణువర్ధన్‌ను కలిసి శాలువాతో సత్కరించారు.నిర్మల్ ప్రెస్ క్లబ్ కార్యనిర్వాహక సభ్యులు ఈ సమావేశాలలో పాల్గొన్నారు.



# జాతీయ విద్యార్థుల పర్యావరణ పోటీ వాల్ పోస్టర్లను ఆవిష్కరించిన -జిల్లా కలెక్టర్ అభిలాషా అభినవ్

**సమయజ్యోతి న్యూస్, నిర్మల్ బ్యూరో, జూలై 01.**

జాతీయ విద్యార్థుల పర్యావరణ పోటీ (ఎన్ఎస్పిసి) వాల్ పోస్టర్లను జిల్లా కలెక్టర్ అభిలాషా అభినవ్ తన చాంబర్‌లో విద్యా శాఖ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జూలై 1 నుండి ఆగస్టు 21 వరకు పర్యావరణ పరిరక్షణకు సంబంధించి జిల్లా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఫలితాలు ఆగస్టు 30న విడుదల చేయబడతాయి. పాఠశాల స్థాయి నుండి విద్యార్థులలో పర్యావరణ పరిరక్షణ గురించి అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యం అని ఆమె చెప్పారు. ఈ ఎన్ఎస్పిసి కార్యక్రమంలో విద్యార్థులందరినీ పాల్గొనేలా చేయాలని ఆమె అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి పి. రామారావు, సైన్స్ అధికారి వినోద్, ఎన్‌జిసి జిల్లా కోఆర్డినేటర్ మోహన్ రావు, జిల్లా కోఆర్డినేటర్ నర్సయ్య, ఎస్టియు రాష్ట్ర ఇన్‌చార్జ్ గజేందర్, జిల్లా ఇన్‌చార్జ్ భూమన్న యాదవ్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.



# ఇంచార్జ్ మంత్రి సీతక్కకు సన్మానం

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ**

నిజామాబాద్ పార్లమెంట్ విస్తృత స్థాయి సమావేశంలో మంగళవారం ముఖ్య అతిథులుగా జిల్లా ఇంచార్జ్ మంత్రి సీతక్క పాల్గొనగా, వారిని బాల్కొండ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు టి.అరవింద్, మాజీ ఉపసర్పంచ్ షేక్ వాహబ్ మర్యాద పూర్వకంగా కలిసి, శాలువాతో సన్మానించారు.



# నిజామాబాదులో మంత్రి సీతక్కకు సన్మానం

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ**

నిజామాబాద్ పార్లమెంట్ విస్తృత స్థాయి సమావేశం సందర్భంగా మంగళవారం ముఖ్య అతిథులుగా జిల్లా ఇంచార్జ్ మంత్రి సీతక్క విచ్చేయగా, వారిని బాల్కొండ మండల మైనారిటీ కాంగ్రెస్ సీనియర్ నాయకులు మొహమ్మద్ యు నుస్ మర్యాద పూర్వకంగా కలిసి, శాలువాతో సన్మానించారు.



# జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా డాక్టర్లను సన్మానించిన -బీ ఆర్ ఎస్ నాయకులు

**సమయజ్యోతి న్యూస్ జూలై 01 బజార్ హత్నూర్ బోథ్**

బోథ్ మండల కేంద్రంలో జాతీయ వైద్యుల దినోత్సవ సందర్భంగా బోథ్ మండల కేంద్రానికి చెందినడాక్టర్ రవీంద్ర ప్రసాద్ మరియు మాజీ జెడ్పిటిసి డాక్టర్ సంధ్య రాణి మేడం ని టిఆర్ఎస్ పార్టీ తరపున సన్మానించడం జరిగింది .. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఎలక రాజు బీ ఆర్ ఎస్ పార్టీ యూత్ ప్రెసిడెంట్ మెడిచేల్మ ప్రవీణ్ మరియు బీ ఆర్ ఎస్ యువ నాయకులు పాలిక్ మధు తదితరులు పాల్గొన్నరు



# బిసి, ఎస్సి వసతి గృహాల ఏర్పాటుకై కలెక్టర్ కు వినతి

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి అదిలాబాద్**

రెవెన్యూ డివిజన్ ఉట్నూర్ లో పరిసర ప్రాంతాల్లోని గ్రామాల్లో ఉండే పేద, మధ్యతరగతి విధ్యార్థులు ఇంటర్, డిగ్రీ కళాశాలలో పెద్ద సంఖ్యలో అడ్మిషన్లు పొందారు. ఈ విద్యార్థుల సౌకర్యార్థం బీసీ ఎస్సీ వసతి గృహాలను ఏర్పాటు చేయాలని మంగళవారం బిఆర్ఎస్వి జిల్లా అధ్యక్షులు ధరణి రాజేష్, జిల్లా అధ్యక్షులు బుట్టి శివకుమార్ తో కలిసి అదిలాబాద్ జిల్లా కలెక్టర్ కు వినతి పత్రాన్ని అందజేశారు.



# ఎంఈఓ రాజేశ్వర్ కు కలెక్టర్ సన్మానం

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ

నిజామాబాద్ జిల్లా కలెక్టర్ వినయ్ రెడ్డి, బాల్కొండ మండల విద్యాధికారి బట్టు రాజేశ్వరును సన్మానించారు. బడిబాట కార్యక్రమంలో విద్యార్థి నమోదులో బాల్కొండ మండలాన్ని ముందు వరుసలో ఉంచడాన్ని అభినందించారు. మిగతావారు దీన్ని ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు.



# పార్క్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్పొరేటర్ పుష్పానగేష్

సమయజ్యోతి న్యూస్ రామచంద్రాపురం

రామచంద్రపురం డివిజన్ శ్రీనివాస్ నగర్ కాలనీ సండే మార్కెట్ బాలవిహార్ పార్క్ లో జరుగుతున్న అభివృద్ధి పనులను మంగళవారం రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్పానగేష్ పరిశీలించారు సుమారు 25.00 లక్షలతో డెకరేటింగ్ లైట్స్ కొరకు స్థానిక గ్రామ పెద్దలతో కలిసి శంకుస్థాపన చేసిన జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యులు రామచంద్రాపురం కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ వాకింగ్ ట్రాక్ లలో నీరు నిలిచి ఉందని వెంటనే సంబంధిత వర్క్ ఇన్స్పెక్టర్ ను నీరు నిలువకుండా చూడాలని కోరారు వారితో మాజీ ఎఎంసి డైరెక్టర్ ఐలాపూర్ ఏలేష్ ఎల్వర్తి మల్లేష్ సిఎంమల్లేష్ బైకన్ నవీన్ యాదవ్ రవి హన్మంతు రమేష్ మల్లేష్ మల్లికార్జున్ సత్యం ఖాజా శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు



# కోలి లో డాక్టర్స్ డే కార్యక్రమం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో -సన్మానకార్యక్రమ

సమయజ్యోతి న్యూస్ ప్రతినిది ఆదిలాబాద్

ఆదిలాబాద్ జిల్లాలోని అ%శీ%కోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో డాక్టర్స్ డే ను నిర్వహించినారు,డాక్టర్స్ అంటే దేవుడు అని కనిపించని దేవుడి కంటే కన్పించే డాక్టర్స్ దేవుళు ృ అనికొనియాడినారు,కార్యక్రమం లో లయన్స్ క్లబ్ అధ్యక్షులు మంద అశోక్, ప్రధాన కార్యదర్శి భగవన్ దాస్, జోనల్ చెర్పర్సన్ కె. ప్రకాష్, రూరల్ మండల విద్యాధికారి కంటే నర్సయ్య, డా సర్ఫరాజ్. డా. ఆశా కిరణ్, స్పెషల్ ఆఫీసర్ పద్మ భూషణ్ రావు, మండల అభివృద్ధి అధికారినాగేశ్వర్ రెడ్డి సమాజిక కార్యకర్త బండారి దేవన్న, పి.నరేందర్,ప్రేమ్ రాజ్ గౌడ్, కరీంఅలీ, డా, శ్రీధర్,హెల్త్ సూపర్వజర్స్ బొమ్మెత సుభాష్, ఆడే సురేష్,శ్యామల, శకుంతల, మేరీ, పంచాయతీ సెక్రెటరీ శ్రీధర్ రెడ్డి, ఆరోగ్య కార్యకర్తలు ఈశ్వర్ రెడ్డి, నారాయణ, ప్రేమసింగ్, ల్యాబ్ టెక్నిషన్ సమీ లు, ఏఎన్ఎం లు,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు,డాక్టర్స్ డే సందర్భంగా కేక్ కోసి, శాలువాలు కప్పి, బొకే,మెమో%శీ% టోల తో సన్మానిచడం జరిగింది. అలాగే ల్యాబ్ టెక్నిషన్ జన్మదినన్ని పురాష్కరించికో కేకు కోయడము కూడా జరిగింది.



# సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి రాష్ట్ర మైనార్టీస్ కమిషన్ చైర్మన్ తారిఖ్ అన్సారీ - జిల్లా కలెక్టర్ తో భేటీ

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి

నిజామాబాద్ బ్యూరో



మైనారిటీల అభ్యున్నతిని కాంక్షిస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన వారందరు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర మైనార్టీస్ కమిషన్ చైర్మన్ తారిఖ్ అన్సారీ సూచించారు. మంగళవారం ఆయన నిజామాబాద్ నగరానికి విచ్చేసిన సందర్భంగా అధికారులు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. స్థానిక రోడ్లు - భవనాల శాఖ అతిథి గృహంలో ఆయన కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డితో పాటు ఇతర జిల్లా అధికారులతో భేటీ అయ్యారు. జిల్లాలో మైనారిటీ వర్గాల స్థితిగతుల గురించి అడిగి తెలుసుకున్నారు. మైనారిటీల కోసం ఉద్దేశించిన సంక్షేమ, అభివృద్ధి పథకాల గరించి అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని చైర్మన్ తారిఖ్ అన్సారీ అధికారులకు సూచించారు. మహిళా సాధికారత దిశగా ప్రభుత్వం మహిళలకు అందజేస్తున్న తోడ్పాటును అర్హులైన మైనార్టీ మహిళలు వినియోగించుకునేలా చొరవ చూపాలని కోరారు. విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలలో మైనారిటీ వర్గాలకు సరైన ప్రాతినిధ్యం లభించేలా జిల్లా యంత్రాంగం తరపున ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని కలెక్టర్ ను కోరారు. మైనారిటీలపై దాడులు జరిగిన సందర్భాలలో పోలీస్ అధికారులు సత్వరమే స్పందించి, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆయా ప్రాంతాల్లో ముస్లిం స్మశాన వాటికలకు అవసరమైన స్థలాన్ని కేటాయించాలని, మైనార్టీలు నివసిస్తున్న ప్రాంతాలలో తగు సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరీ, నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపడేలా వృత్తి నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని అన్నారు. మైనార్టీ విద్యా సంస్థలలో సదుపాయాలు మెరుగుపరుస్తూ, నాణ్యమైన విద్యా బోధన జరిగేలా చూడాలన్నారు. మైనార్టీలు వివక్షకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. మైనార్టీల అభ్యున్నతి కోసం ప్రభుత్వ పరంగా జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఆయా కార్యక్రమాలను సమర్ధవంతంగా అమలయ్యేలా పర్యవేక్షణ జరుపుతున్నామని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. అనంతరం మైనారిటీ వర్గాల నుంచి కమిషన్ చైర్మన్ వివిధ సమస్యలపై విజ్ఞాపనలు స్వీకరించారు. ఈ భేటీలో నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిణి కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

# నర్సరీల నిర్వహణను మరింతగా మెరుగుపర్చాలి కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి

నిజామాబాద్ బ్యూరో



వన మహోత్సవంలో కీలకమైన నర్సరీల నిర్వహణలో మరింతగా మెరుగుపరుచుకోవాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. మంగళవారం ఆయన ఇందల్వాయి మండలం గౌరారంలో కొనసాగుతున్న నర్సరీని తనిఖీ చేశారు. పంపిణీకి సిద్ధంగా ఉన్న వివిధ రకాల మొక్కలను పరిశీలించారు. లక్ష్యం మేరకు పూర్తిస్థాయిలో మొక్కలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు. ఇళ్ల వద్ద నాటే మొక్కలను, అవెన్యూ ప్లాంటేషన్ కోసం ఉద్దేశించిన మొక్కలను వేరువేరుగా విభజిస్తూ పంపిణీ చేయాలని కలెక్టర్ సూచించారు. వచ్చే సీజన్ వన మహోత్సవం కోసం ఇప్పటి నుండి అవసరమైన ప్రణాళికలు రూపొందించుకుని, తదనుగుణంగా చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ గౌరారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల ప్రగతి గురించి తన వెంట ఉన్న ఎంపీడీవోను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో 32 మందికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరీ తెలుపగా, 29 గ్రౌండింగ్ అయ్యాయని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. 7 ఇళ్లు బేస్మెంట్ లెవెల్ వరకు పూర్తయ్యాయని, మూడు మాత్రమే పెండింగ్ లో ఉన్నాయని తెలిపారు. లబ్ధిదారులు వేగంగా నిర్మాణాలు పూర్తి చేసుకునేలా చూడాలని, క్రమం తప్పకుండా క్షేత్రస్థాయి పర్యవేక్షణ జరుపుతూ, లబ్ధిదారులకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట పంచాయతీ కార్యదర్శి ప్రేమలత తదితరులు ఉన్నారు.

# విస్తృత తనిఖీలు నిర్వహించిన కలెక్టర్ రేషన్ షాపును సందర్శించి సన్నబియ్యం పంపిణీపై ఆరా

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి

నిజామాబాద్ బ్యూరో



నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మండల కేంద్రంలో కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి మంగళవారం విస్తృత స్థాయిలో ఆకస్మిక తనిఖీలు జరిపారు. తహశీల్ కార్యాలయంతో పాటు రేషన్ షాపు, ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేశారు. స్థానికంగా గల గ్రామీణ పశు వైద్యశాలను సందర్శించి పనితీరును పరిశీలించారు. ముందుగా తహశీల్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్ భూభారతి రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మొత్తం 3480 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ వెంకట్ రావు తెలుపగా, దరఖాస్తుదారులకు రసీదులు అందించారా అని కలెక్టర్ ఆరా తీశారు. వచ్చిన అర్జీలను ఆయా కేటగిరీల వారీగా విభజిస్తూ ఆన్లైన్ లో వెంటదివెంట అప్లోడ్ చేయాలని ఆదేశించారు. అనంతరం ఇందల్వాయి లోని 12 నెంబర్ రేషన్ దుకాణాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. లబ్దిదారులకు మూడు నెలలకు సంబంధించి ఒకేసారి అందించిన సన్న బియ్యం పంపిణీ పూర్తి స్థాయిలో జరిగిందా అని డీలర్ ను ప్రశ్నించారు. జూన్ నెలాఖరు నాటితోనే పంపిణీని పూర్తి చేశామని తెలుపగా, కలెక్టర్ రికార్డులలో వివరాలను పరిశీలించారు. అక్కడి నుండి కలెక్టర్ స్థానికంగా గల ఎరువుల పంపిణీ కేంద్రానికి చేరుకొని, ఎరువుల స్టాక్ ను పరిశీలించారు. ఎరువుల కొనుగోలు కోసం వచ్చిన రైతులను కలెక్టర్ పలకరించి, అవసరమైన ఎరువులు సక్రమంగానే అందుతున్నాయా అని ఆరా తీశారు. ఎరువుల సరఫరా సంతృప్తికరంగా ఉందని రైతులు తెలుపగా, జిల్లాలో యూరియా సహా ఇతర అన్ని ఎరువుల నిల్వలు సరిపడా అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ భరోసా కల్పించారు. ప్రస్తుత అవసరాలకు సరిపడా ఎరువులను మాత్రమే కొనుగోలు చేయాలని, ముందస్తుగానే ఎక్కువ నిలువలను సమకూర్చుకోవాలనే ఆదుర్దా వద్దని హితవు పలికారు. ప్రస్తుత వానాకాలం సీజన్ పంటల సాగుకు అవసరమైన ఎరువులను పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచుతున్నామని అన్నారు. అక్కడి నుండి కలెక్టర్ గ్రామీణ పశు వైద్యశాలను సందర్శించారు. అవసాన దశలో ఉన్న భవనాన్ని గమనించి, అవసరమైన మరమ్మతులు చేయించాలని డాక్టర్ గంగా ప్రసాద్ కు సూచించారు. కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు ఉన్నారు.

# మల్లికార్జున ఖార్గే సభను విజయవంతం చేయాలి

## ముఖ్య కార్యకర్తల సమావేశంలో -మొహమ్మద్ షబ్బీర్ అలీ

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి

నిజామాబాద్ బ్యూరో





భారత రాజ్యాంగాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ సైనికులకు దిశా నిర్దేశం చేయడానికి విచ్చేస్తున్న కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున కార్గే సభను విజయవంతం చేయాలని, జై బాపూ జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా గట్టిగా తీసుకువెళ్దాం, మన రాజ్యాంగాన్ని కాపాడుకుందామని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ పేర్కొన్నారు. నిజామాబాద్ పట్టణంలోని ఈ వివిఎం ఫంక్షన్ హాల్లో ఉమ్మడి నిజామాబాద్, జహీరాబాద్ పార్లమెంట్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన,జిల్లా ఇంచార్జీ మంత్రి సీతక్క, జహీరాబాద్ ఎంపీ సురేష్ షట్కర్ లతో పాల్గొని, మాట్లాడారు. మాది గాంధీ కుటుంబం, ఆర్ఎస్ఎస్ మోదీ కుటుంబం మధ్యజరుగుతున్న సమరం. మాది అందరిని ఏకం చేసి, ప్రేమని పంచె నినాదం. వారిదిరెచ్చగొట్టి, విడదీసి విద్వేషాన్ని పెంచేనినాదం. మల్లికార్జున కార్గే సభను కాంగ్రెస్ శ్రేణులువిజయవంతం చేయాలన్నారు. బిజెపి అధికారంలో లేని ప్రాంతాన్ని చిన్న చూపుచూడడం దురదృష్టకరమన్నారు.తెలంగాణలో ఎంతో ప్రతిష్టాత్మకంగా పేద ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేస్తుంటే ఈ పథకం మాదేనని బిజెపి చెప్తోంది. మరిబిజెపి అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో సన్న బియ్యం ఎందుకు పంపిణీ చేయడం లేదు. ప్రభుత్వాలను పడగొట్టే ఆలోచన, అభివృద్ధి చేయడంలో లేదన్నారు.చార్ సౌ పార్ అన్నారు. చేతికిల పడ్డారు. పొత్తులతోప్రభుత్వం నడిపిస్తున్నారు.రాష్ట్రం అప్పుల్లోఉన్నా, పేదలకు ఇచ్చిన మాట ప్రకారంరాష్ట్ర ప్రభుత్వం రేవంత్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా పథకాలు అమలు చేస్తున్నారు.తొమ్మిది రోజుల్లో తొమ్మిది వేలకోట్లు రైతు భరోసా కింద రైతుల ఖాతాలో జమ చేసి రైతులను ఆదుకున్నాము.రాష్ట్రవ్యాప్తంగా సుమారు నాలుగు లక్షల 50 వేల ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసాం. ప్రతి నియోజక వర్గానికి 3500 చొప్పున మంజూరయ్యాయి. 500 లకే వంట గ్యాస్ సిలిండర్. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం. 2 లక్షల రుణమాఫీ రైతు భరోస అందజేస్తున్నాం. 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు అందిస్తున్నాం. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, ఆరోగ్యశ్రీ, సీఎంఆర్ఎఫ్ చెక్కులను సకాలంలో అందజేస్తున్నాం. ఇవన్నీ కార్యక్రమాలు ప్రజల్లో తీసుకెళ్లి సంస్థగతంగా కాంగ్రెస్ పార్టీని బలోపేతంచేస్తూ స్థానిక ఎన్నికల్లో అన్ని గ్రామ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపొందేవిధంగా కృషి చేయాలన్నారు,కార్యక్రమంలో ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి, భూపతి రెడ్డి, లక్ష్మీ కాంతారావు, మదన్ మోహన్ రావు, వెడమ బజ్జు, సంజయ్ రావు, బలమూరి వెంకట్, జీవన్ రెడ్డి, ఈరవత్రి అనిల్, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, ఇన్చార్జిలు, ఉమ్మడి జిల్లా అధ్యక్షులు పాల్గొన్నారు.

# జూనియర్ కళాశాలలో మెరుగైన బోధన అందించాలి

## కలెక్టర్ సందీప్ కుమార్ ఝ

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్



జూనియర్ కళాశాలలో మెరుగైన బోధన అందించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ లో ఇంటర్ విద్య పై ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ లతో సమీక్ష నిర్వహించారు. జూనియర్ కళాశాలలో విద్యార్థుల ఎనరోల్ మెంట్, ఇంటర్ పరీక్షా ఫలితాల, జూనియర్ కళాశాలలో మరమ్మత్తులు, విద్యార్థుల సంక్షేమ కార్యక్రమాలు, పోటి పరీక్షల శిక్షణ, ఫైర్ సేఫ్టీ, ఇతర మౌలిక సదుపాయాలు, అంశాల పై కలెక్టర్ చర్చించి అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లాలో ఉన్న 10 ప్రభుత్వ జూనియర్ కళాశాల పరిధిలో మొదటి సంవత్సరం 1777 అడ్మిషన్స్ సాధించడం లక్ష్యం కాగా 63% 1116 మంది విద్యార్థులు ఎనరోల్ చేసుకోవడం జరిగిందని అన్నారు. జూనియర్ కళాశాలలో అడ్మిషన్స్ పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. జూనియర్ కళాశాలలో సివిల్ వర్క్ , విద్యుత్ సరఫరా, పారిశుధ్య, నీటి సరఫరా వంటి మౌలిక సదుపాయాల కల్పన, మైనర్ రిపేర్ పనులకు ప్రభుత్వం 1కోటి 80 లక్షలు మంజూరు చేసిందని, నిధులను సద్వినియోగం చేసుకుంటూ మరమ్మత్తు పనులు పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. జూనియర్ కళాశాలలో అందించే విద్య నాణ్యత పెరగాలని అన్నారు. లెక్చరర్ సకాలంలో కళాశాలకు హాజరు కావాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన జరగాలని అన్నారు. 2024-25 విద్యా సంవత్సరంలో సప్లమెంటరీ పరీక్షలు ముగిసిన తర్వాత వేములవాడ, ఎల్లారెడ్డి పేట, ఇల్లంతకుంట కళాశాలలో ఫలితాలు తక్కువగా వచ్చాయని తెలిపారు. సిరిసిల్ల జిల్లాలో ఇంటర్ విద్య చాలా వెనకబడిందని, మౌలిక వసతుల కల్పన పనులు, పరీక్ష ఫలితాలో చాలా ఇంప్రూవ్ కావాలని అన్నారు. జూనియర్ కళాశాలలో విద్యార్థుల సంక్షేమం కోసం అవసరమైన చర్యలు కట్టుదిట్టంగా తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.ప్రతి జూనియర్ కళాశాలలో రెగ్యులర్ గా స్టూడెంట్ కౌన్సిలర్ల ద్వారా విద్యార్థులకు అవసరమైన శిక్షణ అందించాలని అన్నారు. జూనియర్ కళాశాలలో యాంటి డ్రగ్స్ కమిటీ ఏర్పాటు చేసి పోలీసుల సహకారంతో విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాల పై అవగాహన కల్పించాలని అన్నారు. విద్యార్థులకు కెరియర్ కౌన్సిలింగ్ అందించాలని అన్నారు. జూనియర్ కళాశాలలో క్రీడలు ఆడ దానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. మన జిల్లాలోని జూనియర్ కళాశాల విద్యార్థులకు మెడిసిన్, ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షల కోసం అందించిన ప్రత్యేక శిక్షణ కారణంగా మంచి ఫలితాలు సాధించారని, ఇదే స్ఫూర్తి కొనసాగించాలన్నారు. జూనియర్ కళాశాలలో విద్యార్థులందరికీ పాఠ్య పుస్తకాలు, ఇతర పోటీ పరీక్షల పుస్తకాల, టెన్నిస్ కోర్ట్ టేబుల్ టెన్నిస్ క్యారం బోర్డులు చెస్ బోర్డులు ఏర్పాటు చేసి అందించాలని అన్నారు. విద్యార్థులకు ఉపయోగపడే విధంగా ఆ రూట్ లలో కాలేజీ సమయాలకు అనుగుణంగా బస్సులు నడిచేలా ప్రతిపాదనలు అందించాలని అన్నారు. సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి శ్రీనివాస్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ లు పాల్గొన్నారు.

# అంధుల ఆశ్రమ పాఠశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

## విద్యాలయం ప్రిన్సిపాల్ భాస్కర్

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

కరీంనగర్ నగరంలోని శాతవాహన యూనివర్సిటీ ఎదురుగా, మల్కాపూర్ రోడ్ లోని ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ఆ విద్యాలయం ప్రిన్సిపాల్ భాస్కర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో 1వ తరగతి నుంచి 5 వ తరగతి వరకు, ఇంగ్లీష్ మీడియం, 1వ తరగతి నుంచి 10 వ తరగతి వరకు తెలుగు మీడియంలో బోధన కొనసాగుతుందని పేర్కొన్నారు. ప్రత్యేక సాఫ్ట్ వేర్ తో బోధన, శిక్షణ ఈ పాఠశాలలో ఉచితంగా విద్య, భోజన వసతి అందిస్తామని, విద్యతో పాటు ప్రత్యేక సాఫ్ట్ వేర్ తో రూపొందించిన కంప్యూటర్, వివిధ కళల్లో శిక్షణ ఇస్తానని పేర్కొన్నారు. ఈ పాఠశాలలో చేరేందుకు 6 నుంచి 14 ఏండ్లసంవత్సరముల మధ్య వయసు ఉండాలని, జిల్లా మెడికల్ బోర్డు చే జారీ చేసిన సదరం సర్టిఫికెట్ (40%) నుంచి (100%) అంధత్వం ఉన్న బాలబాలికలు అర్హులని స్పష్టం చేశారు. కరీంనగర్ జిల్లా, ఇతర జిల్లాలకు చెందిన అంధ బాల బాలికలను వారి తల్లిదండ్రులు, ఆ గ్రామాల్లోని ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, అంగన్వాడీ టీచర్లు, స్వచ్ఛంద సంస్థలు కరీంనగర్ లోని ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాలలో చేర్పించాలని కోరారు.
పూర్తి వివరాలకు 94405 50345, 97011 90124, 97004 57939, 94403 38424 నంబర్లలో సంప్రదించాలని, వాట్సాప్ ద్వారా సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్ పంపించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

# జిల్లా ఇన్చార్జ్ మంత్రిని కలిసిన సామ రూపేష్ రెడ్డి

## స్థానిక సంస్థల ఎన్నికల్లో అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి

సమయజ్యోతి న్యూస్ ప్రతినిది ఆదిలాబాద్

ఉమ్మడి ఆదిలాబాద్ లిజిల్లా ఇన్చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావునులి ఆదిలాబాద్ యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ఉపాధ్యక్షుడు సామ రూపేష్ రెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు.హైదరాబాద్ లోని రవీంద్రభారతిలో ఇంచార్జ్ మంత్రిని కలిసిన లియువజన కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఉపాధ్యక్షుడు సామ రూపేష్ రెడ్డిలి రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీ కోసం కష్టకాలంలోను వెన్నంటే ఉండి జెండా మోసి కష్టపడి పనిచేసిన వారికి టిక్కెట్లు ఇవ్వాలని కోరారు.క్షేత్రస్థాయిలో పార్టీ కోసం కష్టపడి పనిచేస్తూ ప్రజలకు తాము అధికారంలో లేకపోయినా తమకు అండగా ఉంటామని భరోసా ఇచ్చి వారి సమస్యల పరిష్కారం కోసం ఎంతగానో కృషి చేయడం జరిగిందని తెలిపారు.అటువంటి వారికి రిజర్వేషన్ల ఆధారంగా అవకాశం కల్పించి వారి గెలుపుకు సహకరించాలని కోరారు.జిల్లా ఇన్చార్జి మంత్రిని కలిసిన వారిలో మాజీ సర్పంచ్ విట్టల్ రెడ్డి,యూత్ కాంగ్రెస్ నాయకులు విపిన్ టాక్రే,చవాన్ స్వప్నల్ తదితరులు ఉన్నారు.



# ఎమ్మెల్యే జిఎంఆర్ మరోసారి ఉదారత

సమయజ్యోతి న్యూస్ రామచంద్రాపురం

గతంలో చాలాసార్లు తన ఉదారతను చాటుకున్న పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి మరోసారి తన ఉదారతను చాటుకున్నారు జిన్నారం మండలం కొర్లకుంట గ్రామంలో నిర్మిస్తున్న చిత్తారమ్మ దేవాలయానికి గతంలో 26 లక్షల రూపాయల సొంత నిధులు అందించగా మిగిలిన పనుల కోసం మంగళవారం మరో రెండు లక్షల రూపాయలు అందించారు జిన్నారంలో నిర్మిస్తున్న శివాజీ స్టేడియం బోర్డ్ ఏర్పాటు కోసం 37 వేల రూపాయలు జిన్నారం పరిధిలోని ఎస్టీ గురుకుల పాఠశాలలో మంచి నీటి పైపులైన్లు ఎర్తింగ్ పనుల కోసం 90 వేల రూపాయలను అందించారు మంగళవారం సాయంత్రం పటాన్చెరులోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్ మాజీ సర్పంచులు జనార్ధన్ శివరాజ్ ఆంజనేయుల సమక్షంలో సంబంధిత ప్రతినిధులకు డబ్బులను అందజేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా సొంత నిధులచే దేవాలయాలు మసీదులు చర్చిలు నిర్మిస్తూ పరమత సహనాన్ని పెంపొందిస్తున్నామని తెలిపారు అభివృద్ధిలో ప్రతి ఒక్కరిని భాగస్వాములు చేస్తూ ముందుకు వెళ్తున్నామని తెలిపారు కొడకంచి గ్రామంలో నిర్మిస్తున్న అంగన్వాడి సెంటర్ భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు రాబోయే ఆగస్టు నెలలో వీటిని ప్రారంభించనున్నట్లు తెలిపారుఈ కార్యక్రమంలో అమీన్పూర్ మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి సీనియర్ నాయకులు అంతిరెడ్డి బండి శంకర్ తదితరులు పాల్గొన్నారు



# 4 న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖార్గే బహిరంగ సభను విజయవంతం చేయాలి

## జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడుకైలాస్ శ్రీనివాస్ రావు

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ రావు, జూలై 4, 2025 శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు హైదరాబాదులోని లాల్ బహదూర్ స్టేడియంలో జరగనున్న భారీ ప్రజా సమావేశంలో జిల్లా కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ప్రబలంగా పాల్గొనాలని కోరారు.
ఈ సమావేశం టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు నిర్వహిస్తుండగా, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగించనున్నారు. అలాగే, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రి వర్గ సభ్యులు, పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు."ఇది పార్టీకి గర్వకారణమైన కార్యక్రమం. మేము ప్రతి మండల, గ్రామ స్థాయి నాయకులు, బ్లాక్ అధ్యక్షులు, యూత్ మరియు అనుబంధ సంస్థల నాయకులు ఈ సమావేశానికి భారీ సంఖ్యలో హాజరు కావాలని కోరుతున్నాము" అని అన్నారు.అతను మరింతగా, "ప్రతి నియోజకవర్గం నుండి సుమారు 600 మంది కాంగ్రెస్ నాయకులు, అనుబంధ సంస్థల కార్యకర్తలు సమావేశంలో పాల్గొని, ఈ కార్యక్రమాన్ని గొప్ప విజయంగా మార్చుతారని ఆశిస్తున్నాము" అన్నారు.కైలాస్ శ్రీనివాస్ రావుతో పాటు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గోనే శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గుడుగుల శ్రీనివాస్, పంపరి లక్ష్మన్, రాజగౌడ్, లక్కపత్ని గంగాధర్, పడిహార్ కిరణ్ కుమార్, సుధాకర్ తదితరులు కూడా కార్యకర్తలకు పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఇది మన సమష్టి శక్తి, పార్టీ పట్ల అంకిత భావాన్ని ప్రదర్శించే మంచి అవకాశం. మనం కలిసి ఈ కార్యక్రమాన్ని చరిత్రాత్మకంగా విజయవంతం చేద్దాం" అన్నారు కైలాస్ శ్రీనివాస్ రావు. పిలుపునిచ్చారు.



# ప్రభుత్వ పాఠశాలల్లో ధ్వంసాలకు అడ్డుకట్ట పెట్టాలని టిఎస్ యుటిఎఫ్ డిమాండ్

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి నిజామాబాద్ బ్యూరో**

తెలంగాణ రాష్ట్ర యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ (టిఎస్ యుటిఎఫ్) ఆదిలాబాద్ జిల్లా కమిటీ ప్రభుత్వం పాఠశాలల్లో జరుగుతున్న అల్లరి, ధ్వంసాలకు తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆహ్వానం తెలిపారు.టిఎస్ యుటిఎఫ్ ప్రతినిధులు జిల్లా సూపర్ ఇంటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ) అఖిల్ మహాజన్‌తో సమావేశమై పాఠశాల ప్రాంగణంలో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలపై ఆందోళన వ్యక్తం చేశారు. సెలవు రోజులు మరియు పాఠశాల సమయం ముగిసిన తర్వాత అల్లరి మూకలు పాఠశాలలకు దొంగిలి మద్యం సేవిస్తూ హంగామా చేస్తున్నట్లు వివరించారు. పాఠశాలల్లో ఖాళీ మద్యం సీసాలు, గుట్కా ప్యాకెట్లు, ఇతర కాలుష్య పదార్థాలు విస్తృతంగా కనబడుతున్నాయని చెప్పారు. ఈ కారణంగా ఉపాధ్యాయులు మరియు విద్యార్థులకు కష్టాలు కలుగుతున్నాయి.అంతేకాకుండా పాఠశాల భవనాలు, వనరులు ధ్వంసం చేయడం, మొక్కలను గుంతలు వేసి నాశనం చేయడం వంటి దుర్గుణాలు కూడా జరుగుతున్నాయని తెలిపారు. అటువంటి కార్యకలాపాలకు తగిన నిరోధం తీసుకోవాలని పోలీసులు కోరారు.జిల్లా సీపీ అఖిల్ మహాజన్ వెంటనే అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ సమావేశంలో టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈ వెంకట్, జిల్లా అధ్యక్షులు కె కిష్టన్న, ప్రధాన కార్యదర్శి వి అశోక్, కోశాధికారి కె శ్రీనివాస్ మరియు ఇతర సభ్యులు పాల్గొన్నారు.

# మన కళ్ళకు కనిపించే దేవుళ్ళు డాక్టర్లు

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి అమరచింత వనపర్తి జిల్లా.**

అమరచింత పట్టణంలోని దేశాయి మురళీధర్ రెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి లో విధులు నిర్వహిస్తున్న వైద్యులకు జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వనపర్తి జిల్లా వైస్ చైర్మన్ సయ్యద్ కలాం పాషా మాట్లాడుతూ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న వైద్యులకు జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ వీరి సేవలు అమూల్యమైనవని దేశంలో అనేక రంగాల్లో అనేక వృత్తుల్లో సేవలందిస్తున్న వారిలో ప్రజల కోసం వైద్య వృత్తిని ఎంచుకొని వైద్యులుగా సేవలందిస్తున్న వీళ్లే కనిపించే దేవుళ్ళని అన్నారు. ఈ వృత్తి చాలా పవిత్రమైందని వీరి సేవలను ప్రశంసిస్తూ రోగులకు అండగా నిరంతరం వైద్య సేవలు అందించి పునర్జన్మణిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ఫయాజ్, డాక్టర్ మానస, డాక్టర్ నికిత లకు ఘనంగా సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ సురేందర్ గౌడ్, ఆదిలక్ష్మి, ఆరోగ్య కార్యకర్తలు మరియు ఆశ కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.




# డాక్టర్స్ డే సందర్భంగా డాక్టర్ కు సన్మానం -బీఎస్పీ పార్టీ సన్మానం

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి మందమర్రి**

డాక్టర్స్ డే సందర్భంగా మందమర్రి ప్రభుత్వ డాక్టర్ రాపాక రమేష్ ని బహుజన్ సమాజ్ పార్టీ శాలువాతో సన్మానించి స్వీట్ తినిపించి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ముల్కల్ల రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ డాక్టర్స్ ప్రజలకు చేసే సేవలు ప్రజలు మర్చిపోరని డాక్టర్స్ ని పేషెంట్ లు దేవుడితో పోలుస్తారని తెలిపారు. ముఖ్యంగా కరోనా సమయంలో ప్రజలు భయపడి బయటికి వెళ్లని పరిస్థితిలో డాక్టర్లు మాత్రం కరుణ పేషెంట్లకు కూడా వైద్యం చేశారని అన్నారు. అలాంటి డాక్టర్లను సన్మానించడం ఆనందంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు నాగుల కిరణ్ బాబు, పట్టణ, మండల అధ్యక్షులు గాజుల శంకర్, ఎండి మతిన్ ఖాన్, నాయకులు షేక్ రహీం బాబా తదితరులు పాల్గొన్నారు.



# ఆదివాసీ గ్రామాలలో అకడి పూజలు

**సమయజ్యోతి న్యూస్ జూలై 01 బజార్ హత్నూర్**

ఆషాడమాసం ప్రారంభంతో ఆదివాసీ గ్రామాల్లో అకాడి పూజలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. బజార్ హత్నూర్ మండలం అనంతపూర్ గ్రామ ఆదివాసీలు పొలిమేరకు వెళ్లి వనదేవతలకు పూజలు చేశారు. సంప్రదాయ వంటలు తయారు చేసి నైవేద్యాలు సమర్పించారు. ప్రజలతోపాటు పంటలు, పశుపక్ష్యాదులు బాగుండాలని మొక్కినట్లు గ్రామాల ఆదివాసీ పెద్దలు తెలిపారు.



# భూసేకరణ ప్రక్రియలో జాప్యానికి తావు ఉండొద్దు కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి నిజామాబాద్ బ్యూరో**



జిల్లాలో చేపట్టే రోడ్ల విస్తరణ, ఇతర అభివృద్ధి పనులకు సంబంధించి జాప్యానికి తావు లేకుండా భూ సేకరణ ప్రక్రియ, చెల్లింపులు త్వరితగతిన జరిగేలా చొరవ చూపాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఐడీఓసీ వీసీ కాన్ఫరెన్స్ హాల్ లో రోడ్ల విస్తరణ, రైల్వే పనులు, నీటి పారుదల, జాతీయ రహదారులు, పరిశ్రమల స్థాపన తదితర వాటికి అవసరమైన భూసేకరణపై సంబంధిత అధికారులతో శాఖల వారీగా కలెక్టర్ మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఇదివరకటి సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలును సమీక్షించి, అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. భూసేకరణపై ప్రతి వారం సమీక్ష నిర్వహిస్తానని, ఎప్పటికప్పుడు ప్రగతి కనిపించేలా కృషి చేయాలని సూచించారు. బోధన్ - బాసర్ - భైంసా రోడ్డు నిర్మాణానికి సేకరించిన భూమికి సంబంధించిన చెల్లింపులు త్వరితగతిన జరిగేలా చూడాలన్నారు. 63వ నెంబర్ జాతీయ రహదారి విస్తరణ, అభివృద్ధి, జానకంపేట - బాసర రోడ్డు వెడల్పు, నిజామాబాద్ - నర్సీ రోడ్డు మార్గంలో అర్సపల్లి వద్ద ఆర్ యూ బీ నిర్మాణం, మేడ్చల్ నుండి ముద్ఖేడ్ వరకు రైల్వే డబ్లింగ్, సిద్ధాపూర్ రిజర్వాయర్ నిర్మాణం తదితర పనులకు సంబంధించి భూసేకరణ ప్రక్రియపై కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్షించారు. భూసేకరణ ప్రక్రియకు సంబంధించి రైతులతో సంప్రదింపులు జరుపుతూ, నష్టపరిహారం నిర్ణయంలో సానుకూల ధోరణిని అవలంభించాలని సూచించారు. నిబంధనలకు అనుగుణంగా వ్యవహరిస్తూ, భూసేకరణపై పెండింగ్ లో ఉన్న అప్పీల్ లను వేగంగా పరిష్కరించాలని అన్నారు. వారం అనంతరం భూసేకరణపై మళ్ళీ సమీక్ష చేస్తామని, స్పష్టమైన ప్రగతి కనిపించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, నిజామాబాద్, ఆర్మూర్ ఆర్డీఓలు రాజేంద్ర కుమార్, రాజాగౌడ్, ఎస్సారెస్పీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేందర్, కలెక్టరేట్ పర్యవేక్షకుడు భాస్కర్, రైల్వే, ఆర్ అండ్ బీ, జాతీయ రహదారులు, ఇరిగేషన్, టీజీఐఐసి తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యంలో అందరికి మాట్లాడే స్వేచ్ఛ ఉంది కార్పొరేటర్ సింధూఆదర్శ్ రెడ్డి

**సమయజ్యోతి న్యూస్ రామచంద్రాపురం**



పటాన్చెరు నియోజకవర్గం ఇంద్రేశం గ్రామంలో బీఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్ నల్లబాలు శశిధర్ గౌడ్ పై రేవంత్ రెడ్డి సర్కార్ బనాయించిన అక్రమ కేసును తీవ్రంగా ఖండిస్తూ అరెస్టైన శశిధర్ గౌడ్ కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పేందుకు పలువురు బీఆర్ఎస్ నేతలు మంగళవారం హాజరయ్యారు ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ భారతి నగర్ డివిజన్ కార్పొరేటర్ సింధుఆదర్శ్ రెడ్డి పాల్గొని శశిధర్ గౌడ్ కుటుంబాన్ని పరామర్శించి మాట్లాడుతూ శశిధర్ గౌడ్ ఎలాంటి తప్పు చేయలేదని ప్రభుత్వం ఇచ్చిన హామీలను ప్రశ్నించడం ప్రభుత్వ వ్యవస్థను విమర్శించడం నేరం కాదు ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి అభిప్రాయ స్వేచ్ఛ ఉంది మీరు భయపడకండి మీకు బీఆర్ఎస్ పార్టీ పూర్ణ మద్దతుగా నిలుస్తుంది అని ధైర్యం చెప్పారు ఈ సందర్భంగా బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్లు దినేష్ చౌదరి పాటిమీది జగన్ సతీష్ రెడ్డి పార్టీ నాయకులు పుట్టావిష్ణువర్ధన్ రెడ్డి అభిలాష్ రావు బీఆర్ఎస్ మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ ప్రజాస్వామ్యాన్ని అణచివేయాలనుకోవడం దుర్మార్గమని దీన్ని బీఆర్ఎస్ పార్టీ సహించదని నేతలు హెచ్చరించారు

# జి.ఓ నెం.49ను తక్షణమే రద్దు చేయాలి ఆదివాసి సేన డిమాండ్

**సమయజ్యోతి న్యూస్ గుడిహత్నూర్, జూలై 1, 2025**



టైగర్ కన్జర్వేషన్ రిజర్వ్ ప్రాజెక్ట్ పేరుతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జి.ఓ నెం.49ను తక్షణమే రద్దు చేయాలని ఆదివాసి సేన తీవ్రంగా డిమాండ్ చేసింది. ఈ ప్రాజెక్ట్ ఆదివాసుల హక్కులు, జీవన విధానం, అస్తిత్వాన్ని ప్రమాదంలోకి నెడుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు.గుడిహత్నూర్ మండలంలోని ఆదివాసి విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ఆదివాసి సేన అధ్యక్షుడు కోవ దౌలత్ రావ్ మొకాశి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ, టైగర్ సంరక్షణ పేరిట అటవీ సంపదను కార్పొరేట్ కంపెనీలు, పెట్టుబడిదారులకు అప్పగించే కుట్రను కేంద్ర ప్రభుత్వం పన్నిందని విమర్శించారు. ఈ సమావేశానికి గుడిహత్నూర్ మండల ఆదివాసి సేన అధ్యక్షుడు సేడ్మకి భీం రావు అధ్యక్షత వహించారు.మణిపూర్, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాల్లో ఇప్పటికే ఆదివాసుల హక్కులను తుంగలో తొక్కి కార్పొరేట్ సంస్థలకు అటవీ భూభాగాలను అప్పగించిన నేపథ్యంలో, తెలంగాణలో ఇలాంటి జి.ఓలను జారీ చేయడం దురదృష్టకరమని దౌలత్ రావ్ తెలిపారు. ఇది ఆదివాసులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కుట్రగా అభివర్ణించారు.అధికారులు, మంత్రులు "ఆదివాసులకు ఎటువంటి నష్టం జరగదు" అని చెబుతూనే, మరోవైపు ప్రభుత్వ పథకాలపై అడ్డంకులు పెడుతున్నారని, రాజ్యాంగ హక్కులను గౌరవించకుండా ముందుకెళ్తున్నారని విమర్శించారు. ప్రతిపాదిత టైగర్ రిజర్వ్ ప్రాజెక్ట్‌ను వెంటనే ఉపసంహరించుకుని, ఆదివాసుల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలని, లేకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం మొదలవుతుందని హెచ్చరించారు.జి.ఓ నెం.49 రద్దుకు సంబంధించిన ఉద్యమ కార్యాచరణను త్వరలో ప్రకటిస్తామని కూడా దౌలత్ రావ్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో వివిధ మండలాల ఆదివాసి నాయకులు వెడ్మ చంపత్ రావు, కోట్నహ్కా కేశవ్, కోట్నహ్కా గణేష్, ఆత్రం రవి, పోయాం సురేందర్, తేకం రాజ్ కుమార్, మడావి నాగో రావు, పెందోర్ జుగదిరావు, మడావి చందు, ఆత్రం భీం రావు, మడావి సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సిగాచీ పరిశ్రమలో కడప నవదంపతుల అదృశ్యం

**కడప,జూలై 1(సమయజ్యోతి):**

సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచీ పరిశ్రమలో జరిగిన ఘోర ప్రమాదం పలు కుటుంబాల్లో విషాదం నింపింది. ప్రమాద సమయంలో కంపెనీలో పనిచేస్తోన్న కడప జిల్లా జమ్మలమడుగుకు చెందిన నిఖిల్‌రెడ్డి, శ్రీరమ్య ఆచూకీ గల్లంతైంది. నిఖిల్‌రెడ్డి ఇటీవలే ముద్దనూరు మండలం పెనికలపాడు గ్రామానికి చెందిన నామాల శ్రీరమ్యను ప్రేమ వివాహం చేసుకున్నారు. ఈ ఆషాఢ మాసం తర్వాత పెద్దల సమక్షంలో ఘనంగా వేడుక చేద్దామని నిర్ణయించుకున్నారు. ఈక్రమంలో సోమవారం సిగాచీ ఔషధ పరిశ్రమలో జరిగిన దుర్ఘటనలో దంపతులిద్దరూ దుర్మరణం చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. ఇరు కుటుంబాలకు చెందిన వారు శోకసంద్రంలో మునిగిపోయారు.

# చంద్రబాబు హెలికాప్టర్ అత్యవసర ల్యాండిగ్

**అమరావతి,జూలై 1(సమయజ్యోతి):**

ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రయాణిస్తున్న హెలికాప్టర్ అత్యవసరంగా ల్యాండ్ అయ్యింది. మంగళవారం తూర్పుగోదావరి జిల్లా మలకపల్లిలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను సీఎం పంపిణీ చేయాల్సి ఉంది. అక్కడకు వెళ్లి గ్రామసభల్లో పాల్గొనడంతో పాటు పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొనాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా నేడు ఉండవల్లిలోని నివాసం నుంచి తూర్పుగోదావరి జిల్లా కాపవరం వెళ్లి అక్కడి నుంచి నేరుగా మలకపల్లి వెళ్లాల్సి ఉంది. అయితే ఉండవల్లి నుంచి బయలుదేరిన వెంటనే వాతావరణం సరిగా లేకపోవడంతో తిరిగి గన్నవరం విమానాశ్రయంలో హెలికాప్టర్‌ను పైలెట్ ఎమ్జ్గం÷న్సీగా ల్యాండ్ చేశారు. తరువాత గన్నవరం నుంచి ప్రత్యేక విమానంలో చంద్రబాబు రాజమండ్రికి వెళ్లారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో మలకపల్లికి వెళ్లనున్నారు సీఎం.

# సింగయ్య మృతి కేసులో జగన్‌కు ఊరట

## రెండు వారాలపాటు చర్యలు నిలిపివేత హైకోర్టు ఆదేశాలు

**అమరావతి,జులై 1(సమయజ్యోతి):**

సింగయ్య మృతి ఘటనలో వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డికి ఊరట దక్కింది. జగన్‌తో పాటు ఇతరులపై నమోదైన కేసులో ఏపీ హైకోర్టు రెండు వారాలపాటు స్టే విధించింది. ఈ కేసులో రెండు వారాల పాటు తదనంతర చర్యలు తీసుకోవద్దని పోలీసులకు న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసును కొట్టివేయాలంటూ జగన్ దాఖలు చేసిన పిటిషన్ మంగళవారం హైకోర్టులో విచారణకు వచ్చింది. తమ వద్ద ఉన్న వీడియో ఆధారాలు, ఇతర సాక్ష్యాలు కోర్ట్ ముందు ఉంచేందుకు రెండు వారాలు సమయం కావాలని కోర్టును అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ కోరారు. అయితే ఇప్పటికే ఈ కేసును బీఎన్ఎస్ కింద 105 సెక్షన్‌కు మార్చారని పిటిషనర్ తరపు న్యాయవాదులు వాదించారు. అందువల్ల తదనంతర చర్యలు, అరెస్ట్ నుంచి రక్షణ కల్పించాలని కోర్టును జగన్ తరఫు న్యాయవాదులు కోరారు. దీంతో రెండు వారాల పాటు తదనంతర చర్యలపై హైకోర్టు స్టే విధించింది. కాగా, ఇటీవల మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి.. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల పర్యటన సందర్భంగా సింగయ్య అనే వృద్ధుడు మృతిచెందాడు. జగన్ ప్రయాణిస్తున్న కారు కిందపడి ప్రాణాలు కోల్పోయాడు. తొలుత జగన్ కాన్వాయ్ వాహనం ఢీకొని వృద్ధుడు చనిపోయాడని వార్తలు వచ్చినప్పటికీ నాలుగు రోజుల తర్వాత జగన్ కారు కిందే సింగయ్య పడిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ క్రమంలో జగన్ సహా పలువురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో హైకోర్టును జగన్ ఆశ్రయించారు. తమపై పెట్టిన కేసును కొట్టివేయాలంటూ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు రెండు వారాలపాటు స్టే విధించింది.

# నకిలీ పట్టాల కేసులో వల్లభనేనికి ఊరట

## షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసిన కోర్టు

**విజయవాడ,జులై 1(సమయజ్యోతి):**

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేత, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్‌కు కోర్టులో భారీ ఉపశమనం లభించింది.. ఏలూరు జిల్లాలోని నూజివీడు కోర్టు తాజా వల్లభనేని వంశీకి బెయిల్ ఇచ్చింది.. నకిలీ ఇళ్ల పట్టాల కేసులో బెయిల్ మంజూరు చేసింది నూజివీడు కోర్టు.. అయితే, లక్ష రూపాయలకు సంబంధించి 2 ష్యూరిటీలు, వారానికి 2 సార్లు స్టేషన్ కి రావాలంటూ షరతులు పెట్టింది.. అయితే, ఇప్పటి వరకు 10 కేసుల్లో వల్లభనేని వంశీకి బెయిల్ మంజూరు అయ్యింది.. వంశీకి అన్నీ కేసుల్లో బెయిల్ రావటంతో జైలు నుంచి విడుదల అయ్యే ఛాన్స్ ఉంది.. మరోవైపు, వంశీ బెయిల్ రద్దు చేయాలని సుప్రీంకోర్టులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేసింది.. ప్రభుత్వ పిటిషన్‌పై రేపు విచారణ చేపట్టనుంది సుప్రీంకోర్టు.. దీంతో, రేపు ఏం జరగబోతోంది అనేది ఉత్కంఠగా మారింది..కాగా, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్ను హైదరాబాద్ రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని మైహోం భుజాలో ఫిబ్రవరి 13వ తేదీన అరెస్ట్ చేశారు విజయవాడ పటమట పోలీసులు.. ఆ తర్వాత హైదరాబాద్ నుంచి విజయవాడకు తరలించారు.. కిడ్నాప్, దాడి, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బీఎన్ఎస్ సెక్షన్లు 140(1), 308, 351(3), రెడ్‌విత్ 3(5) కింద వంశీపై కేసు నమోదు చేశారు పోలీసులు.. ఇక, ఆ తర్వాత.. వరుసగా వంశీపై కేసులు నమోదు అవుతూ వచ్చాయి.. తీవ్ర అనారోగ్య సమస్యలు ఎదుర్కున్న వంశీ.. ఎప్పటికప్పుడూ.. బెయిల్ కోసం ప్రయత్నిస్తూ వచ్చినా.. మరోవైపు, కొత్త కేసులతో ఆయన జైలులోనే ఉండాల్సిన పరిస్థితి.. ఇక, కోర్టు అనుమతితో ఆయనకు ఆస్పత్రికి తరలించినా.. ఆ తర్వాత మళ్లీ వంశీని జైలుకు తరలించారు.. అయితే, ఇప్పుడు అన్ని కేసుల్లో బెయిల్ రావడం ఓవైపు.. రేపు సుప్రీంకోర్టులో విచారణ నేపథ్యంలో.. ఎలాంటి డెవలప్‌మెంట్స్ ఉంటాయి అనేది ఆసక్తికరంగా మారిందనే చెప్పాలి..



# డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే ఏపీ అభివృద్ధి సాధ్యం

-మనమే ఐదు సీట్లు ఇచ్చే స్థాయికి ఎదగాలి-బిజెపి అధ్యక్షుడి బాధ్యతల స్వీకరణలో కేంద్రమంత్రి వర్మ

-పార్టీ కోసం తనవంతుగా కష్టపడి పనిచేశానన్న పురందేశ్వరి







**విజయవాడ,జూలై 1(సమయజ్యోతి):**

డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే ఏపీ అభివృద్ధి సాధ్యమని కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ వ్యాఖ్యానించారు. కూటమి నేతలతో సమన్వయం చేస్తూనే.. ఏపీ బీజేపీని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. మనం ఐదు శాతం సీట్లు తీసుకోవడం కాదని.. మనమే మరో పార్టీకి సీట్లు ఇచ్చే స్థాయికి ఎదగాలని కోరుకున్నారు. మంగళవారం విజయవాడ బీజేపీ కార్యాలయంలో శ్రీనివాస వర్మ మీడియాతో మాట్లాడారు. ఏపీ బీజేపీ రథసారథిగా ఎంపికైన పీవీఎన్ మాధవ్‌కు శ్రీనివాస వర్మ శుభాకాంక్షలు తెలిపారు. పురంధేశ్వరి ఏపీ బీజేపీ అధ్యక్షురాలిగా పార్టీ కోసం ఎంతో పనిచేశారని శ్రీనివాస వర్మ కొనియాడారు. తాను ఎంపీగా, కేంద్రమంత్రిగా పురంధేశ్వరి సహకారంతో ఎదిగానని ఉద్ఘాటించారు. పీవీఎన్ మాధవ్ కూడా నిత్యం పార్టీ కోసం పని చేస్తారని అన్నారు. మాధవ్ తండ్రి చలపతిరావు కూడా పార్టీ కోసం పరితపించే వారని గుర్తుచేసుకున్నారు. అప్పటి నాయకులకు చలపతిరావు సేవల గురించి తెలియదని చెప్పారు. 1980 నుంచి 1986 వరకు బీజేపీ ఏపీ అధ్యక్షుడిగా ఎన్నికైన తొలి వ్యక్తి చలపతిరావే అని గుర్తుచేసుకున్నారు. ఆ కుటుంబం నుంచి వచ్చిన మాధవ్ కూడా సొంతంగా ఎదిగారని కొనియాడారు. మాధవ్ ఏపీ బీజేపీని బలోపేతం చేస్తారనే నమ్మకం తమకు ఉందని ఉద్ఘాటించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేసేలా పీవీఎన్ మాధవ్ చూడాలని కోరారు. కింది స్థాయి కార్యకర్తలతో మాట్లాడి.. వారి సమస్యలు పరిష్కరించేలా మాధవ్ పని చేయాలని కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ సూచించారు. ఇకపోతే రాజకీయాల్లో స్వలాభాపేక్ష ఏ రోజూ తాను చూసుకోలేదని బీజేపీ ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి చెప్పారు. పార్టీకి లాభం చేకూర్చాలనే భావన తప్ప.. తన రెండు సంవత్సరాల ప్రస్థానంలో మరే ఆలోచన లేదన్నారు. తనను ప్రోత్సహించిన, ప్రతిఘటించిన కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. పీవీఎన్ మాధవ్ కూడా కార్యకర్తలకు అనుగుణంగా వెళతారని తాను ఆశిస్తున్నానని ఎంపీ పురంధేశ్వరి పేర్కొన్నారు. ఏపీ బీజేపీ అధ్యక్షుడిగా మాధవ్ ఎన్నికయ్యారు. బీజేపీ జెండాను మాధవ్‌కు ఇచ్చి.. పార్టీ బాధ్యతలను పురంధేశ్వరి అప్పగించారు. మాధవ్ ప్రమాణ స్వీకారోత్సవ సభలో పురందేశ్వరి మాట్లాడారు. '2013లో బీజేపీలోకి నేను వచ్చాను. బీజేపీలోకి వచ్చిన నాటి నుంచి నాకు పార్టీ గౌరవం ఇస్తోంది. అన్ని విధాలుగా నాకు గౌరవం ఇచ్చిన పార్టీకి కృతజ్ఞతలు. పీవీఎన్ మాధవ్ తండ్రి చలపతిరావు పోరాట యోధులు. చలపతిరావు నుంచి పట్టుదల, ఎలా ముందుకు వెళ్లాలో నేర్చుకున్నాను. వెంకయ్య నాయుడు నుంచి చనువు, చొరవ నేర్చుకున్నాను. ఏపీ బీజేపీకి జీవితం అంకితం చేసిన నాయకుల నుంచి నేను చాలా నేర్చుకున్నా. నన్ను ప్రోత్సహించిన, ప్రతిఘటించిన కార్యకర్తలు ఇరువురికి నా ధన్యవాదాలు' అని రాజమండ్రి ఎంపీ పురంధేశ్వరి చెప్పారు. కార్యకర్త సహకారం లేకపోతే ఎమ్మెల్యేలు, ఎంపీలు గెలవడం సాధ్యం కాదు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలిగా రెండేళ్లల్లో పార్టీ బలోపేతం కోసం నా వంతు కృషి చేశా. నాకు అప్పగించిన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వర్తించా. స్వలాభాపేక్ష ఏ రోజూ నేను చూసుకోలేదు. పార్టీకి లాభం చేకూర్చాలనే భావన తప్ప.. నా రెండు సంవత్సరాల ప్రస్థానంలో మరే ఆలోచన లేదు. పీవీఎన్ మాధవ్ కూడా కార్యకర్తలకు అనుగుణంగా వెళతారని నేను ఆశిస్తున్నాను. ప్రభుత్వంలో భాగస్వాములుగా ఒకొక్క మాట ఆచితూచి మాట్లాడాలి' అని ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి సూచించారు. గత రెండేళ్లుగా ఏపీ బీజేపీ అధ్యక్షురాలిగా పురంధేశ్వరి పని చేసిన విషయం తెలిసిందే.

# పేదలను ఆదుకునేలా 'పేదల సేవలో'





**ఒకటో తేదీన పెన్షన్లు ఇవ్వండతో ప్రజల్లో ఆనందం**

**గత ప్రభుత్వ హయాంలో జీతాలు, పెన్షన్లు సరిగా ఇవ్వలేదు**

**వైసీపీ హయాంలో జరిగిన విధ్వంసాన్ని ఎప్పడూ చూడలేదు**

**నెలలోపు డీఎస్సీ ఉద్యోగాలు ఇస్తామని ప్రకటన**

**మలకపల్లి ప్రజావేదిక సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు**

**రాజమండ్రి,జులై 1(సమయజ్యోతి):**

పేదలను ఆదుకునేలా 'పేదల సేవలో' కార్యక్రమం చేపట్టామని.. ఈ కార్యక్రమం ప్రపంచంలో ఎక్కడా జరగడం లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఒకటో తేదీన పింఛన్లు ఇవ్వటం వల్ల ప్రజలు ఆనందంతో ఉన్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో జీతాలు, పెన్షన్లు సరిగా ఇవ్వలేదని విమర్శించారు. వైసీపీ హయాంలో జరిగిన విధ్వంసాన్ని తన జీవితంలో ఎప్పుడూ చూడలేదని అన్నారు. నెలలోపు డీఎస్సీ ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించారు. తూర్పుగోదావరి జిల్లా మలకపల్లి ప్రజావేదిక సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. భారతదేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా పింఛన్లు ఇస్తున్నామని వెల్లడించారు. నూటికి 13 మందికి పింఛన్లు ఇచ్చే ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని చెప్పుకొచ్చారు. సూపర్ సిక్స్ పథకాల అమలుకు కట్టుబడి ఉన్నామని సీఎం చంద్రబాబు మరోసారి స్పష్టం చేశారు. ఏపీని పునర్నిర్మాణం చేస్తామని హామీ ఇచ్చామని.. విధ్వంసం నుంచి వికాసం వైపు నడిపిస్తామని అన్నారు. గతంలో వ్యవస్థలన్నీ పడకేశాయని, ఆర్థిక వ్యవస్థ దెబ్బతిన్నదని వ్యాఖ్యానించారు. 'అభివృద్ధి చేస్తాం.. సంపద సృష్టిస్తాం.. ఆదాయం పెంచుతామని' వెల్లడించారు. పెరిగిన ఆదాయం పేదలకు పంచి అభివృద్ధికి ఖర్చు పెడతామని చెప్పుకొచ్చారు. తన తల్లి పడిన కష్టం ఏ మహిళకూ ఉండకూడదని ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నామన్నారు చంద్రబాబు. ఎంతమంది పిల్లలు ఉన్నా తల్లికి వందనం ఇస్తున్నామని వివరించారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. పింఛన్లు ఇచ్చేటప్పుడు ఉద్యోగులు సేవా భావంతో ఉండాలని సూచించారు. పింఛన్ల పంపిణీలో పేదవారిని చులకనగా చూస్తే సహించనని హెచ్చరించారు. పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు కష్టపడుతున్నానని తెలిపారు. మానవత్వంతో దివ్యాంగుల కోసం 12 రెట్లు పింఛన్లు పెంచామన్నారు. రాజకీయ ముసుగు వేసుకొని ప్రజాధనాన్ని దోచుకుంటే సహించనని వార్నింగ్ ఇచ్చారు. ఎన్డీయే కార్యకర్తలు దగ్గరుండి మరీ లబ్దిదారులకు పింఛన్ల పంపిణీ పరిశీలించాలని ఆదేశించారు. 'డ్రగ్స్, గంజాయి విక్రయించే వారి తాట తీస్తా. ఆడబిడ్డపై చేయివేసే వారికి అదే చివరి రోజు. రౌడీయిజాన్ని సహించను' అని తీవ్రంగా హెచ్చరించారు. 'సాధారణ కుటుంబంలో పుట్టి దేవుని కృప వల్ల అంచెలంచెలుగా అభివృద్ధి చెందాం. డాక్టర్ అంబేడ్కర్ సాధారణ కుటుంబం నుంచి జన్మించి తరతరాలు గుర్తుండే రాజ్యాంగాన్ని రచించారు. లక్ష బంగారు కుటుంబాలను దత్తత తీసుకున్నాం. రూ.10లక్షల కోట్ల అప్పులు తీర్చాలని' అన్నారు. పోలవరాన్ని వైసీపీ భ్రష్టుపట్టించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలవరాన్ని 2027కి పూర్తి చేసే అదృష్టం దేవుడు తనకే ఇచ్చారన్నారు. డిసెంబర్ నాటికి డయాఫ్రమ్ వాల్ నిర్మాణం పూర్తి అవుతుందన్నారు. గోదావరి పుష్కరాలు మూడోసారి తానే చేయబోతున్నానని.. కనీవినీ ఎరగని రీతిలో గోదావరి పుష్కరాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు.రాజ కీయాల్లోకి రౌడీలు వస్తున్నారని చంద్రబాబు మండిపడ్డారు. పాయక రావుపేట హాస్టల్‌లో సరిగ్గా భోజనం పెట్టని ఉద్యోగులను సస్పెండ్ చేశామన్నారు. వివేకా మృతిపై ఆయన



కుమార్తె అనుమానం వ్యక్తం చేస్తే గొడ్డలి పోటుగా నిర్ధారించామని అన్నారు. రౌడీషీటర్‌ను పలకరించటానికి జగన్ వెళ్లి రౌడీయిజం చేశారని ఫైర్ అయ్యారు. జగన్ కారు కిందపడి చనిపోతే కుక్కను లాగినట్టు పక్కన లాగి పాడేశారన్నారు. 'నా జీవితంలో నేను ఎక్కడా ఎవర్ని కొట్టలేదు, నాపై కేసులు లేవు. ప్రజలను కాపాడేందుకు నేరస్తులతో రాజకీయ పోరాటం చేస్తున్నా. నేరస్తులకు ఓటు వేసి గెలిపిస్తారా' అని సీఎం ప్రశ్నించారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఆగస్టు 15 నాటికి నూరు శాతం సేవలు అందిస్తామన్నారు. గతేడాది కంటే ఈ ఏడాది తలసరి ఆదాయం రూ.30వేలు పెంచామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# కెసిఆర్ హయాంలోనే బనకచర్లకు శ్రీకారం

## గోదావరి జలాలను సీమకు తరలించే యత్నం

## పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన ఉత్తమ్





**హైదరాబాద్,జులై1(సమయజ్యోతి):** ఏపీ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన పోలవరం – బనకచర్ల లింక్ ప్రాజెక్ట్‌పై ప్రతిపక్షాలు బాధ్యతా రాహిత్యంగా మాట్లాడుతున్నాయని తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. పోలవరం–బనకచర్లపై కేంద్రానికి మన అభ్యంతరాలను తెలిపామని తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి చెప్పారు. బనకచర్ల ప్రాజెక్టు గోదావరి వాటర్ ట్రైబ్యునల్ తీర్పునకు వ్యతిరేకమని వాదించామన్నారు. ఏపీ ప్రభుత్వం చేసిన బనకచర్ల ప్రాజెక్టు ప్రతిపాదనను కేంద్రం వెనక్కి పంపిన నేపథ్యంలో మంత్రి ఉత్తమ్ ప్రజాభవన్‌లో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. 'పోలవరం, ధవళేశ్వరానికి కలిపి ఏపీ 484 టీఎంసీలకు మించి వాడుకోరాదు. పోలవరం నుంచి నీటి ఎత్తిపోతల కోసం 2 టన్నెల్ నిర్మాణాలు ప్రతిపాదించారు. రోజుకు 20వేల క్యూసెక్కులు తరలించేలా 2 టన్నెల్స్ ప్రతిపాదన పెట్టారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే బనకచర్ల ప్రాజెక్టుకు అంకురార్పణ జరిగింది. కృష్ణా గోదావరి జలాల్లో గత పదేళ్లలో రాష్ట్రానికి అన్యాయం జరిగింది. గోదావరి జలాలను సీమకు తరలిస్తుంటే కేసీఆర్ నోరెత్తలేదని మంత్రి ఉత్తమ్ అన్నారు. మంగళవారం ప్రజా భవన్‌లో బనకచర్లపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లతో పాటు ఉన్నతాధికారులు హాజరయ్యారు. అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. కృష్ణా నదిలో ఏపీకి ఎక్కువ నీళ్లు ఇచ్చేందుకు గత ప్రభుత్వం ఒప్పుకొని తెలంగాణ రాష్ట్రానికి బీఆర్ఎస్ తీరని ద్రోహం చేసిందని మండిపడ్డారు. గోదావరి జలాలను రాయలసీమకు తరలించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రయత్నాలు మొదలయ్యాయిని ఆయన గుర్తు చేశారు. అంతేకాకుండా తమ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారంటూ బీఆర్ఎస్ పార్టీ నేతలపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. అయితే బనకచర్ల ప్రాజెక్ట్ నిర్మాణాన్ని అడ్డుకునేందుకు తాము చేసిన ప్రయత్నం ఫలించిందన్నారు. తమ వాదనతో కేంద్రం ఏకీభవించిందని స్పష్టం చేశారు. ఏపీ ప్రభుత్వం పంపిన బనకచర్ల లింక్ ప్రాజెక్ట్ ప్రతిపాదనను కేంద్రం వెనక్కి పంపిందన్నారు.

# సమస్యలకు సమాధానం లేదు

## తప్పించుకునేందుకే విదేవీ యానం

### మోడీ విదేశీ పర్యటనపై జైరామ్ రమేశ్ విమర్శలు

**న్యూఢిల్లీ,జూలై1(సమయజ్యోతి):** తరచుగా విదేశాలకు ప్రయాణించే సూపర్ ప్రీమియమ్ ప్రధాని ఐదు దేశాల 'విహారయాత్ర'కు బయలుదేరారని కాంగ్రెస్ పార్టీ ప్రధాని మోడీని ఎద్దేవా చేసింది. మణిపూర్ ఉద్రిక్తతలు, భారత్ మరియు పాకిస్తాన్‌ల మధ్య కాల్పుల విరమణపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన వాదనలు సహా నాలుగు అంశాలపై సమాధానం చెప్పకుండా ప్రధాని మోడీ తప్పించుకుంటున్నారని మండిపడింది. ప్రధాని మోడీ నిర్ణయం వల్లే ఆపరేషన్ సిందూర్‌లో మొదటి రెండు రోజుల్లో భారత్ తిరోగమనం ఎదుర్కొందని రక్షణ అధికారులు వెల్లడించిన ఆరోపణల నుండి ప్రధాని పారిపోతున్నారని కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ ఇన్‌చార్జ్ కమ్యూనికేషన్స్ జైరాం రమేష్ ఆరోపించారు. ఆపద,కష్టసమయంలోనూ కొందరు వ్యక్తులు ధైర్యంగా ముందుకు సాగుతారు. కానీ తప్పించుకునేందుకు 'తరచుగా విదేశాలకు ప్రయాణించే' మన ప్రధాని 8 రోజుల విహార యాత్రకు బయలుదేరారు' అని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. దేశాన్ని ఆందోళనకు గురిచేస్తున్న నాలుగు సమస్యల నుండి ఆయన పారిపోతున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ పట్టాలు తప్పినప్పటి నుండి, అక్కడి ప్రజలు సాధారణ జీవన పరిస్థితుల నుండి దూరమైనా ప్రధాని మోడీ ఒక్కసారి కూడా మణిపూర్ సందర్శించలేదని అన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో ప్రధాని మోడీ నిర్ణయాల కారణంగా భారత్ కొంత మేర నష్టాన్ని ఎదుర్కొందని రక్షణ అధికారులు వెల్లడించిన వార్తలపై సమాధానం చెప్పకుండా తప్పించుకునేందుకు ప్రధానిమోడీ పారిపోతున్నారని జైరాం రమేష్ మండిపడ్డారు. బ్రెజిల్‌లో జరిగే బ్రిక్స్ సమ్మిట్ పాల్గొనడంతో పాటు ఎనిమిదిరోజుల పర్యటనలో ప్రధాని మోడీ గనా, ట్రినిడాడ్, టొబాగో, నమీబియాలను సందర్శించనున్నారని విదేశాంగ మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

# సిగాచీ యాజమాన్యంపై సిఎం రేవంత్ మండిపాటు

## బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

### మృతుల కుటుంబాలకు కోటి పరిహారం ఇప్పిస్తామని ప్రకటన

**సంగారెడ్డి,జూలై1(సమయజ్యోతి):** సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు పాశమైలారం ఘటన మృతుల కుటుంబాలకు కోటి రూపాయల పరిహారం ఇప్పిస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. అదే విధంగా తీవ్రంగా గాయపడి ఎలాంటి పని చేసుకోలేని స్థితిలో ఉన్న బాధిత కుటుంబాలకు రూ.10 లక్షలు, స్వల్పంగా గాయపడి, తిరిగి పనిచేసుకోగలిగే వారికి రూ.5 లక్షలు ఇవ్వనున్నట్లు తెలిపారు. చనిపోయిన వారి పిల్లల చదువుల బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని, గురుకులాలో సీట్ల గురించి మాట్లాడాలని అధికారులకు సూచించామని చెప్పారు. బాధితులకు ప్రభుత్వం తరపున వైద్యం అందించే బాధ్యత తీసుకుంటామని తెలిపారు. సిగాచి ఫ్యాక్టరీ ప్రమాదాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందని అన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన కంపెనీ యాజమాన్యం, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మంగళవారం మంత్రులు, అధికారులతో కలిసి ప్రమాద స్థలాన్ని పరిశీలించిన సీఎం రేవంత్.. ఉమ్మడి రాష్ట్రంలో, తెలంగాణలో ఇన్ని ప్రాణాలను బలిగొన్న ప్రమాదం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఫైర్, హైడ్రా, డిజాస్టర్, రెవెన్యూ శాఖల సమన్వయంతో సహాయక చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ ఘటనలో ఎలాంటి సహాయక చర్యలు తీసుకోవాలో ఆదేశించడం జరిగిందని చెప్పారు. ఈ ఘటనలో అధికారిక సమాచారం ప్రకారం 36 మంది చనిపోయారని సీఎం రేవంత్ తెలిపారు. ప్రమాద సమయంలో పరిశ్రమలో 143 మంది ఉన్నారని, 58 మంది వివరాలు అధికారుల దృష్టిలోకి వచ్చాయని, మిగతా వారు శిథిలాల కింద ఉన్నారా లేక భయంతో టచ్ లోకి రాలేదా అనేది స్పష్టంగా తెలియదని అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో ప్రణాళికలన సిద్ధం చేస్తామని చెప్పారు. ఘటనలపై కమిటీ రిపోర్ట్ ఇస్తుందని.. ప్రాథమిక సమాచారం తర్వాత ప్రమాదపై పూర్తి వివరాలు చెబుతామని అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం పర్యవేక్షిస్తుందని హామీ ఇస్తున్నట్లు చెప్పారు. ఇలాంటి ఘటనలను భవిష్యత్ లో జరగకుండా ఉండేందుకు.. ఓ వ్యవస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు సీఎం రేవంత్ చెప్పారు.

# రాష్ట్ర నీటి హక్కులు కాపాడడంలో కెసిఆర్ పూర్తిగా విఫలం



**తెలంగాణకు మరణశాసనం రాసిన కెసిఆర్, హరీష్ రావు**

**గోదావరి మిగులు జలాలపై ఎపికి అనుకూలంగా నిర్ణయం**

**కాళేశ్వరంతో లక్షకోట్లు వృధా చేసిన కెసిఆర్**

**అది పూర్తి చేయాలంటే మరో 50వేల కోట్లు ఖర్చు చేయాలి**

**మీడియా సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి వెల్లడి**

**హైదరాబాద్,జులై 1(సమయజ్యోతి):** తెలంగాణ జలాల విషయంలో రాజీపడేది లేదని సీఎం రేవంత్‌రెడ్డి కుండబద్దలు కొట్టారు. రాష్ట్రానికి చెందిన నీటిహక్కులు కాపాడటంలో రాజకీయంగా, సాంకేతికంగా, న్యాయపరంగా పోరాడుతూనే ఉంటామని చెప్పారు. ప్రజాభవన్‌లో 'గోదావరి–బనకచర్ల'పై ప్రభుత్వం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చింది. ప్రజాభవన్ లో బనకచర్ల ప్రాజెక్టు పైనా తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల చైర్మన్లు,ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. 'నీటిపారుదల శాఖను పదేళ్లపాటు కేసీఆర్, హరీశ్‌రావు చూశారు. రాష్ట్ర నీటి హక్కులను వాళ్లు కాపాడతారని అందరూ భావించారు. కానీ వాళ్లే నష్టం చేశారు. 811 టీఎంసీల్లో తెలంగాణకు 299 టీఎంసీలు చాలని.. 68 శాతం జలాలు ఏపీకి కేటాయిస్తే అభ్యంతరం లేదని 2015లో సంతకం చేశారు. 2015లో కేసీఆర్, హరీశ్‌రావు చేసిన సంతకాలే తెలంగాణకు మరణశాసనంగా మారాయి. కృష్ణా పరివాహక ప్రాంతం పరంగా చూస్తే తెలంగాణకే ఎక్కువ దక్కాలి. ప్రాజెక్టులు పూర్తికాకపోవడంతో కేటాయించిన 299 టీఎంసీలు కూడా వాడుకోలేని పరిస్థితి వచ్చింది. ఉమ్మడి ఏపీలో ప్రారంభించిన ప్రాజెక్టులను పదేళ్లపాటు పట్టించుకోలేదు. ఏపీ మాత్రం పూర్తి చేసుకున్న ప్రాజెక్టులకు నీటిని తరలించుకుపోతోందని రేవంత్‌రెడ్డి అన్నారు. నీళ్ళకు తెలంగాణ ప్రజలకు అనుబంధం ఉంది.. నీళ్లలో జరిగిన అన్యాయం పైనే తెలంగాణ ఉద్యమం కొనసాగింది.. నీళ్ల విషయంలో అందరిదీ ఏకాభిప్రాయమే.. తెలంగాణ హక్కులు కాపాడాలనేది మా ఆలోచన అన్నారు. అయితే, కేసీఆర్, హరీష్ రావుల దగ్గరే తొమ్మిదిన్నరేళ్ల పాటు నీటి పారుదల శాఖ ఉంది.. వాళ్ళ మీద పెట్టిన నమ్మకం వమ్ము చేశారు.. వాళ్ళు తీసుకున్న నిర్ణయాలు తెలంగాణకి గుది బండలాగా మారింది.. నికర జలాల మీద కేటాయింపుల్లో స్పష్టత ఉందని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఇక, కృష్ణా నదిలో 811 టీఎంసీలలో 299 టీఎంసీలు తెలంగాణకు చాలు అని కేసీఆర్ సంతకం చేసి వచ్చిండు అని ముఖ్యమంత్రి రేవంత్ ఆరోపించారు. అప్పుడు కూడా మేం అభ్యంతరం వ్యక్తం చేశాం.. పరివాహక ప్రాంతాన్ని బట్టి నీటి కేటాయింపులు చేయాలని మేం వాదించాం.. 2020లో కూడా 299 టీఎంసీలు చాలు అని చెప్పారు.. కేసీఆర్, హరీష్ రావులు నీటి కేటాయింపులు సాధించలేదని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రాజెక్టులు పూర్తి చేయలేదు.. కేంద్రానికి కూడా శాశ్వత పరిష్కారం ఇవ్వాలని ముందుకు రాలేదు.. కేసీఆర్ తన దాహం తీర్చుకోవడానికి.. కాళేశ్వరం పేరుతో అంచనాలు మార్చాడని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తి షేప్ రావాలంటే.. ఇంకో 50 వేల కోట్లు కావాలి.. లక్ష కోట్లు ఖర్చు చేసి 50 వేల ఎకరాలకు నీరు ఇచ్చారు .. 7 వేల కోట్ల కరెంట్ బిల్లులు అయ్యాయి.. మరో 118 టీఎంసీల నీటిని సముద్రంలో కలిపారని రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. అయితే, గోదావరిని పూర్తిగా వాడుదామంటే నీళ్ల కేటాయింపు సమస్య, నిధుల సమస్య వస్తుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. బీఆర్ఎస్ చెప్తున్న అబద్ధాలు.. మీరు జనంలోకి తీసుకెళ్లాలి అని సూచించారు. నదులు పునరుజ్జీవం కోసం కాదు.. బీఆర్ఎస్ పునరుజ్జీవం కోసం ప్రయత్నం చేస్తున్నారు అని మండిపడ్డారు. అందుకు ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకు కుట్రలు చేస్తున్నారు.. ఫామ్ హౌస్ లో ఉండి క్షుద్ర పూజలు చేస్తున్నారని ఆరోపించారు. ఉమాభారతి దగ్గరకి వెళ్లి 3 వేల టీఎంసీల నీళ్ళు ఉన్నాయని కేసీఆర్ అన్నాడో అప్పుడే సమస్య మొదలైంది. చంద్రబాబు మేల్కొని.. తెలంగాణనీ ఇరకటంలోకి నెట్టిండు.. చంద్రబాబు వచ్చినా.. జగన్ వచ్చినా.. గోదావరి నీళ్లు తీసుకుపోతామన్నారు.. రోజా ఇంటికి వెళ్ళి.. గోదావరి నీళ్లు ఇస్తామని కేసీఆర్ అన్నారు.. కేసీఆర్ వైఖరి.. మా ఇంటికి వస్తే ఏం తెస్తావు.. మీ ఇంటికి వస్తె ఏం ఇస్తావు అన్నట్టు ఉందని సీఎం రేవంత్ పేర్కొన్నారు. ఏపీ ప్రతిపాదిత బనకచర్ల ప్రాజెక్ట్‌కు కేంద్ర ప్రభుత్వం అనుమతులు తిరస్కరించడం తెలంగాణ ప్రభుత్వ విజయమని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. బనకచర్ల ప్రాజెక్ట్‌తో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్న తెలంగాణ ప్రభుత్వ వాదనలను కేంద్ర ప్రభుత్వం అంగీకరించిందని.. అందుకే బనకచర్ల ప్రాజెక్ట్?కు పర్యావరణ అనుమతులు తిరస్కరించిందన్నారు. బనకచర్ల ప్రాజెక్ట్‌కు కేంద్ర ప్రభుత్వం అనుమతులు తిరస్కరించడం తెలంగాణ ప్రభుత్వం సాధించిన విజయమని పేర్కొన్నారు. బనకచర్ల ప్రాజెక్ట్‌కు సంబంధించి ఏపీ సీఎం చంద్రబాబు చేసిన వాదనలు పూర్తిగా అవాస్తమని అన్నారు.

కాగా, ఏపీ ప్రతిపాదిత బనకచర్ల ప్రాజెక్ట్ విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బనకచర్ల ప్రాజెక్ట్?కు పర్యావరణ అనుమతులు ఇచ్చేందుకు నిరాకరించింది. బనకచర్ల ప్రాజెక్ట్?కు పర్యావరణ అనుమతులు ఇవ్వలేమని ఆంధ్రప్రదేశ్‌కు తేల్చిచెప్పింది. ఈ మేరకు బనకచర్ల ప్రాజెక్ట్ కోసం ఆంధ్రప్రదేశ్ పంపిన ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వం తిప్పిపంపింది. బనకచర్ల ప్రాజెక్ట్‌కు అనుమతులు ఇవ్వాలంటే సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ) పరిశీలించాల్సి ఉందని.. ఈ మేరకు సీడబ్ల్యూసీని అప్రోచ్ కావాలని ఏపీకి సూచించింది. సీడబ్ల్యూసీతో కలిసి ఫ్లడ్ వాటర్ అవేలబులిటి అస్సెస్ చేయాలని పేర్కొంది. అంతరాష్ట్ర జల వివాదానికి క్లియరెన్స్ తెచ్చుకోవాలని ఆంధ్రప్రదేశ్‌కు సూచించిందని అన్నారు.

# అమ్రాబాద్ టైగర్ ఫారెస్ట్ మూసివేత

## జంతువుల సంతానోత్పత్తి కోసం చర్యలు

**నాగర్‌కర్నూలు,జులై 1(సమయజ్యోతి):** పెద్ద పులులు, అరుదైన వన్య ప్రాణుల ఆరోగ్య భద్రతా, సంతానవృద్ధి, సంతానోత్పత్తి పక్రియల దృష్టా అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌ను మూడు నెలల పాటు రాష్ట్ర అటవీ శాఖ వన్యప్రాణి సంరక్షాణ విభాగం మూసివేస్తున్నట్లు ప్రకటించింది. పర్యాటకులను ఆకట్టుకునే అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో సందర్శకుల కోసం జంగిల్ ట్రిప్, వీక్షణ ప్రదేశాల వంటి సందర్శన ప్రాంతాలు జూను 30 వరకు అందుబాటులో ఉన్నాయి. తాజాగా జాతీయ పెద్దపుల సంరక్షణ అథారిటీ (ఎన్‌టిసిఎ) మార్గదర్శకాలకు అనుగుణంగా పులులతో పాటు ఇతర వన్యప్రాణుల ఆరోగ్య పరిరక్షణ కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు జూపార్క్ డైరెక్టర్, అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫీల్డ్ డైరెక్టర్ , అటవీశాఖ అచ్చంపేట సర్కిల్ కన్జర్వేటర్ డాక్టర్ సునీల్ ఎస్. హిరేమంత్ తెలిపారు.ప్రతి ఏడాది వర్షాలంలో టైగర్ రిజర్వ్‌లో పెద్దపులు, ఇతర వన్యప్రాణులు వర్షాల కారణంగా తడిసిన నేలల్లో ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్తల్లో భాగంగా వాటికి ఇతరాత్ర అలికిడి ఉండని విధంగా సిబ్బందితో పాటు సందర్శకులను కజ్జర్వేషన్ జోన్‌లోకి అనుమతించరు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది కూడా జూలై 1వ తేదీ నుంచి సెప్టెంబర్ 30వ తేదీ వరకు అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లోని ఫర్హాబాద్ వ్యూ పాయింట్, అక్టోపస్ వ్యూ పాయింట్లు మూసి వేస్తున్నట్లు ఫీల్డ్ డైరెక్టర్ వెల్లడించారు. వన్యప్రాణుల పరిరక్షణ ప్రయత్నాలు సులభతరం చేయడంతో పాటు వ్యాధు వ్యాప్తిని నివారించేందు ఈ మూడు నెలల కాలం ఎంతో కీలకం. దాంతో టైగర్ రిజర్వ్‌లోకి పర్యాటకులను అనుమతించరు. పెద్ద పులుల సంతోనోత్పత్తి ఎ÷–లాన్ (టిసిపి) ప్రకారం పర్యావరణ వ్యవస్థ, వన్యప్రాణుల సంరక్షణ నిర్వహించడానికి టైగర్ జోన్ మూసివేత దోహదపడుతుంది. అంశాన్ని పర్యాటకులు, వన్యప్రాణి ఔత్సాహికులు గ్రహించి సహకరించాలని అధికారులు కోరుతున్నారు. పర్యాటకులతోపాటు ఇతరులు ఎవరూ కూడా ఆంక్షలు అమలులో ఉన్న పెద్దపులుల సంరక్షణ ప్రదేశాల వద్ద నిబంధనలు ఉల్లగించి కనిపిస్తే సహించేది లేదని ఫీల్డ్ డైరెక్టర్ హ్చారించారు. కాగా, వర్షా కాలంలో వన్యప్రాణులు సంతానోత్పత్తి చేసి పుట్టిన పిల్లలను సంరక్షించుకునేందు ప్రశాతం వాతావరణం కోరుకుంటాయి. పలు రకాల వన్యప్రాణులు సంతానోత్పత్తి పక్రియకు ఆడ, మగ జంతువులు జత కట్టె అనుకూల కాలం కూడా ఈ మూడు నెలలలో అధికంగా ఉంటుంది. వేసవి కారణంగా ఎండిన అటవీ ప్రాంతం వర్షాలు కురుస్తుండడంతో తిరిగి సమతుల్యతను పెంచుకునే వీలు ఉంటుంది.

# అసంఘటితరంగ కార్మికులకు ప్రమాద బీమా కల్పించండి

## -ఎమ్మెల్యే జీ ఎం ఆర్

**సమయజ్యోతి న్యూస్ రామచంద్రాపురం**

సిగాచి పరిశ్రమ దుర్ఘటనను ఒక గుణపాఠంగా తీసుకుని రాబోయే రోజుల్లో పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని ఫార్మా కెమికల్ పరిశ్రమల్లో ప్రమాదాలు చోటు చేసుకోకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని పరిశ్రమలలో పనిచేస్తున్న అసంఘటితరంగ కార్మికులకు 50 లక్షల రూపాయల ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి కోరారు మంగళవారం సిగాచి పరిశ్రమను సీఎం రేవంత్ రెడ్డి మంత్రులు వివేక్ దామోదర రాజనర్సింహా పొంగులేటి సుధాకర్ రెడ్డి దుద్దిల్ల శ్రీధర్ బాబులు పరిశీలించగా వారితో కలిసి ఎమ్మెల్యే జిఎంఆర్ సందర్శించారు దుర్ఘటన జరిగిన పరిశ్రమలోని వివిధ విభాగాలను వారు పరిశీలించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ పలు అంశాలను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు
ఆసియాలోని అతిపెద్ద పారిశ్రామిక వాడగా పాశమైలారంలో వేలాది బల్క్ డ్రగ్స్ ఫార్మా కెమికల్ పరిశ్రమలు తమ ఉత్పత్తులను కొనసాగిస్తున్నాయని తెలిపారు ప్రధానంగా పలు పరిశ్రమలలో భద్రత ప్రమాణాలు పాటించకుండా శిక్షణ లేని దినసరి కార్మికులతో రియాక్టర్లు బాయిలర్లు నడిపిస్తున్నారని దీని మూలంగా భారీ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు యాజమాన్యాల కక్కుర్తి మూలంగా కార్మికులు తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని పని చేయాల్సిన దారుణ పరిస్థితులు నెలకొంటున్నాయని పేర్కొన్నారు ఈ అంశంలో ప్రభుత్వం ప్రత్యేక కమిటీని నియమించి పూర్తిస్థాయిలో తనిఖీలు చేపట్టి భవిష్యత్తులో ప్రమాదాలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టాలని కోరారుపటాన్చెరులో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సిద్ధం అవుతున్నప్పటికి ఇస్నాపూర్ లో రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రభుత్వ ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు ట్రామా కేర్ ద్వారా ప్రమాదం చోటు చేసుకున్న వెంటనే సత్వర వైద్యం అందించగలుగుతామని తెలిపారు దేశంలోని వివిధ రాష్ట్రాల కు చెందిన నిరుపేద ప్రజలు పొట్టకూటి కోసం స్థానిక పరిశ్రమలలో దినసరి కూలీలుగా పనిచేస్తున్నారని వారికోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయడంతో పాటు 50 లక్షల రూపాయల ప్రమాద బీమా సౌకర్యాన్ని అందించేలా యాజమాన్యాలకు ఆదేశాలు జారీ చేయాలని కోరారుఅనంతరం పటాన్చెరువు





పట్టణంలోని ధ్రువ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులను పరామర్శించారు

# పెండింగ్ నిర్మాణ పనుల పురోగతిపై ఆరా తీసిన

## -జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :**

అదిలాబాద్ జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో మంగళవారం విద్యా,వైద్యం,సివిల్ సప్లై ఇంజనీర్,ఇఇపిఆర్ తదితర సంబంధిత అధికారులతో ఆయా శాఖల పెండింగ్ నిర్మాణాల పనుల పై జిల్లా కలెక్టర్ రాజర్షి షా సమావేశం నిర్వహించి పురోగతి పై ఆరా తీశారు.ఈ సందర్భంగా ఆయా శాఖలలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల నిర్మాణాల పురోగతి పై శాఖల వారిగా అధికారులను అడిగి తెలుసుకున్నారు.బడిబాట కు సంబంధించిన ప్రభుత్వం ఇచ్చిన టార్గెట్ 65000 పనులు కాగా ఇప్పటికి వరకు 58000 చేరుకున్నామని,ఇంకా 4000 పెండింగ్ ఉన్నాయన్నారు.జూనియర్ కాలేజీ లకు సంబంధించిన 4206 ప్రభుత్వం ఇచ్చిన టార్గెట్ అందులో 2,582 వరకు పనులు పూర్తి చేయడం జరిగిందని,అమ్మ ఆదర్శ పాఠశాల నిధులతో ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్,స్కూల్ వర్క్స్,డ్రింకింగ్ వాటర్,టాయిలెట్స్,కాంపౌండ్ వాల్స్ ఇతర పెండింగ్ రిపేర్ పనులు త్వరగా పూర్తి చేయాలని అన్నారు.ఈ సందర్భంగా బేల,ఇంద్రవెల్లి,నార్నూర్,తలమడుగు మండలాల్లో భవిత కేంద్రాల మౌళిక



వసతుల నిర్మాణ పనులతీరు,గ్రౌండిగ్,చేపడుతున్న పనులను ఏఈ,డిఈ లకు దిశా నిర్దేశం చేశారు.ప్రభుత్వం మౌళిక వసతుల కల్పన కై నిధులు కేటాయించిందని,పాఠశాలల్లో,కేజీబీవి లలో పెండింగ్ నిర్మాణ పనులను నిర్ణీత గడువులో పూర్తిచేయాలని,భవిష్యత్తులో మళ్ళీ మరమ్మత్తులు రాకుండా నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు.ఎఫ్ఎల్ఎన్,ఏఐ 17 స్కూల్ లలో ఏర్పాటు చేయడం జరిగిందని,ప్రతీ స్కూల్ లో జరుగుతున్నాయా లేదా అని ఆరా తీశారు.ఈఈ పిఆర్ ద్వారా జన్ మన్ లో మంజూరైన 6 రోడ్ల నిర్మాణం పనులు,ఆయా మండలాల్లో నిర్మిస్తున్న సబ్ సెంటర్,పొలం బాటలో చేపడుతున్న నిర్మాణ పనుల ను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.అనంతరం వైద్య శాఖకు సంబంధించి 15వ ఫైనాన్స్ కమిషన్ నిధుల పై చర్చించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి,జడ్పీ సీఈవో జితేందర్ రెడ్డి,డిఎంహెచ్ఓ,డిఇఓ,డిఎం,ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఏపీజే కలాం ను ఆదర్శంగా తీసుకొని దేశసేవకు సిద్ధపడాలి

## జమాత్ జిల్లా అధ్యక్షుడు మన్జూర్ మొహియుద్దీన్

### టాప్ మెరిట్ విద్యార్థులకు జమాత్ ఏ ఇస్లామీ హింద్ తరపున అవార్డుల ప్రదానం

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి ఆర్మూర్ టౌన్**

“ప్రతి విద్యార్థి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం గారి జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని, ఆయనలా దేశానికి తన జీవితాన్ని అర్పించడానికి సిద్ధంగా ఉండాలి,” అని చార్టర్డ్ అకౌంటెంట్ ఈరవర్తి రాజశేఖర్ పిలుపునిచ్చారు.ఆర్మూర్ జమాతే ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రతిభా విద్యార్థులకు టాపర్మెరిట్ అవార్డులు అందజేయడంతో పాటు ఉచిత పుస్తకాలు, స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాజశేఖర్ విద్యార్థులకు ప్రేరణాత్మక సందేశం ఇచ్చారు. విద్యకు ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇవ్వాలని, సెల్ఫోన్లకు బానిసలుగా మారకూడదని సూచించారు. తల్లిదండ్రులు కూడా పిల్లలు ఫోన్లలో ఏమి చూస్తున్నారో గమనించి, వారి చదువుల పై దృష్టి పెట్టేలా చూడాలని అన్నారు.జమాత్ జిల్లా అధ్యక్షుడు మన్జూర్ మొహియుద్దీన్ మాట్లాడుతూ, ఖుర్ఆన్లో అవతరించిన మొదటి అయత్ ‘ఇక్రా’ (చదవు) అని పేర్కొంటూ, ఇస్లాం దృష్టిలో విద్యకు ఉన్న ప్రాధాన్యతను వివరించారు. సమాజ అభ్యున్నతికి జమాతే ఇస్లామీ హింద్ విద్యను ప్రధానంగా భావిస్తూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు.కార్యక్రమంలో జమాత్ రాష్ట్ర సభ్యుడు ఎం.ఎన్. బైగ్ జహీద్, అస్లాం బిన్



మొహ్సిన్, అబ్దుల్ జబ్బార్, వాజేద్, ఖాలెద్, అబ్దుల్లా, రఫీ తదితరులు పాల్గొన్నారు. అవార్డులు, పుస్తకాలు, బ్యాగులు అందుకున్న విద్యార్థులు, తల్లిదండ్రులు జమాతే ఇస్లామీ హింద్ ఆర్మూర్ కు కృతజ్ఞతలు తెలిపారు.

# విద్యాలయాల్లో పూర్తి వసతులు కల్పించేలా ప్రభుత్వం దృష్టి సారించాలి

## - మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న

**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :**

విద్యార్థులకు ఉజ్వల భవితను అందించే విద్యాలయాల్లో పూర్తి వసతులు కల్పించేలా ప్రభుత్వం దృష్టి సారించాలని,విద్యా రంగంపై నిర్లక్ష్యం వహించకుండా లోటుపాట్లను వెంటనే సరిచేయాలని మాజీ మంత్రి,బీ.ఆర్.ఎస్ జిల్లా అధ్యక్షులు జోగు రామన్న అన్నారు.మంగళవారం పట్టణంలోని బీసీ గురుకుల పాటశాల,కోలం ఆశ్రమ పాటశాలను ఆయన సందర్శించారు.బీ.ఆర్.ఎస్ అధిష్టానం రాష్ట్రవ్యాప్తంగా విద్యా వ్యవస్థను లోపాలపై ఆరాతీస్తుందని,ప్రభుత్వ విద్యా సంస్థల్లో నెలకొన్న సమస్యలను గుర్తించడంలో భాగంగా ఆయా పాఠశాలలను సందర్శించి వివరాలను సేకరించారు.విద్యార్థులతో మాట్లాడి వారికి అందిస్తున్న సౌకర్యాల కల్పనపై ఆర తీశారు.పాటశాలల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.అదేవిధంగా ఉపాధ్యాయులు,సిబ్బందితో మాట్లాడి మెనూ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా విద్యార్థులు,సిబ్బంది పలు సమస్యలను మాజీ మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.



# సమాచార హక్కు చట్టాన్ని బలోపేతం చేయాలి ఆర్టిఐ జిల్లా కన్వీనర్ చర్లపల్లి వెంకటేశ్వర్ గౌడ్

**సమయజ్యోతి ప్రతినిధి భూపాల్ పల్లి**


జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల కేంద్రంలో యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్టిఐ రౌండ్ టేబుల్ సమావేశంలో ముఖ్యఅతిథిగా యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్టీఐ భూపాలపల్లి జిల్లా కన్వీనర్ చర్లపల్లి వెంకటేశ్వర్లు గౌడ్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ప్రజల చేతిలో వజ్రాయుధంగా ఉపయోగపడుతుందని ఆర్టిఐ ఒక నిఘానేత్రం లాంటిదని ప్రజలందరూ వినియోగించుకోవాలని ప్రభుత్వ కార్యాలయంలో సమాచార బోర్డులు ఏర్పాటు చేయాలి సమాచార హక్కు చట్టాన్ని ప్రభుత్వఅధికారులు ఆర్టిఐ, దరఖాస్తు పెట్టిన సమాచారాన్ని జాప్యం చేయకుండా సకాలంలో సమాచారం ఇవ్వాలని ప్రభుత్వఅధికారులు సమాచార హక్కు చట్టాన్ని దుర్వినియోగంకాకుండా అధికారులు కు ప్రజలు సమాచార హక్కు చట్టం ఉద్యమకారులు సమాచారాన్ని కోరితే సరియైన సమయంలో అందించాలని ప్రభుత్వ అధికారులు సమాచార హక్కు చట్టాన్ని అధికారులకు సమావేశాలు నిర్వహించాలని వెంకటేశ్వర్లు గౌడ్ అన్నారు ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా (రామప్ప) వెంకటాపూర్ మండల కమిటీ సభ్యుడు కేశవరావు కంతు రవి అన్న సాంబయ్య ,నర్సింగరావు, ఆర్టిఐ మొగుళ్ళపల్లి మండల కమిటీ సభ్యుడు బండార్ కుమార్ యాదవ్ రాములు పాల్గొన్నారు



# జీహెచ్ఎంసీ అధికారిని 30వేలు లంచం తీసుకుంటుండగా.. ఏసీబీ పట్టివేత

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి హైదరాబాద్**

గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ సీనియర్ అసిస్టెంట్ ఎం.సునితను ?30,000 లంచం తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ అధికారులు మంగళవారం రెడ్హ్యాండెడ్గా పట్టుకున్నారు. మూసాపేట్ సర్కిల్ 23లోని ప్రాపర్టీ ట్యాక్స్ విభాగంలో పనిచేస్తున్న ఆమె, ఓ ఫిర్యాదుదారుడి ఇంటి ప్రాపర్టీ మ్యూటేషన్ ఫైల్ ప్రారంభించి, ప్రాసెస్ చేయడం, అలాగే ట్యాక్స్ ఖరారు చేయాలంటే లంచం ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. బాధితుడు ఈ విషయాన్ని ఏసీబీకి ఫిర్యాదు చేయగా, అధికారులు పథకం వేసి ఆమెను లంచం తీసుకుంటున్న సమయంలో పట్టుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ నెలలో ఇదే విధంగా మరో జీహెచ్ఎంసీ అధికారిని కూడా ఏసీబీ అరెస్ట్ చేసింది. తి.మణిషా అనే అసిస్టెంట్ ఇంజనీర్, జీహెచ్ఎంసీ వార్డ్ నం.2 (నెహ్రూ నగర్, గోల్నాక, అంబర్పేట)లో విధులు నిర్వర్తిస్తున్న ఆమె, ఓ వ్యక్తి బిల్లులను ప్రాసెస్ చేసి పై అధికారులకు పంపించేందుకు ?15,000 లంచం డిమాండ్ చేశారు. ఆమె ఇప్పటికే ?5,000 తీసుకొని, మిగిలిన ?10,000 తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. తెలంగాణ ఏసీబీ అధికారులు ప్రజలకు సూచిస్తూ, లంచాల విషయంలో సహనం లేకుండా వెంటనే ఫిర్యాదు చేయాలని, అలాంటి సమాచారం టోల్ ఫ్రీ నంబర్ 1064 లేదా అధికారిక ఏసీబీ వెబ్సైట్ ద్వారా ఇవ్వొచ్చని తెలిపారు.



# ఏ.టీ.ఓ.గా మహమ్మద్ తాజొద్దీన్ చేరిక

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి ఆర్మూర్ ఆర్మూర్ టౌన్**

ఆర్మూర్ మండల కేంద్రంలోని సబ్ డివిజన్ కార్యాలయంలో మంగళవారం రోజు అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్ గా ముహమ్మద్ తాజొద్దీన్ పదవీ బాధ్యతలు చేపట్టారు. ఆయనను వివిధ శాఖల కార్యాలయాల సిబ్బంది సన్మానించారు.



# విదేశీ ఉపాధి ఉద్యోగాలకు దరఖాస్తు చేయాలి

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్(టామ్‌కామ్), తెలంగాణ ప్రభుత్వంలోని కార్మిక, ఉపాధి శిక్షణ మరియు కర్మాగారాల శాఖ క్రింద ఒక రిజిస్టార్ రిక్రూట్మెంట్ ఏజెన్సీ తెలంగాణా నుండి అర్హత, నైపుణ్యం కలిగిన సెమీ స్కిల్డ్ కార్మికులకు విదేశీ ప్లేస్‌మెంట్‌ను సులభతరం చేయడానికి ఒక నిర్దిష్ట ఆదేశంతో పనిచేస్తున్నది.పోర్చుగల్ లో ఖాళీలు: అభ్యర్థుల వయస్సు 21-40 సంవత్సరాల మధ్య ఉండాలి. సంబంధిత రంగంలో కనీసం 2-5 సంవత్సరాల అనుభవం ఉండాలి. అర్హత కలిగిన అభ్యర్థులు తమ రెజ్యూమ్‌లను %శీఎ-ఎశీఎ.తీవంబఎవఏస్త్రమ్ఖఅశ్రీ.ఎశీఎ% కి పంపవచ్చు. మరిన్ని వివరాల కోసం %జూవీ-జూవీ94400 52592 / 94400 49937 / 94400 51452 %లను సంప్రదించాలి.

# మరోమారు రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర

## కూటమి అక్రమాలను ఎండగట్టడమే లక్ష్యం

## వైసీపీ యూత్ వింగ్‌తో భేటీలో జగన్ ప్రకటన

**అమరావతి,జులై 1(సమయజ్యోతి):**



మరోమారు రాష్ట్రంలో పాదయాత్ర చేపట్టి అధికార కూటమి ప్రభుత్వాన్ని నిలదీస్తానని వైకాపా అధినేత జగన్ ప్రకటంచారు. 2019 ఎన్నికల్లో వైసీపీ అఖండ మెజారిటీతో గెలవడానికి ప్రధాన కారణాల్లో వైఎస్ జగన్ సుదీర్ఘ పాదయాత్ర ఒకటి అని నిస్సందేహంగా చెప్పచ్చు. 3 వేల 648 కిలోమీటర్ల మేర 341 రోజులు జరిగిన ఈ పాదయాత్ర ఒక ట్రెండ్ సెట్టర్ అని చెప్పాలి. ఈ పాదయాత్రకు వచ్చిన రెస్పాన్స్ అప్పట్లో దేశవ్యాప్తంగా హాట్ టాపిక్ అయ్యింది. ఇప్పుడు మళ్ళీ అదే సీన్ రిపీట్ కానుందని తెలుస్తోంది. 2029 ఎన్నికలకు ముందు మరోసారి పాద యాత్ర చేస్తానని ప్రకటించారు జగన్. మంగళవారం తాడేపల్లిలో వైసీపీ యూత్ వింగ్ తో భేటీ అయినా జగన్ ఈమేరకు సంచలన నిర్ణయం ప్రకటించారు. యూత్ వింగ్ పార్టీలో క్రియా శీలక మైందని.. ప్రజా వ్యతిరేక ప్రభుత్వాన్ని నిలదీయడంలో యువతది కీలక పాత్ర అని అన్నారు జగన్. పార్టీ సంస్థాగతంగా మరింత బలోపేతం చేయాలని.. లీడర్లుగా ఎదిగేందుకు ప్రతిపక్షంలో ఉన్నప్పుడే గొప్ప అవకాశం ఉంటుందని అన్నారు జగన్. వచ్చే ఎన్నికలకు ముందు ఎలాగో తన పాదయాత్ర ఉంటుందని.. అప్పుడు సోషల్ మీడియా యాక్టివిస్టులు ప్రతి ఒక్కరిని పేరుపేరునా పిలిచి కలుస్తానని అన్నారు జగన్. పార్టీ పెట్టిన కొత్తలో అందరూ కొత్తవాళ్లే అని.. అప్పట్లో పార్టీలో తాను, తన తల్లి మాత్రమే ఉన్నారని, తన మీద వ్యక్తిగతంగా అభిమానం ఉన్నవాళ్లు పార్టీలోకి వచ్చారని జగన్ అన్నారు. పార్టీ పెట్టడంతోనే తన ప్రస్థానం మొదలైందని.. ఎన్ని కష్టాలు వచ్చినా.. విలువలు, విశ్వసనీయతకే పెద్దపీట వేశానని అన్నారు. రాజకీయంగా ఇబ్బందులు వచ్చినా రాజీ పడలేదని.. ఉప ఎన్నికల్లో దేశంలోనే అత్యధిక మెజార్టీ తనకు వచ్చిందని అన్నారు. పార్లమెంటులో ప్రతి సభ్యుడూ తనవైపు చూసే పరిస్థితి ఉండేదని.. దాన్ని జీర్ణించుకోలేక తనమీద పగబట్టారని అన్నారు జగన్. 18 మంది ఎమ్మెల్యేలు పార్టీలోకి వస్తే వాళ్లందరిచేతా రాజీనామా చేయించానని.. ఉప ఎన్నికల్లో ఘన విజయం సాధించామని అన్నారు. ఆ ఉప ఎన్నికల్లో తెలుగుదేశం, కాంగ్రెస్ కాంగ్రెస్ కలిసి పోటీచేశాయని గుర్తు చేశారు. 2014లో 67 మందితో గెలిచామని.. గెలిచిన 67 మందిలో 23 మందిని చంద్రబాబు లాక్కున్నారని అన్నారు. దేవుడి స్క్రిప్ట్ ప్రకారం 2019 ఎన్నికల్లో వాళ్ళు లాక్కున్న 23 సీట్లకే పరిమితమయ్యారని అన్నారు జగన్. ప్రజలకు అందుబాటులో ఉండడం చాలా ముఖ్యమని.. ప్రజలకు సమస్య వచ్చినప్పుడు ప్రజలకు తోడుగా నిలబడాలని.. మంచి పలకరింపు అన్నదికూడా చాలా ముఖ్యమని.. ఇవి చేయగలిగితే.. లీడర్‌గా ఎదుగుతారని అన్నారు జగన్. మళ్ళీ పాదయాత్ర ఉంటుందని వైఎస్ జగన్ ప్రకటించడంతో వైసీపీ శ్రేణుల్లో ఉత్సాహం రెట్టింపయ్యింది. ఈసారి వైసీపీ అధికారంలోకి రావడం ఖాయమని.. జగన్ 2.0 లోడింగ్ అంటూ కామెంట్ చేస్తున్నారు వైసీపీ శ్రేణులు.

# బిఆర్ఎస్ గురించి తెలుసుకుని మాట్లాడాలి

## ప్రజలు మరోమారు కెసిఆర్ పాలన కోరుకుంటున్నారు

## బిజెపి కొత్త అధ్యక్షుడికి మాజీ స్పీకర్ మధుసూధనరావు చురక

**హైదరాబాద్,జులై 1(సమయజ్యోతి):**

బీఆర్ఎస్ పార్టీని ప్రజలు మర్చిపోయారనే బీజేపీ నూతన రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు మాటలను తీవ్రంగా ఖండిస్తున్నామని శాసన మండలిలో ప్రతిపక్ష నాయకుడు మధుసూధనాచారి తెలిపారు. ఆయనకు రాజకీయలా పట్ల అవగహన లేదని అర్థం అవుతుంది.. అతడి మాటలతో ప్రజల్లో కొత్త ఉత్సాహం నింపాలి అన్నారు. బీజేపీ బీసీని అధ్యక్షుడు చేస్తారని అన్నారు.. జాక్ పాట్ లాగా రాష్ట్ర అధ్యక్షుడు అయ్యాడు రామచందర్ రావు.. ఇక, ఆయన అడుగు పెట్టగానే రాజా సింగ్ కమలం పార్టీకి రాజీనామా చేశారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ని తక్కువ చేసి మాట్లాడినంత మాత్రన మా పార్టీని తక్కువ చేసినట్లు కాదు.. దేశంలో గతం కంటే బీజేపీ స్థానాలు తక్కువ వచ్చాయి.. కానీ, తెలంగాణ సీట్లు పెరుగాయని మాజీ స్పీకర్ మధుసూదన చారి వెల్లడించారు.ఇక, తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఏం చేస్తున్నారని బీజేపీని నమ్ముతారు అని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూధనాచారి చెప్పుకొచ్చారు. మాటలల్లో అనేకం చెప్పి, పనుల్లో మోసం చేస్తున్నారని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దుర్మార్గ పాలన జరుగుతుంది.. తెలంగాణ ప్రజల యొక్క ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ ఒక్కటే పని చేస్తుంది.. శాసనసభ ఎన్నికల్లో ఎంఐఎంతో బీజేపీ పోటీ పడుతూ ఉంటుంది అని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం అనేది అర్థం పర్థం లేని మాటలు.. ఇక, ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షా మాటల్లో తెలంగాణలో దోపిడీ కొనసాగితుందని తెలుస్తుంది.. మా పార్టీని బాద్నాం చేయడానికి ఈ రెండు పార్టీలు ఒకటవ్వలని చూస్తున్నాయి.. తెలంగాణ ప్రజలకు రాజకీయ పార్టీలపై స్పష్టమైన అవగాహన ఉంది.. రెండు పార్టీలు తెలంగాణ ప్రయోజనాలను చక్కదిద్దలేదు.. కేసీఆర్ పాలన పునరావృతం కావాలని ప్రజలు అంటున్నారు.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు తెలంగాణలో లేదని మధుసూధనాచారి తేల్చి చెప్పారు.

# వాల్మీకి కార్పోరేషన్‌లో కర్నాటకకు చుక్కెదురు

## సిబిఐ విచారణకు ఆదేశించిన హైకోర్టు

**బెంగళూరు,జులై 1(సమయజ్యోతి):**

ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సారథ్యంలోని కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వానికి వాల్మీకి ఎస్టీ డవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణంలో ఎదురుదెబ్బ తగిలింది. ఈ కుంభకోణంపై సీబీఐ దర్యాప్తునకు కర్ణాటక హైకోర్టు మంగళవారంనాడు ఆదేశించింది. దీంతో ఇంతవరకూ ఈ కుంభకోణానికి సంబంధించిన నిర్దిష్ట అవకతవకలపై దర్యాప్తునకే పరిమితమైన సీబీఐ ఇకనుంచి మొత్తం కేసులో పూర్తి స్థాయి విచారణ చేపడుతుంది. ఈ కేసులో ఇంతవరకూ జరిగిన విచారణ నివేదకలను సీబీఐకి అప్పగించాలని కూడా హైకోర్టు ఈ సందర్భంగా స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్)ను అదేశించింది. బీజేపీ నేతలు బసనగౌడ పాటిల్ యత్నాల్, అరవింద్ లింబావలి తదితరులు వేసిన పిటిషన్‌పై జస్టిస్ ఎం.నాగప్రసన్న సారథ్యంలోని ధర్మాసనం ఈ ఆదేశాలు ఇచ్చింది. వాల్మీకి స్కామ్‌కు సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ గత జూన్‌లో బళ్లారికి చెందిన కాంగ్రెస్ ఎంపీ ఇ.తుకారాం, ముగ్గురు కర్ణాటక ఎమ్మెల్యేల నివాసాలపై దాడులు జరిపింది. గిరిజన సంక్షేమానికి ఉద్దేశించిన కోట్లాది రూపాయల నిధులు దుర్వినియోగం అయ్యాయని, అక్రమంగా కార్పొరేషన్ అకౌంట్లలోని నిధులను తప్పుడు బ్యాంకు అకౌంట్లలోకి బదిలీ చేశారని ఈ కేసులో ప్రధాన ఆరోపణగా ఉంది. షెల్ కంపెనీలకు తరలించిన నిధులను 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో బళ్లారి నియోజకవర్గంలో వినియోగించినట్టు ఈడీ చెబుతోంది. రాష్ట్రంలోని ఎస్టీల సామాజిక, ఆర్థిక అభ్యున్నతి లక్ష్యంగా నిర్దిష్ట సంక్షేమ పథకాల అమలుకు 2006లో కర్ణాటక మహర్షి వాల్మీకి షెడ్యూల్డ్ ట్రైబ్స్ డవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను ఏర్పాటయింది. 2024 మే 21న వాల్మీకి కార్పొరేషన్ అకౌంట్స్ సూపరింటెండెంట్ అనుమానాస్పద స్థితిలో మృతిచెందడంతో నిధుల దుర్వినియోగం విషయం వెలుగుచూసింది. కార్పొరేషన్ నుంచి అక్రమంగా వివిధ బ్యాంక్ అకౌంట్లకు నిధులు బదిలీ అయినట్టు ఆ అధికారి రాసిన సూసైడ్ నోట్‌ను అధికారులు ఆ తర్వాత కనుగొన్నారు.

# అధికారుల నిర్లక్ష్యం వల్లనే పాశమైలారం దుర్ఘటన

## బాధిత కుటుంబాలకు కోటి పిరహారం చెల్లించాలి

## సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ

**హైదరాబాద్,జులై 1(సమయజ్యోతి):**

సంగారెడ్డి జిల్లా పటాన్ చెరువు సమీపంలోని పాశమైలారంలో జరిగిన పేలుడులో సుమారు 40 మందికి పైగా మృతి చెందారు. ఈ ఘటనపై సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ స్పందించారు. ఈ సందర్భంగా పటాన్ చెరువు కెమికల్ ఫ్యాక్టరీలో మృతులకు కోటి రూపాయల పరిహారం చెల్లించాలి అని డిమాండ్ చేశారు. ప్రభుత్వ తనిఖీ విభాగాలు సరిగ్గా పని చేయక పోవడం వల్ల ప్రమాదం జరిగింది అని ఆరోపించారు. ఫ్యాక్టరీ యాజమాన్యం భద్రతా ప్రమాణాలు పాటించక పోవడంతో పాటు నిర్లక్ష్య ధోరణి వల్ల ప్రమాదం చోటు చేసుకుంది.. ఇది ఫ్యాక్టరీ యాజమాన్యం జరిపిన హత్య.. రాష్ట్రంలో ఉన్న కెమికల్ ఫ్యాక్టరీలపై తనిఖీ విభాగాలను ఏర్పాటు చేయాలని సీపీఐ నారాయణ కోరారు.ఖీ।జీట ంబెనీ: ఏజీతి ఘూఠజీనీజీస: అందుకే పాక్ పహల్గామ్ దాడి చేసింది.. ట్రంప్ వాదన అంతా తప్పు.అలాగే, ఏపీ సీఎం చంద్రబాబుకు సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ లేఖ రాశారు. మదనపల్లి హార్సిలీ హిల్స్ రామ్ దేవ్ బాబాకు అప్పగించడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. అది పతంజలి కాదు అనైతిక పతంజలి అంటూ విమర్శలు గుప్పించారు. కార్పొరేట్లకు మించిన కార్పొరేట్ రామ్ దేవ్ బాబా.. కార్పొరేట్ ముసుగులో ఉన్న దొంగ బాబాకు హార్సిలీ హిల్స్ ను రామ్ దేవ్ బాబాకు ఇవ్వడం సరైన నిర్ణయం కాదన్నారు. టూరిజం, యోగా అభివృద్ధికి ఇస్తున్నారనడం సరికాదు.. జిడ్డు కృష్ణమూర్తి ఫౌండేషన్ కి ఇచ్చి ఉంటే బాగుండేది అన్నారు. మదనపల్లి హార్సిలీ హిల్స్ రామ్ దేవ్ బాబుకు ఇవ్వడాన్ని సీపీఐ తీవ్రంగా వ్యతిరేకిస్తుంది.. బాబా రామ్ దేవ్ ను ఏపీకి రానివ్వమని కె. నారాయణ తేల్చి చెప్పారు.

# హసన్ జిల్లాలో వరుస గుండెపోటు మరణాలు

## కోవిడ్ వ్యాక్సిన్ కావచ్చన్న సిఎం సిద్దరామయ్య అనుమానం

**బెంగళూరు,జులై 1(సమయజ్యోతి):**

కర్ణాటకలోని హసన్ జిల్లాలో గుండెపోటుతో మృతిచెందుతున్న వారి సంఖ్య అంతకంతకూ పెరుగుతుండటాన్ని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఎట్టకేలకు అంగీకరించారు. ఒకే జిల్లాలో 20 మందికి పైగా మరణించడం ఆందోళన కలిస్తోందని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పేర్కొన్నారు. ఈ మరణాలకు కోవిడ్ వ్యాక్సిన్‌ను హడావిడిగా ఆమోదించడం, ప్రజలకు పంపిణీ చేయడం కూడా కారణం కావచ్చని వ్యాఖ్యానించారు. 'గత ఒక్క నెలలోనే హసన్ జిల్లాలో 20 మందికి పైగా గుండెపోటుతో మరణించారు. ప్రభుత్వం ఈ విషయాన్ని చాలా సీరియస్‌గా తీసుకుంది. వరుస మరణాల వెనుక కారణాన్ని కనిపెట్టి, పరిష్కారం చెప్పేందుకు జయదేవ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కార్డియోవాస్క్యులర్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర నాథ్ సారథ్యంలో నిపుణుల కమిటీని ఏర్పాటు చేశాం. పది రోజుల్లోగా నివేదిక ఇవ్వాలని కోరాం' అని సిద్ధరామయ్య ఆ ట్వీట్‌లో తెలిపాకు. రాష్ట్రంలో యువకులు అకస్మాత్తుగా మరణించడం వెనుక కారణాలపై గత ఫిబ్రవరిలో ఏర్పాటు చేసిన కమిటీకే ఈ బాధ్యత అప్పగించామని, కోవిడ్ వ్యాక్సిన్ వల్ల ప్రతికూల పరిణామాలు ఎదురయ్యాయా అనే దానిపై కూడా కమిటీ అధ్యయనం చేస్తుందన్నారు. గుండెపోటు మరణాలు పెరగడానికి కోవిడ్ వ్యాక్సిన్ కారణం కావచ్చని ప్రపంచ వ్యాప్తంగా పలు అధ్యయనాలు ఇటీవల వెల్లడించాయని చెప్పారు. ఈ విషయంలో విమర్శలు చేసే ముందు బీజేపీ ఆత్మపరిశీలన చేసుకోవాలని విమర్శించారు. హసన్ జిల్లాలో అకస్మాత్తుగా గుండెపోటు మరణాలు చోటుచేసుకోవడానికి అసలు కారణానికి కనిపెట్టేందుకు తాము కట్టుబడి ఉన్నామని సీఎం చెప్పారు. ఈ లక్ష్యంతోనే ప్రజారోగ్య పరిరక్షణ కోసం 'హృదయ జ్యోతి', 'గృహ ఆరోగ్య' వంటి పథకాలను ఇప్పటికే అమలు చేస్తున్నామన్నారు. డాక్టర్ రవీంద్రనాథ్ నాయకత్వంలో నిపుణుల కమిటీ నివేదిక ఆధారంగా తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# పాశమైలారంలో 13 మృతదేహాల గుర్తింపు

## డిఎన్ఎ అనంతరం శవాల అప్పగింత

## మృతుల కుటుంబాలకు తక్షణం లక్ష అందచేత

**పటాన్‌చెరు,జులై 1(సమయజ్యోతి):**

పాశమైలారం ఘటనలో మృతిచెందిన కార్మికుల కుటుంబీకులకు ప్రభుత్వం తక్షణ సాయం అందించింది. ఈ ప్రమాదంలో 36 మంది మృతిచెందగా.. 13 మందిని గుర్తించారు. వారి మృతదేహాలను పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబీకులకు సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య రూ.లక్ష చొప్పున తక్షణ సాయాన్ని అందజేశారు. క్షతగాత్రులకు 50వేలు అందించారు. అయితే ఇది తాత్కాలిక తక్షణ సాయంగా ఇసెం రేవంత్ రెడ్డి ఇప్పటికే ప్రకటించారు. ఇదిలావుంటే సంగారెడ్డి జిల్లా పటాన్ చెరువులోని ప్రభుత్వ ఆస్పత్రిలో మార్చురీలో హృదయవిదారక దృశ్యాలు దర్శనమిస్తున్నాయి. పటాన్‌చెరువు సర్కారు దవాఖానలోని మార్చురీలో ఉన్న మృతదేహాలు చూసి కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఏ మృతదేహం ఎవరిదో తెలియక మార్చురీ దగ్గర కార్మికుల కుటుంబాలు ఎదురు చూసాయి. డీఎన్ఏ రిపోర్ట్ వచ్చిన తర్వాత వైద్య శాఖ అధికారులు మృతదేహాలను బంధువులకు అప్పగించారు. అయితే, ఇప్పటి వరకు పటాన్ చెరువు మార్చురీలో గుర్తించిన మృతదేహాలకు డాక్టర్లు పోస్టుమార్టం పూర్తి చేశారు .కాగా, పోస్టుమార్టం పూర్తి అయిన 11 మంది మృతదేహాలను కుటుంబ సభ్యులకు అధికారులు అప్పగించారు. వీరిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వారు నలుగురు ఉండగా తెలంగాణకు చెందిన వారు ఒకరు.. ఒరిస్సా కు చెందిన వారు ముగ్గురు, బీహార్ కు చెందిన వారు ఇద్దరు ఉన్నారు.

# బెదరించి నాపైనా అత్యాచారం

## మోనోజిత్ మిశ్రాపై మరో యువతి సంచలన ఆరోపణలు

**కోల్‌కతా,జులై 1(సమయజ్యోతి):**

బెంగాల్ రాజధాని కోల్‌కతాలో లా స్టూడెంట్‌పై గ్యాంగ్ రేప్ ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగానే.. ఈ కేసులో ప్రధాన నిందితుడుగా ఉన్న మోనోజిత్ మిశ్రాపై మరో యువతి సంచలన ఆరోపణలు చేసింది. మోనోజిత్ మిశ్రా తనను కూడా బెదిరించి లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని ఆరోపించింది. రెండేళ్ల క్రితం ఓ పని మీద కాలేజ్‌కు వెళ్తే బెదిరించి తనపై దాడి చేసి లైంగికంగా వేధించాడని తెలిపింది. ఈ విషయం బయటకు చెబితే నా తల్లిదండ్రులు, సోదరిని చంపేస్తానని బెదిరించడంతో ఇన్నాళ్లు ఎవరికీ విషయం చెప్పలేదని బాధితురాలు తెలిపింది. పోలీసులను సంప్రదించడానికి తనకు భయం వేస్తోందని వాపోయింది. తృణమూల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే, కళాశాల బోర్డు అధ్యక్షుడు అశోక్ కుమార్ దేబ్ అతనికి అండగా ఉన్నాడని.. మిశ్రాకు ఉన్న రాజకీయ సంబంధాల వల్లే ఈ ఘటనపై తాను అప్పట్లో పోలీసులకు ఫిర్యాదు చేయలేదని చెప్పింది. మిశ్రాపై గతంలో అనేక పోలీసు ఫిర్యాదులు నమోదైనప్పటికీ అతని రాజకీయ ప్రభావం వల్ల పోలీసులు కూడా ఎలాంటి చర్యలు తీసుకోలేదని బాధితురాలు ఆరోపించింది. తనే కాకుండా దాదాపు 15 మంది విద్యార్థినులు మోనోజిత్ మిశ్రా చేతిలో బలైపోయారని యువతి సంచలన ఆరోపణలు చేసింది. మోనోజిత్ మిశ్రా బ్యాచ్‌మేట్స్ కూడా అతనిపై ఇవే తరహా వ్యాఖ్యలు చేశారు. అతడు ఎప్పుడు ఇతరులను ఇబ్బందులకు గురరి చేసేవాడని తెలిపారు. కళాశాల క్యాంపస్‌లో యువతులను వేధించేవాడని ఆరోపించారు. 2025 జూన్ 28న సౌత్ కలకత్తా లా కాలేజీకి చెందిన ఒక మహిళా విద్యార్థినిపై అత్యాచారం చేశాడనే ఆరోపణలపై మోనోజిత్ మిశ్రాతో పాటు మరో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. మిశ్రా గతంలో తనకు పెళ్లి ప్రపోజ్ చేస్తే.. తాను తిరస్కరించానని.. దీంతో ఇద్దరు విద్యార్థులు చూస్తుండగానే తనపై అత్యాచారం చేశాడని బాధితురాలి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

# నగరంలో జోరువానతో రోడ్లన్నీ జలమయం

## ట్రాఫిక్ చిక్కుల్లో పడ్డ వాహనదారులు

**హైదరాబాద్,జులై 1(సమయజ్యోతి):**

నగరంలో మరోసారి వర్షం బీభత్సం సృష్టిస్తుంది. నగరంలోని పలు ప్రాంతాల్లో అకస్మాత్తుగా కుండపోత వర్షాలు కురవడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. ముఖ్యంగా జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఫిల్మ్ నగర్, కూకట్‌పల్లి, ఎల్బీ నగర్, మియాపూర్, అమీర్‌పేట, టోలిచౌకి, బీరంగూడ, పటాన్ చెరువు, బీహెచ్‌ఈఎల్, షేక్ పేట్, మెహిదీపట్నం, లంగర్ హౌస్, కోఠి, గచ్చిబౌలి, అత్తాపూర్ లాంటి ప్రాంతాల్లో వర్షానికి ట్రాఫిక్ తీవ్రంగా స్తంభించిపోయింది. అయితే, వర్షం కురవడంతో ఐటీ కారిడార్ లోని ఉద్యోగులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపైకి వరద నీరు వచ్చి చేరడంతో లోతట్టు ప్రాంతాలు మునిగిపోయింది. రోడ్లపైకి నీరు రావడంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వర్షానికి వాహనాలు స్లోగా ముందుకు కదలడంతో ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడ్డాయి. మరి కొన్ని గంటల్లో తెలంగాణ వ్యాప్తంగా విస్తారంగా వర్షం కురిసే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని అధికారులు సూచిస్తున్నారు. ఇప్పటికే, జీహెచ్‌ఎంసీ టాస్క్‌ఫోర్స్, డిజాస్టర్ రెస్పాన్స్ టీమ్‌లు రంగంలోకి దిగాయి.

# మేడ్చెల్ కంపెనీలో పేలుడు : ఒకరిగి గాయాలు

**మేడ్చెల్,జులై 1(సమయజ్యోతి):**

పాశమైలారం పారిశ్రామిక వాడలోని ఫార్మా కంపెనీలో సోమవారం భారీ పేలుగు ఘటన తరహాలోనే మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో మంగళవారం ప్రమాదం చోటుచేసుకుంది. మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ కంపెనీ పేలుడు సంభవించింది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ పారిశ్రామికవాడలోని ఆల్కలాయిడ్ కంపెనీలో బాయిలర్ పేలి ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. షాపూర్‌కు చెందిన మూల శ్రీనివాస్ రెడ్డి గత 12 సంవత్సరాలుగా కంపెనీలో పనిచేస్తునాడు. ఉదయం కంపెనీలో బాయిలర్ ఒకసారిగా పేలడంతో అతను కుప్పకూలిపోయాడు. దీంతో కంపెనీ లోని తోటి కార్మికులు అతనిని స్థానికంగా ఉన్న ఒక ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. అయితే, ఈ విషయం బయటకి రాకుండా కంపెనీ యాజమాన్యం గోప్యంగా ఉంచింది.

# 58 ఏళ్లుగా ఎడ్జ్‌బాస్టన్ లో గెలవని టీమిండియా



ఇక్కడ ఇప్పటి వరకు 8 టెస్ట్‌లు ఆడిన టీమిండియా.. ఒక్క మ్యాచ్ కూడా గెలవలేదు. ఏడు మ్యాచ్‌ల్లో ఓడిన టీమిండియా ఒకే ఒక్క మ్యాచ్ డ్రా చేసుకుంది. అది కూడా 39 ఏళ్ల క్రితం(1986) డ్రా చేసుకుంది. 1967 నుంచి ఈ మైదానంలో టెస్ట్ మ్యాచ్‌లు ఆడుతున్న టీమిండియా ఒక్క విజయం సాధించలేదు. 2022లో చివరిసారిగా ఇక్కడ జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో టీమిండియా 7 వికెట్ల తేడాతో ఓటమిపాలైంది. ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ్ 378 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేధించింది. ఈ వేదికపై విరాట్ కోహ్లీ , రిషభ్ పంత్‌కు మెరుగైన రికార్డ్ ఉంది.ఎడ్జ్‌బాస్టన్ పిచ్ సాంప్రదాయకంగా పేస్ బౌలర్లకు అనుకూలంగా ఉంటుంది. ముఖ్యంగా తొలి రెండు రోజులు పేస్‌కు సహకరిస్తోంది. వాతావరణం చల్లగా ఉండి, పిచ్‌పై పచ్చ గడ్డి ఉంటే బంతి స్వింగ్ అవుతోంది. మ్యాచ్ సాగుతున్నా కొద్ది పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా మారుతోంది. ఆట ఆఖరి రోజుకు చేరితే పిచ్‌పై పగుళ్లు ఏర్పడి స్పిన్‌కు అనుకూలిస్తోంది. ఇక్క టాస్ గెలిచిన జట్టు బౌలింగ్ ఎంచుకోవడానికి మొగ్గు చూపుతోంది. పిచ్ కండిషన్స్ నేపథ్యంలో రెండో టెస్ట్‌లో బుమ్రా ఆడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

# టి20 పవర్ ప్లేలో సరికొత్త రూల్స్

## బౌలర్లకు అనుకూలంగా కొత్త నిబంధనలు

ప్రస్తుతం క్రికెట్‌లో టి20 ఫార్మాట్ హవా నడుస్తుంది. ఐపీఎల్ రాకతో టి20లకు మరింత క్రేజ్ పెరిగిపోయింది. ఫ్యాన్స్ కూడా టి20లను చూసేందుకు ఎక్కువగా ఆసక్తిని ప్రదర్శిస్తున్నారు. ఫ్యూచర్‌లో టెస్టు ఫార్మాట్, టి20లకు మాత్రమే ఆదరణ ఉండే అవకాశం ఉంది. వన్డేలు కనుమరుగవ్వడం ఖాయం.ఇక టి20ల్లో జూలై నుంచి కొత్త రూల్స్ రానున్నాయి. ఇందుకు సంబంధించి ఐసీసీ కీలక ప్రకటన చేసింది. టి20ల్లో జూలై నుంచి కొత్త నిబంధనలు అమల్లోకి రానున్నాయి. ఇందులో పవర్ ప్లేకు సంబంధించిన రూల్స్ అందరినీ ఆశ్చర్యపరిచే అవకాశం ఉంది. బౌలర్లకు అనుకూలంగా ఐసీసీ రూల్స్ ఉన్నాయి.టి20 ఫార్మాట్‌లో పవర్ ప్లే 6 ఓవర్ల పాటు ఉంటుంది. అంటే మొదటి ఆరు ఓవర్లలో 30 గజాల సర్కిల్‌లోనే 9 మంది ప్లేయర్లు ఉండాల్సి ఉంటుంది. ఆ సర్కిల్ బయట కేవలం ఇద్దరు మాత్రమే ఉంటారు. పవర్ ప్లే ముగిసిన తర్వాత 30 గజాల సర్కిల్ బయట 5గురు ప్లేయర్లు ఉంటారు.ఇక వర్షంతో మ్యాచ్ కుదించినపుడు పవర్ ప్లేలో మార్పులు ఉంటాయి. అయితే ఇంతకుముందు ఓవర్ల ప్రకారం కుదించిన పవర్ ప్లే ఉండేది. అయితే ఇకపై అది బంతుల లెక్కన ఉండనుంది. ఉదాహరణకు వర్షం కారణంగా మ్యాచ్ ఇన్నింగ్స్‌కు ఐదు ఓవర్ల పాటు కుదించాల్సి వస్తే.. అప్పుడు పవర్ ప్లే 1.3 ఓవర్లు ఉంటుంది. అంటే 9 బంతులుగతంలోనూ ఇది ఉండేది. అయితే 1.3 ఓవర్లను 2 ఓవర్లకు మార్చేవారు. అయితే ఈసారి కచ్చితత్వం ఉండాలనే ఉద్దేశంతో బంతుల లెక్కన పవర్ ప్లే ఉండనుంది. 5 ఓవర్లకు 1.3 బంతులు పవర్ ప్లే ఉంటుంది. 6 ఓవర్ల ఇన్నింగ్స్‌కు 1.5 ఓవర్లు.. అంటే 11 బంతులు పవర్ ప్లే ఉంటుంది.7 ఓవర్లకు 2.1 ఓవర్లు.. 8 ఓవర్లకు 2.2 ఓవర్లు.. 9 ఓవర్లకు 2.4 ఓవర్లు.. 10 ఓవర్లకు 3 ఓవర్లు.. 11 ఓవర్లకు 3.2 ఓవర్లు.. 12 ఓవర్లకు 3.4 ఓవర్లు.. 13 ఓవర్లకు 3.5 ఓవర్లు.. 14 ఓవర్లకు 4.1 ఓవర్లు.. 15 ఓవర్లకు 4.3 ఓవర్లు.. 16 ఓవర్లకు 4.5 ఓవర్లు.. 17 ఓవర్లకు 5.1 ఓవర్లు.. 18 ఓవర్లకు 5.2 ఓవర్లు.. 19 ఓవర్లకు 5.4 ఓవర్ల చొప్పున పవర్ ప్లే ఉండనుంది.ఇక వైడ్స్ విషయంలోనూ రూల్స్ మారనున్నాయి. వన్డే, టి20ల్లో బంతి లెగ్ సైడ్ వెళితే చాలు వైడ్ గా ప్రకటిస్తారు. షాట్ ఆడే సమయంలో బ్యాటర్ పక్కకు జరిగినా దానిని పెద్దగా ప్రకటించుకోరు. ఈ క్రమంలో వైడ్ విషయంలో బౌలర్లకు అన్యాయం జరుగుతూ వస్తోంది. ఇకపై బంతిని విడుదల చేసే సమయంలో బ్యాటర్ కాలు ఎక్కడ ఉందనే దానిని బట్టి నిర్ణయం తీసుకుంటారు. ఐపీఎల్‌లో ఇప్పటికే ఈ తరహా రూల్ అమలులో ఉంది. తాజాగా దానినే ఐసీసీ అంతర్జాతీయ క్రికెట్‌లో కూడా ఉపయోగించనుంది.ఇక కన్‌కషన్ సబ్‌స్టిట్యూట్ విషయంలోనూ మార్పు ఉండనుంది. గతంలోలాగా ఎవర్ని పడితే వారిని కంకషన్ సబ్ స్టిటూట్‌గా చేసే అవకాశం లేదు. ముందే పేర్లను ఇవ్వాల్సి ఉంటుంది. ఇంపాక్ట్ ప్లేయర్ విషయంలో ఎలా అయితే పేర్లు ఇస్తారో.. కంకషన్ సబ్ స్టిట్యూట్‌కు కూడా ఇవ్వాల్సి ఉంది. ఆటలో ప్లేయింగ్ ఎలెవెన్‌లో ఉన్న ప్లేయర్లలో ఎవరికైనా తలకు గాయమై ఆడలేని స్థితిలో ఉంటే అప్పుడు కంకషన్ సబ్ స్టిట్యూట్ నుంచి రీప్లేస్ చేస్తారు.

# నేడు భారత్ ఇంగ్లండ్ జట్ల మధ్య రెండో టెస్టు







ఎడ్జ్ బాస్టన్ వేదికగా జరగనున్న మ్యాచ్ నెట్స్ లో తీవ్రంగా శ్రమిస్తున్న ఇరు జట్ల ఆటగాళ్ళు భారత్ ఇంగ్లండ్ జట్ల మధ్య రెండో టెస్టు బుధవారం (జూలై 2న) ఆరంభం కానుంది. ఎడ్జ్ బాస్టన్ వేదికగా ఈ మ్యాచ్ జరగనుంది. ఇరు జట్లు కూడా ఈ మ్యాచ్ లో విజయం సాధించాలనే పట్టుదల మీద నెట్స్ తీవ్రంగా శ్రమిస్తున్నాయి. తొలి టెస్టులో విఫలం అయిన శార్దుల్ ఠాకూర్, సాయి సుదర్శన్‌లను పక్కన పెట్టాలనే యోచనలో టీమిండియా మేనేజ్ మెంట్ ఉన్నట్లు తెలుస్తుంది. తొలి టెస్టులో శార్దుల్ ఠాకూర్ రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ కలిపి కేవలం 4 పరుగులు చేశాడు. రెండు వికెట్లు మాత్రమే తీశాడు. ఇక సాయి సుదర్శన్ విషయానికి వస్తే తొలి ఇన్నింగ్స్‌లో డకౌట్ అయ్యాడు. రెండో ఇన్నింగ్స్ లో 30 పరుగులు చేసి ఫర్వాలేదనిపించాడు. అయితే జట్టు ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని వీరిద్దరిని పక్కన పెట్టాలనే ఉద్దేశంలో టీమిండియా ఉంది. వీరిద్దరి స్థానాల్లో నితీశ్ కుమార్ రెడ్డి, కుల్దీప్ యాదవ్‌లు తుది జట్టులో వచ్చే అవకాశం ఉంది. ఇక తొలి టెస్టు మాదిరే రెండో టెస్టులోనూ బరిలోకి దిగే ప్లేయింగ్ ఎలెవెన్‌ను 48 గంటల ముందుగానే ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచింది. టీమిండియా ఇప్పటి వరకు తుది జట్టును ఒక్కసారి కూడా ముందుగా ప్రకటించలేదు. కానీ, ఇంగ్లండ్ అలా కాదు.. ముందే ప్రకటించింది. ఇక రెండో టెస్టులో జోఫ్రా ఆర్చర్‌కు తుది జట్టులో చోటు కల్పించలేదు. తొలి టెస్టులో బరిలోకి దిగిన జట్టుతోనే బరిలోకి దిగనుంది.తొలి టెస్టులో నెగ్గిన ఇంగ్లండ్ ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో ఆధిక్యంలో కొనసాగుతుంది. ఈ క్రమంలో రెండో టెస్టులో ఓడినా వారికి పెద్దగా నష్టం జరగదు. దాంతోనే ఇంగ్లండ్ జోఫ్రా ఆర్చర్‌ను పక్కన పెట్టి ఉండొచ్చు. విన్నింగ్ టీమ్‌ను ఎందుకు మార్చడం అనే ఉద్దేశంలో కూడా ఇంగ్లండ్ మేనేజ్ మెంట్ ఉండొచ్చు. ఇక తొలి టెస్టులో ఇంగ్లండ్ తరఫున ఒలీ పోప్, బెన్ డకెట్‌లు సెంచరీలు బాదారు. క్రాలీ, బ్రూక్, రూట్, స్టోక్స్‌లు ఆకట్టుకున్నారు. ఇక బౌలింగ్ లో టంగ్, కార్స్, స్టోక్స్‌లు రాణించారు. ఈ క్రమంలో రెండో టెస్టులో కూడా ఇదే తరహా ప్రదర్శన ఇవ్వాలనే యోచనలో ఇంగ్లండ్ ఉన్నట్లు తెలుస్తుంది.ఇక పిచ్ విషయానికి వస్తే.. నాలుగో ఇన్నింగ్స్ కష్టంగా ఉంటుంది. టాస్ గెలిచిన జట్టు బ్యాటింగ్ ఎంచుకునే అవకాశం ఉంటుంది. ఇక్కడ నాలుగు ఇన్నింగ్స్‌ల సగటును చూస్తే.. తొలి ఇన్నింగ్స్‌లో 310 పరుగులు.. రెండో ఇన్నింగ్స్ లో 280 పరుగులు.. మూడో ఇన్నింగ్స్‌లో 230 నుంచి 250 పరుగులు.. నాలుగో ఇన్నింగ్స్‌లో 170 నుంచి 200 పరుగుల మధ్య ఉంది. ఇంగ్లండ్ తుది జట్టు :జాక్ క్రాలీ, బెన్ డకెట్, ఒలీ పోప్, జో రూట్, బ్రూక్, బెన్ స్టోక్స్ (కెప్టెన్), జెమీ స్మిత్, క్రిస్ వోక్స్, కార్స్, టంగ్, బషీర్టీమిండియా తుది జట్టు (అంచనా) : శుబ్ మన్ గిల్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, రిషభ్ పంత్, కరుణ్ నాయర్, రవీంద్ర జడేజా, నితీశ్ కుమార్ రెడ్డి, కుల్దీప్ యాదవ్, బుమ్రా/అర్ష్ దీప్ సింగ్, సిరాజ్, ప్రసిధ్ కృష్ణ

# యశ్ దయాల్‌పై కేసు నమోదు

క్రికెటర్ యశ్ దయాల్ తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసి, లైంగికంగా వేధించాడని ఓ మహిళ ఆరోపించింది. బాధితురాలు మాట్లాడుతూ, %=జదీ% స్టార్ బౌలర్ యశ్ దయాల్‌తో తాను 5 సంవత్సరాలు రిలేషన్‌లో ఉన్నానని, అయితే ఆ సమయంలో తను శారీరకంగా, మానసికంగా వేధించాడని మహిళ సంచలన ఆరోపణలు చేశారు. గత శనివారం తొలిసారిగా ఆరోపణలు రాగా, యశ్ దయాల్‌కు చాలా మంది మహిళలతో సంబంధాలు ఉన్నాయని ఆరోపణలు రావడం కలకలం రేపుతోంది. దైనిక్ భాస్కర్ ప్రకారం, యూపీలోని ఘజియాబాద్ కు చెందిన ఓ మహిళ చీఫ్ మినిస్టర్ ఆన్‌లైన్ గ్రీవెన్స్ పోర్టల్ ద్వారా క్రికెటర్ యశ్ దయాల్‌పై ఫిర్యాదు చేశారు. అతడికి పలువురు మహిళలతో సంబంధాలు ఉన్నాయని ఆమె ఆరోపించారు. ఫిర్యాదుపై స్పందించిన ఘజియాబాద్ పోలీసులు ఆమె వాంగ్మూలాన్ని నమోదు చేసిన తర్వాత ఆర్సీబీ పేసర్ యశ్ దయాల్‌కు నోటీసులు పంపారు. యశ్ దయాల్‌కు ఈ మహిళతో సోషల్ మీడియా ద్వారా పరిచయం కాగా, వారి మధ్య చాటింగ్ ప్రారంభమైందని ఇదే నివేదికలో పేర్కొన్నారు. ప్రయాగ్ రాజ్‌లో కలిసినట్లు తెలిపింది. ఈ మహిళ యశ్ దయాల్ కుటుంబంతో సైతం క్లోజ్‌గా ఉండేదని, వారి ఇంటికి కూడా వెళ్లానని చెబుతోంది. ఆమె గతంలో ఎడ్ టెక్ కంపెనీలో జాబ్ చేసింది. అయితే యశ్ దయాల్ తండ్రి మాత్రం ఆరోపణలు చేసిన మహిళను గుర్తించడానికి నిరాకరించారు. ఫిర్యాదు చేసిన మహిళ మాట్లాడుతూ, తాను ఫిబ్రవరి 2025లో %=జదీ% ఆటగాడి వివాహ వేడుకలో పాల్గొన్నానని తెలిపింది. అప్పుడే యష్ దయాల్ నిశ్చితార్థం గురించి చర్చ జరిగింది. తనతో రిలేషన్ లో ఉన్న సమయంలోనూ ఆటగాడు పలువురు మహిళలతో రిలేషన్‌లో ఉన్నాడని ఆమె చెప్పింది. ఏప్రిల్ 17న తనకు మరో మహిళ నుండి ఫోన్ వచ్చిందని, యశ్ దయాల్ తనతో రిలేషన్‌లో ఉన్నట్లు ప్రూఫ్స్ ఉన్నాయని పేర్కొంది. మరో ముగ్గురు మహిళలు కూడా క్రికెటర్‌పై ఇలాంటి ఆరోపణలు చేయడంతో హాట్ టాపిక్ అవుతోంది.






దైనిక్ భాస్కర్ ప్రకారం, ఆ మహిళ మాట్లాడుతూ, “అధికారం, డబ్బు, పరపతి ద్వారా ఈ కేసును నీరు గార్చడానికి ప్రయత్నిస్తున్నారు. నాకు భారత న్యాయ వ్యవస్థపై పూర్తి నమ్మకం ఉంది. అతను నన్ను మోసం చేస్తున్నాడు. అతడి కుటుంబ సభ్యులు నాతో తప్పుగా ప్రవర్తించడంతో నేను చట్టాన్ని ఆశ్రయించాను” అని పేర్కొంది. ఐపీఎల్ ఫైనల్ సందర్భంగా ఆమె యశ్ దయాల్ కుటుంబంతో కలిసి నరేంద్ర మోడీ స్టేడియంలో కనిపించింది. ఆ ఫైనల్లో గుజరాత్ టైటాన్స్ విజయం సాధించింది. ఆ తర్వాత ఆ జంట జూన్‌లో యశ్ దయాల్ సోదరి, స్నేహితుడితో కలిసి ఊటీకి వెళ్లి వెస్ట్టన్ వ్యాలీ రిసార్ట్‌లో స్టే చేశారు. ఆ ట్రిప్ లో తీసుకున్న ఫోటోలను సైతం ఇద్దరూ తమ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు.యశ్ దయాల్ దేశవాలీ క్రికెట్‌లో ఉత్తరప్రదేశ్‌కు, ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో ప్రస్తుతం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు ప్రాతినిథ్యం వహిస్తున్నాడు. అతడు ఎడమచేతి వాటం గల పేస్ బౌలర్.

# ఇంగ్లాండ్ జట్టులో ఊహించని మార్పులు!

ఆనవాయితీ ప్రకారం మ్యాచ్ కు రెండ్రోజుల ముందుగానే ఇంగ్లాండ్ తమ ప్లేయింగ్ లెవన్ ను ప్రకటించింది. తొలి టెస్టులో ఆడిన జట్టుతోనే బరిలోకి దిగుతోంది. అయితే ఇంగ్లాండ్ తాజా నిర్ణయం పలువురిని ఆశ్చర్య పరుస్తోంది. రెండోటెస్టు కోసం ప్రకటించిన స్క్వాడ్ లో ప్రీమియర్ పేసర్ జోఫ్రా ఆర్చర్ పేరును చేర్చడమే దీనికి కారణం. అయితే అందుబాటులో ఉన్న అతడిని రెండో టెస్టులో ఆడించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. తను పూర్తి ఫిట్ గా లేడా..? అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. నిజానికి తొలి టెస్టులో అంతగా అనుభవం లేని పేసర్లతో బరిలోకి దిగి, భారీగా పరుగులను ఇంగ్లాండ్ సమర్పించుకుంది. తొలి వికెట్ ను తొలి ఇన్నింగ్స్ లో తీయడంలో ఇంగ్లాండ్ పేసర్లు తడబడ్డారు. ఈక్రమంలో తొలి ఇన్నింగ్స్ లో 6 పరుగుల స్వల్ప ఆధిక్యాన్ని కూడా భారత్ కు కోల్పోయింది. బ్యాటర్ల పుణ్యామా అని 371 పరుగుల టార్గెట్ ను ఛేదించడంతో ఆ మ్యాచ్ ను ఇంగ్లాండ్ తన ఖాతాలో వేసుకుంది. ఇక రెండో టెస్టుకి ఆర్చర్ అందుబాటులోకి రావడంతో అతడిని కచ్చితంగా ఆడిస్తారని అంతా, అనుకున్నా, తాజాగా అతడిని బెంచ్ కే పరిమితం చేశారు. గత కొంతకాలంగా ఆర్చర్ పలు గాయాలతో ఇబ్బంది పడుతున్నాడు. తొలుత మోచేతి గాయం, ఆ తర్వాత వెన్ను నొప్పితో చాలా కాలం క్రికెట్ కు దూరమయ్యాడు. చాలాకాలం కిందట అంటే 2021 ఫిబ్రవరిలో తను చివరి సారిగా టెస్టు ఆడాడు. దాదాపు నాలుగేళ్లుగా తను సుదీర్ఘ ఫార్మాట్ కు దూరంగా ఉంటున్నాడు. అయితే ఇటీవలే కాస్త ఫిట్ నెస్ సంతరించుకుని, కౌంటీల్లో సస్సెక్స్ తరపున ఆడాడు. అందులో ఫర్వాలేదనిపించాడు. మునుపటి వేగం, లైన్ అండ్ లెంగ్త్ తో ఆకట్టుకున్నాడు. దీంతో అతడిని రెండో టెస్టు స్క్వాడ్ లోకి కూడా తీసుకున్నారు. అయితే తుదిజట్టులో మాత్రం చోటు కల్పించలేదు. తొలి టెస్టులో నెగ్గిన జట్టుతోనే బరిలోకి దిగాలని ఇంగ్లాండ్ టీమ్ మేనేజ్మెంట్ భావిస్తుండటంతో ఎలాంటి మార్పులు లేని జట్టుతో ఇంగ్లీష్ జట్టు ఆడుతోందని తెలుస్తోంది. ఇక ఎడ్జ్ బాస్టన్ లో జరిగే ఈ రెండో టెస్టులో ఇరుజట్లు గెలుపే టార్గెట్ గా బరిలోకి దిగుతున్నాయి. 5 టెస్టుల ఈ సిరీస్ లో 1-0తో ఆధిక్యంలో ఉన్న ఇంగ్లాండ్ ఈ మ్యాచ్ లో గెలిచి, సిరీస్ లో మరింత పట్టు సాధించాలని చూస్తోంది.

# రానా దగ్గుబాటి మరో కొత్త తరహా చిత్రం

## గ్రామీణ నేపథ్యంలో కొత్తపల్లిలో ఒకప్పుడు

ప్రస్తుతం వైవిధ్యమైన కథలతో ప్రయోగాలు చేస్తున్న రానా దగ్గుబాటి మరో కొత్త తరహా చిత్రానికి శ్రీకారం చుట్టారు. ఈ సినిమా పేరే ఆసక్తికరంగా 'కొత్తపల్లిలో ఒకప్పుడు' అని పెట్టారు. గ్రామీణ నేపథ్యం తో సాగే ఈ భావోద్వేగ కథ వెనక సున్నితమైన సామాజిక సందేశం కూడా ఉంది. ఈ చిత్రానికి ప్రవీణ పరుచూరిదర్శకత్వం వహిస్తున్నారు. ఇదివరకే 'కేరాఫ్ కంచరపాలెం', 'ఉమా మహేశ్వర ఉగ్రరూపస్య' వంటి చిన్న సినిమాలతో పెద్ద సెన్సిబుల్ హిట్స్ అందించిన ప్రవీణ, ఈసారి మరింత లోతైన కథతో ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ కథలో గ్రామీణ యువకుడు తన జీవితంలో ఎదురైన ఓ అనూహ్యసంఘటన, తరువాత ఎదుర్కొన్న ప్రయాణాన్ని చూపించ నుంది. మారుతున్న సమాజంలో గ్రామీణ సంస్కృతి, విలువలు, సంబంధాలు ఎలా మాయమవుతున్నాయనే విషయాన్ని ఈ చిత్రం లోతుగా చూపనుంది. కాగా ఈ మూవీలో రానా, పూర్తి గ్రామీణ గెటప్‌లో కనిపించనున్నాడు. ఇప్పటి వరకు చూడని ఓ మెలోడ్రామా టిక్, ఎమోషనల్ కోణంలో రానా నటనను ఈ సినిమాలో చూడబోతున్నాం. మేకర్స్ చెబుతున్న దానివల్ల ఇది రానా కెరీర్‌లో కొత్త మలుపు కావొచ్చని అంచనాలు ఉన్నాయి. ఈ సినిమాకు లాస్ ఏంజిల్స్‌కి చెందిన అవార్డ్ విన్నింగ్ సినిమాటోగ్రాఫర్ విజువల్స్ అందిస్తుండగా, ఈ 'కొత్తపల్లిలో ఒకప్పుడు' త్వరలోనే థియేటర్లలో విడుదల కానుంది. ఇప్పటికే టైటిల్ పాయింట్, కాన్సెప్ట్ విషయంలో మంచి బజ్ క్రియేట్ అవ్వగా. ఇప్పుడు చూడాల్సిందల్లా ఈ కొత్త ప్రయోగం రానాకు హిట్ అందిస్తుందా లేదా అన్నది.





# ట్రైలర్స్‌తో దూసుకుపోతున్న తమ్ముడు

టాలీవుడ్‌స్టార్ హీరో నితిన్ 'తమ్ముడు' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే. చివరిగా రాబిన్ హుడ్‌తో ప్రేక్షకులని పలకరించగా, ఈ చిత్రం బాక్సాఫీస్ దగ్గర బోల్తా కొట్టింది. దీంతో ఇప్పుడు దర్శకుడు వేణు శ్రీరామ్ దర్శకత్వంలో ఎమోషనల్ యాక్షన్ డ్రామాగా తమ్ముడు సినిమా చేశారు. ఇది జూలై 4న థియేటర్లలో రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ ప్రమోషన్స్ స్పీడ్ పెంచారు. ఇంటర్వ్యూలు, ప్రీ రిలీజ్ ఈవెంట్స్ ఇలా సినిమాపై ఆసక్తిని కలిగించే ప్రయత్న చేశారు. మరోరెండు రోజులలో తమ్ముడు చిత్రం విడుదల కానుండగా, చిత్ర బృందం రిలీజ్ ట్రైలర్ కొద్దిసేపటి క్రితం విడుదల చేసింది. నేను పుట్టినప్పుడే మా అమ్మ చనిపోయింది.. అనే డైలాగ్‌తోట్రైలర్ మొదలైంది.నాకు అమ్మ అయిన నాన్న అయిన అన్నీ మా అక్కే అనే డైలాగ్ ఈ మూవీ సిస్టర్ సెంటిమెంట్‌తో రూపొందుతుంది అని తెలియజేస్తుంది. ట్రైలర్ ఎమోషన్స్, యాక్షన్ తోనిండిపోయింది. మూవీపై భారీ అంచనాలే పెంచింది. ఈ చిత్రం నితిన్‌కి తప్పక మంచి హిట్ ఇస్తుందని ఫ్యాన్స్ భావిస్తున్నారు. ఇందులో సప్తమి గౌడ, వర్ష బొల్లమ్మ, స్వాశికకథానాయికలుగా నటిస్తున్నారు. చిత్రంలో నితిన్ కి అక్కగా ఒకప్పటి హీరోయిన్ లయ నటిస్తుండగా, ఈ చిత్రంతోనే రీ ఎంట్రీ ఇస్తుంది. మూవీకి సంబంధించిన విడుదలైన టీజర్,పాటలు, ట్రైలర్ లకు మంచి స్పందన వచ్చింది. ఇప్పుడు ఈ ట్రైలర్ కూడా ఆకట్టుకుంది. అయితే పవన్‌కు వీరాభిమాని అయిన నితిన్ ఇదే టైటిల్‌తో సినిమా చేశారు. సినిమా టైటిల్ ఒక్కటే అయినప్పటికీ స్టోరీలు మాత్రమ వేర్వేరుగా ఉండనున్నాయి. అయితే ఈ సినిమా టైటిల్ వాడడం పట్ల తాను సంతోషంగా లేనని నితిన్ రీసెంట్‌గా పాల్గొన్న ఇంటర్వ్యూలో తెలిపారు. ఈ కథకు ఆ టైటిల్ మాత్రమే న్యాయం చేస్తుందని ప్రొడ్యూసర్ దిల్ రాజు, డైరెక్టర్ వేణు శ్రీరామ్ భావించి పట్టుబట్టి మరీ తనను ఒప్పించినట్టు నితిన్ చెప్పుకొచ్చారు.








# ది హంట్

## ది రాజీవ్ గాంధీ అస్సాసినేషన్ కేస్'

### రాజీవ్ హత్య ఆధారంగా మూవీ

మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ హత్య ఆధారంగా 'ది హంట్: ది రాజీవ్ గాంధీ అస్సాసినేషన్ కేస్'ను జాతీయ అవార్డు గ్రహీత నాగేష్ కుకునూర్ తెరకెక్కించారు. అనిరుధ్య మిత్ర బెస్ట్ సెల్లింగ్ పుస్తకం 'నైన్టీ డేస్' నుంచి ఈ సిరీస్‌ను నగేష్ కుకునూర్ రూపొందించారు. ఆ కేసుని ఛేదించే క్రమంలో ÷ూఎ÷ుకి నాయకత్వం వహించిన వారు ఆ.ఖీ. కార్తీకేయన్. ఆయన పాత్రను అమిత్ సియాల్ పోషిస్తున్నారు.ఈ మేరకు అమిత్ సియాల్ మాట్లాడుతూ..'ఒక నటుడికి ఇలాంటి ఓ గొప్ప పాత్రను పోషించే అవకాశం రావడం అదృష్టం.కార్తీకేయన్ లాంటి గౌరవప్రదమైన, దృఢ నిశ్చయం ఉన్న వ్యక్తిని పాత్రను బాధ్యతతో పోషించాల్సి ఉంటుంది. ఇది కేవలం రాజకీయ థ్రిల్లర్ కాదు. కార్తికేయన్ పేలుడు జరిగిన ప్రదేశాన్ని సందర్శించే క్షణం ఉంటుంది. అక్కడ శరీరం అయితే కనిపించ లేదు. ఎండిన రక్తానికి సంబంధించిన పెద్ద గుర్తు మాత్రమే ఉంటుంది. ఒకరిని కోల్పోవడం.. అసలు వీడ్కోలు చెప్పే వీలు కూడా లేని ఘటన ఎంతగానో కదిలిస్తుంటుంది. ఈ సిరీస్‌లో ఎస్పీ అమిత్ వర్మగా సాహిల్ వైద్, డిఎస్పీ రగోత్తమన్‌గా భగవతి పెరుమాళ్, డిఐజి అమోద్ కాంత్‌గా డానిష్ ఇక్బాల్, డిఐజి రాధావినోద్ రాజుగా గిరీష్ శర్మ, మరియు ఎన్ఎస్జి కెప్టెన్ రవీంద్రన్‌గా విద్యుత్ గార్గ్. ఈ సిరీస్‌లో షఫీక్ ముస్తఫా, అంజనా బాలాజీ, బి. సాయి దినేష్, శ్రుతి జయన్, గౌరీ మీనన్ కూడా కీలక పాత్రల్లో నటించారు. 'ది హంట్: ది రాజీవ్ గాంధీ అస్సాసినేషన్ కేస్' సిరీస్ జూలై 4న సోనీ లివ్‌లో స్ట్రీమింగ్ కానుంది.

# ఇండియన్ సినిమాను ఉన్నతంగా నిలిపే యత్నం

## ప్రత్యేకంగా సిద్ధం అవుతున్న వార్-2




ఇండియన్ సినిమాను ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు యష్ రాజ్ ఫిలిమ్స్, బాలీవుడ్ డైరెక్టర్ అయాన్ ముఖర్జీ సిద్ధమవుతున్నారు. మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ , గ్రీక్ గాడ్ హృతిక్ రోషన్ ల కలయికలో రూపుదిద్దుకుంటున్న మోస్ట్ అవెయిటెడ్ పాన్ ఇండియా యాక్షన్ ఎంటర్‌టైనర్ 'వార్ 2' ఇప్పటికే భారీ అంచనాలు ఏర్పరచుకుంది. ఇప్పుడు తాజాగా ఈ సినిమాకు సంబంధించి ఓ క్రేజీ అప్‌డేట్ బయటకు వచ్చింది. వార్ 2లో యాక్షన్ ఒక్కటే కాదు? ఎనర్జీ పరంగా దుమ్ములేపే డాన్స్ నెంబరు కూడా ఉండబోతోంది. ఇండియన్ సినిమా ఇండస్ట్రీలో అత్యుత్తమ డ్యాన్సర్లు అని పేరొందిన ఎన్టీఆర్, హృతిక్ రోషన్ ఇద్దరు కలిసి ఒకే స్క్రీన్‌పై స్టెప్పులేస్తే, అది రొటీన్ సాంగ్ మాదిరిగా కాకుండా డైనమిక్ మ్యూజికల్ ట్రీట్‌గా ఉంటుందని అంటున్నారు. ఇటీవల యష్ రాజ్ స్టూడియోస్‌లో ఈ సాంగ్ కోసం ఇద్దరు హీరోలు రిహార్సల్స్ చేయగా,ఈ రోజు నుంచే షూటింగ్ ప్రారంభమైంది. ఈ డాన్స్ నంబర్‌కి టాప్ కొరియోగ్రాఫర్ నేతృత్వం వహిస్తున్నట్లు తెలుస్తోంది. షూటింగ్ పలు రోజులు కొనసాగనుండగా, ఇందులో హైవోల్టేజ్ ఎనర్జీ, ఇంటెన్స్ స్టెప్స్ ఉండనున్నాయన్న టాక్ ఫిలింనగరంలో హీట్ పెంచుతోంది. వార్ 2ను కేవలం యాక్షన్ థ్రిల్లర్‌గా కాకుండా, అన్ని విభాగాల్లోనూ స్టాండర్డ్స్‌ని పెంచే ప్రయత్నం చేస్తున్నారు. ఎన్టీఆర్ ? హృతిక్ మధ్య ÷ట్స్ అన్నీ ఏకంగా హాలీవుడ్ స్థాయిలో తెరకెక్కుతుండగా, ఇప్పుడు డ్యాన్స్ ఎలిమెంట్ ఈ సినిమాను మరో లెవెల్‌కి తీసుకెళ్లనుంది. ఇద్దరికి సింగిల్ టేక్ డ్యాన్సర్లు అనే పేరుంది. ఎన్టీఆర్ తన బ్లాస్టింగ్ డ్యాన్స్ మూవ్‌లతో తెలుగులో తిరుగులేని డ్యాన్సర్‌గా గుర్తింపు పొందగా, హృతిక్ రోషన్ బాలీవుడ్‌లో తన స్టైలిష్ స్టెప్స్‌తో ప్రత్యేక గుర్తింపు సంపాదించాడు. అలాంటి స్టార్లను ఒకే పాటలో చూడడం అంటే, అభిమానులకే కాదు , ప్రేక్షకులందరికీ అది జీవితాంతం మరిచిపోలేని విజువల్ ఎక్స్‌పీరియన్స్ అవుతుంది. డ్యాన్స్ సీక్వెన్స్‌తో పాటు పవర్‌ప్యాక్డ్ యాక్షన్ ఎపిసోడ్స్ ఉన్న ఈ చిత్రం భారీ అంచనాలతో తెరకెక్కుతోంది. ఎన్టీఆర్ 'దేవర', హృతిక్ 'ృ÷టైర్' తర్వాత వీరిద్దరు కలిసి వార్ 2 చిత్రం చేస్తున్నారు. ఆగస్ట్‌లో విడుదల కానున్న ఈ సినిమాపై అంచనాలు భారీగానే ఉన్నాయి.

# పవన్ షూటింగ్ స్పాట్‌లోకి చిరు ప్రత్యక్షం

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఒక వైపు సినిమాలు, మరోవైపు రాజకీయాలతో బిజీ బిజీగా గడుపు తున్నారు. ప్రస్తుతం పవన్ చేస్తున్న ఈ సినిమాలు ఎప్పుడో విడుదల కావాలి. కాని ఆయన రాజకీయ పనుల వలన డిలే అవుతూ వచ్చాయి. ఇప్పటికే హరి హర వీరమల్లు చిత్ర షూటింగ్ పూర్తి చేయగా,ఈ మూవీని జూలై 24న ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఇక పవన్ నటిస్తున్న మరో చిత్రం ఓజీ షూటింగ్ కూడా పూర్తైందని తెలుస్తుంది. సుజీత్ దర్శకత్వంలో యాక్షన్ డ్రామాగా ఈ మూవీని తెరకెక్కిస్తున్నారు. సెప్టెంబర్‌లో మూవీ రిలీజ్‌కి ప్లాన్ చేశారు. ఇక పవన్ ఖాతాలో ఉన్న మరో చిత్రం ఉస్తాద్ భగత్ సింగ్. హరీష్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం ప్రస్తుతం అన్నపూర్ణ స్టూడియోస్‌లో చిత్రీకరణ జరుపుకుంటున్నట్టు సమాచారం. పలు కీలక సన్నివేశాలను పవన్ కళ్యాణ్‌తో తెరకెక్కిస్తున్నాడు హరీశ్ శంకర్. అయితే ఈ మూవీ సెట్‌కి మెగాస్టార్ చిరంజీవి రావడంతో సందడి వాతావరణం నెలకొంది. సోమవారం రోజు ఉస్తాద్ భగత్ సింగ్ సెట్‌లో అడుగుపెట్టిన చిరంజీవి చిత్రీకరణను దగ్గరుండి వీక్షించారు. దీనికి సంబంధించిన ఓ ఫొటో బయటకు వచ్చింది. ఇందులో చిరు షూటింగ్ సీన్?ను చూస్తుండగా, పవన్ కళ్యాణ్ పక్కనే ఉండడం మనం చూడవచ్చు. ప్రస్తుతం ఈ ఫొటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మెగా బ్రదర్స్ ఇద్దరు చాలా రోజుల తర్వాత కలిసి కనిపించడంతో ఫ్యాన్స్ ఆనందానికి అవధులు లేవు. ఇక ఈ చిత్రంలో రియల్ లైఫ్ సీన్‌ని హరీష్ ఎ÷-లాన్ చేసినట్టు సమాచారం. పవన్ కళ్యాణ్? ఆ మధ్య ఓ సందర్భంలో కారు రూఫ్?పై కూర్చొని ప్రయాణించడం మనం చూశాం. ఆయన కారు టాప్?పై కూర్చొని వెళుతుండగా, కారుకు ఇరువైపులా సెక్యూరిటీ, వెనకాల బైకులపై అభిమానులు వెళ్లారు. ఈ వీడియో అప్పట్లో సోషల్ మీడియాని షేక్ చేస్తుంది. ఇప్పుడు ఈ సీన్‌ని రీ క్రియేట్ చేసి సినిమాలో పెట్టనున్నాడట హరీష్ శంకర్. ఒకవేళ ఈ సీన్ సినిమాలో ఉంటే, థియేటర్లలో ఫుల్ విజిల్స్ పడడం పక్కా అని చెప్పాలి. ఇక ఈ చిత్రంలో పవన్ కళ్యాణ్ సరసన యువ నటి శ్రీలీల సందడి చేయనుంది.ఈ సినిమాకు దర్శకుడు దశరథ్ స్క్రీన్‌ప్లే అందిస్తున్నారు. సాక్షివైద్య, అశుతోష్ రానా, గౌతమి, నాగ మహేష్, టెంపర్ వంశీ, కేజీఎఫ్ ఫేమ్ అవినాష్ వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రల్లోన టిస్తున్నారు. రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ ఈ సినిమాకు సంగీతం సమకూరుస్తున్నారు.



EDITED, PRINTED AND PUBLISHED BY FAISAL KHAN PRINTED AT UJALA PRESS, LIG, 211 APHB COLONY ADILABAD, TELANGANA.
PUBLISHED FROM H.NO.4-4-120/C/3, SANJAY NAGAR COLONY, ADILABAD, TELANGANA STATE. EDITOR : FAISAL KHAN, RNI : APTEL/2013/53323, CELL : 94400 62685